Marvellous Stories from the Life of Muhammad (S)
(Telugu)

# నేలపై నిండు చంద్రుడు

(ముహమ్మద్ ప్రవక్త ﷺ జీవన దృశ్యాలు కొన్ని)

మూలం :
మర్దిజా ఆల్డ్‌రిచ్ టారింటినో

అనువాదం:
బా మేరాజ్

ప్రకాశకులు
శాంతి మార్గం పబ్లికేషన్ ట్రస్ట్
హైదరాబాద్

https://teluguislam.net

# Nelapai Nindu Chandrudu

**Marvellous Stories from the Life of Muhammad (S) (Telugu)**

Written by : Mardijah Aldrich Tarantino

Translation : Ba Meraj

Edited by : Hafiz S.M. Rasool Sharfi
Manzoor Ahmed Omari

© *All Rights Reserved with Publishers*

First Edition : December 2011

2nd Edition : June 2013

Copies : 2000

Price : **Rs.40-00**

DTP & Printing : Al-Baseer Graphics, Hyd.
9441055065

Published by : **Shanti Margam Publication Trust**
**Shanti Margam Publication Trust**
Jah Manzil, Beside Quadria Masjid
Sayeedabad Colony, Hyderabad.
Cell : 9676144697, 7386785012
E-mail: shantimargam@gmail.com

https://teluguislam.net

# విషయ సూచిక


1. శుభోదయం 5
2. నల్ల మచ్చ 8
3. జమ్‌జమ్ బావి 10
4. వంద ఒంటెల విందు 14
5. వర్తక బృందం 18
6. క్రైస్తవ పండితుడు–బహీరా 20
7. యవ్వనం 25
8. అల్లాహ్ పిలుపు 29
9. ఖురైష్ తెగ 34
10. ప్రతి పక్షం 41
11. జిన్నాత్ 48
12. రాత్రి ప్రయాణం 54
13. కొండ గుహ 58
14. మదీనా 69
15. మదీనా–2 74
16. బద్ర్ యుద్ధం 79
17. ఉహుద్ యుద్ధం 91
18. కందక యుద్ధం 100
19. తిరిగి రాక 106


https://teluguislam.net



# నేలపై నిండు చంద్రుడు

ఒక వెన్నెల రాత్రి -
నేను దైవప్రవక్త ﷺ ను చూశాను.
ఆయన ఎరుపు రంగు దుస్తుల్లో వున్నారు.
నేను ఆకాశంలోని చంద్రుణ్ణి ఒకసారి,
దైవప్రవక్త ﷺ ముఖారవిందాన్ని మరోసారి
ఇలా మార్చి మార్చి చూస్తూ ఉన్నాను.
అప్పుడు నాకు ఆకాశంలోని చంద్రుడి కన్నా
దైవప్రవక్త ﷺ ముఖారవిందమే
నిండు చంద్రునిలా
ఎంతో అందంగా కనిపించింది.

- జాబిర్ బిన్ సమురహ్ (రజి)
దైవప్రవక్త సహచరులు

https://teluguislam.net

అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో ప్రారంభం

# 1. శుభోదయం


మక్కా ఒక పురాతన నగరం. అది విశాలమైన అరేబియన్ ఎడారి ప్రాంతంలో ఉంది. మక్కాలోని ఒక పవిత్ర స్థలం పేరు కాబా. ప్రవక్తల పితామహుడు ఇబ్రాహీం కాలం నుంచే ఈ స్థలానికి ఎంతో విశిష్ఠత ఉండేది. బహుశా అంతకు ముందు నుంచే కావచ్చు, అంటే మొట్టమొదటి మానవుడు ఆదం కాలం నుంచే.

దైవదూత జిబ్రయీల్ స్వర్గం నుంచి తెచ్చిన ఒక పాలరాతిని ప్రవక్త ఇబ్రాహీంకు బహూకరించినట్లు చెప్పుకుంటారు. మనుషులు చేస్తున్న పాపాలను దహిస్తూ ఆ రాయి తన కాంతిని పోగొట్టుకుని నల్లగా మారిపోయింది. ఇప్పుడు అది నల్లరాయి (హజ్రె అస్వద్)గా పిలువబడుతోంది. ఆ రాయి ఇప్పటికీ కాబా గృహంలో ఉంది. ప్రపంచ వ్యాప్తంగా చాలామంది ముస్లింలు సంవత్సరానికి ఒకసారి హజ్‌యాత్ర సందర్భంగా ఆ పుణ్య స్థలాన్ని దర్శించుకుంటారు.

నేటికి దాదాపు 1500 యేండ్ల క్రితం అదే మక్కా నగరంలో అబ్దుల్ ముత్తలిబ్ అనే ఒక వృద్ధుడు ఉండేవాడు. ప్రముఖ అరబ్బు తెగ 'ఖురైష్'కు నాయకుడు ఆయన.

అబ్దుల్ ముత్తలిబ్ కాలంలో ఎన్నో రకాల వస్తు వులు కాబాగృహంలో దర్శనమిచ్చేవి. ఎర్రమట్టితో

https://teluguislam.net




తయారు చేసిన వింత వింత విగ్రహాలు ఉండేవి. దేవతల రూపాలు మానవుడి ఆకృతుల్లో విగ్రహాలుగా మలచబడి ఉండేవి. హుబల్, లాత్, ఉజ్జా అనే మాయా విగ్రహాలు ఉండేవి. మనిషిని ధనవంతులను చేసే శక్తి, జబ్బుని నయం చేసే శక్తి, సంతానం కలిగించే శక్తి, రాజకుమారులను చేసే శక్తి ఇంకా ఎన్నెన్నో శక్తులు ఆ విగ్రహాలకు ఉన్నాయని ప్రజలు అనుకునేవారు. అక్కడికి వచ్చే యాత్రికులందరూ శక్తి సంపన్నుడైన నిజదేవుడిని మర్చిపోయారు. విగ్రహారాధన చేసేవాళ్ళుగా మిగిలిపోయారు. తమ నమ్మకాన్ని, భక్తిని, మనిషి చెక్కిన శిల్పాల మీదనే ఉంచారు. మనిషిని సృష్టించిన దేవుడికి అంకితం చేయవలసిన ఆరాధనని, వాళ్ళు విగ్రహాల మీద ఉంచారు.

చిత్ర విచిత్రంగా ఉన్న ఆ శిల్పాలని, మంత్రోచ్చారణలతో వింత వింత నియమాలతో పూజించేవారు. బలులు ఇచ్చేవారు. సాయంత్రాల్లో కాబా ముందు మోకాళ్ళ నేలకు ఆనించి మడమలపై కూర్చునేవాళ్ళు, తాగే వాళ్ళు. జూదం ఆడే వాళ్ళు. గాలిలోకి బాణాలు విసరి వాటి కుడిఎడమ కదలికల ఆధారంగా అదృష్టఫలాలు తేల్చేవారు. కథలు చెప్పేవాళ్ల దగ్గర గుమిగూడి ఆత్రుతగా వినేవాళ్ళు.

అరేబియన్ కథకులకు, కవులకు చదవడం కాని, రాయడం కాని తెలియదు.

https://teluguislam.net

కాని వాళ్లకు అద్భుతమైన జ్ఞాపకశక్తి ఉండేది. పెద్దపెద్ద కథలు కళాత్మకంగా, కవితా పరంగా మౌఖికంగానే విన్పించేవారు. జిన్నుల (భూతాల) గురించి చెప్పేవారు. జిన్నులు నీళ్లు ఉన్నట్లుగా భ్రాంతి కలిగించి, చాలాచాలా పనులు చేయగలవని చెప్పే వాళ్లు. జిన్నులు ప్రయాణికులను భ్రమల్లో పెట్టేవనీ, రాత్రి పూట ఇసుకలో నుంచి లయబద్ధమైన ధ్వనిని, అలజడిని రేపుతూ ఉంటాయనీ, ప్రయాణికులకు దూరం నుంచి ఏవేవో నవ్వులు విన్పించేవనీ చెప్పేవాళ్ళు. ఇంకా ఆ కథకులు యుద్ధాల గురించి కూడా చెప్పేవాళ్లు. భగ్న ప్రేమికుల గాథలూ, విరహ వేదనల కథలూ చెప్పే వాళ్లు. కొత్త సంగతులు ఏవైనా సరే, అవి దూరప్రాంతాలవి అయినా వాటి గురించి కళ్ళకు కట్టినట్లుగా చెప్పేవాళ్లు. వాళ్లు ఎడారికి వార్తా విలేకరులు. ఎడారిని గురించిన సమాచారం తెలిపేవాళ్లు.

అబ్దుల్ ముత్తలిబ్‌కు పదిమంది కుమారులు. అందరికంటే చిన్న కుమారుని పేరు అబ్దుల్లాహ్. మక్కా నగరానికి కొంతదూరాన యస్రిబ్ అనే ఇంకో నగరం ఉంది. యస్రిబ్‌లోని జుహ్రా తెగకు చెందిన యువతితో అబ్దుల్లాహ్ వివాహం జరిగింది. ఆమె పేరు ఆమినా. ఆ భార్యాభర్తలు ఎంతో అన్యోన్యంగా జీవితం గడిపేవాళ్ళు.

వృత్తిపరంగా అబ్దుల్లాహ్ వ్యాపారి. మక్కాకు చెందిన ఇతర వ్యాపారులతో కలిసి అబ్దుల్లాహ్ దేశవిదేశాలు తిరిగి వ్యాపారం చేసేవారు. వివాహం తరువాత అబ్దుల్లాహ్ ఒకానొక వ్యాపార ప్రయాణానికి బయలు దేరారు. అప్పటికి ఆమినా గర్భవతి. విధివశాత్తూ ఆ ప్రయాణంలో అబ్దుల్లాహ్ చనిపోయారు.

అబ్దుల్లాహ్ మరణం ఆమినాకు తీరని దుఃఖాన్ని మిగిల్చింది. దైవకృప వల్ల ఆ తర్వాత ఆరు నెలలకు ఆమె ఒక పండంటి బిడ్డకు జన్మనిచ్చారు. ఆ పిల్లవాడి పుట్టుకతో ఆమె మనోవేదన కాస్త తగ్గింది. అందరూ సంతోషంతో ఆ అబ్బాయికి "ముహమ్మద్ ﷺ" అని పేరు పెట్టారు.

https://teluguislam.net

# 2. నల్ల మచ్చ

మక్కా వ్యాపారులు చాలా తెలివైన వాళ్ళు. యమన్ నుంచి తెచ్చిన వస్త్రాలను, సుగంధ ద్రవ్యాలను వారు అధిక లాభానికి అమ్మేవారు. మక్కా దర్శనార్థం వచ్చే యాత్రికులతో వారి వ్యాపారం బాగా సాగేది. యాత్రికులు తాము తీసుకున్న వస్తువులకు బదులుగా ఖర్జూరాలు, ద్రాక్ష, జంతు చర్మాలు ఇచ్చేవారు. మక్కా నగరవాసులు మాట్లాడే అరబిక్ భాష వినసొంపుగా ఉండేది కాదు. చూడటానికి వాళ్ళు బక్కపల్చగా ఉండే వారు.

కొన్ని ముఖ్యమైన తెగలు ఉదాహరణకు ఖురైష్ తెగవారు తమ పిల్లల్ని ఎడారుల్లో నివసించే బిడోయిన్ అరబ్బుల వద్దకు పంపించేవాళ్ళు. బిడోయిన్ అరబ్బు లంటే పల్లెప్రాంతాల్లో నివసించే అరబ్బులన్నమాట. వీళ్ళు చాలా మొరటుగా ఉండేవాళ్ళు. కాని మక్కావాసుల మాదిరి కాకుండా వాళ్ళు స్వచ్ఛమైన అరబీ భాషలో మాట్లాడేవారు. భయంకరమైన ఎడారి అనుభవాల దృష్ట్యా వాళ్ళు చాలా ధృడంగా, ధైర్యంగా జీవించాల్సి వచ్చేది. ఇసుక తుఫానులను, భగభగ మండే ఎండలను, భయంకరమైన చల్లటి రాత్రులను ఎదుర్కోవలసి వచ్చేది. వారు పచ్చికను వెతుక్కుంటూ ఒక ఒయాసిస్సు నుంచి ఇంకో ఒయాసిస్సుకు తరలిపోతుండే వాళ్ళు. వాళ్ల తెగ పట్ల వాళ్ళు గర్వంగా, అహంకారంగా, విశ్వాసపాత్రు

https://teluguislam.net

లుగా ఉండేవాళ్లు. ఆ రకంగా వాళ్లు మంచివాళ్లు . శత్రువు సహా ఏ ఒక్కరు కూడా ఎడారి లోపలికి వచ్చి తమను చంపలేరని వాళ్లకు నమ్మకం.

ముహమ్మద్ ﷺ తల్లి ఆమినా ముహమ్మద్ ﷺ ను బిడోయిన్ అరబ్బుల దగ్గర ఉంచింది. వారి లాగా అతను ఆరోగ్యంగా, దృఢంగా పెరుగుతాడని, స్వచ్ఛమైన అరబీ భాష మాట్లాడుతాడని ఆమె అనుకున్నది.

హలీమా అనే ఒక బిడోయిన్ అరబ్బు మహిళ ఇంట్లో ముహమ్మద్ ﷺ పెరుగు తున్నారు. హలీమా ఒక ఆయా. మక్కా నగరంలోని సంపన్నుల పిల్లలకు ఆమె పాలుపడుతూ ఉండేది.

ఆ విధంగా పల్లె సీమల్లో పెరిగిన బాల ముహమ్మద్ ﷺ మక్కాలోని తన ఇంటికి తిరిగివెళ్ళే సమయం ఒక రోజు రానే వచ్చింది.

హలీమా వెంట ముహమ్మద్ ﷺ ఒంటె మీద మక్కా చేరుకున్నారు. ఆమినా వారిని సాదరంగా ఆహ్వానించి ప్రేమగా భోజన సదుపాయాలు సిద్ధం చేసింది. ముహమ్మద్ ﷺ అల్లంత దూరంలో నిలబడి ఉండగా, ఆమినా – హలీమా ఇద్దరూ గుసగుసగా మాట్లాడుకున్నారు. ముహమ్మద్ ﷺ విషయంలో జరిగిన ఒక వింత సంఘటన గురించి హలీమా చెప్పసాగింది:

"ఎవరో తెల్లటి బట్టలు ధరించిన ఇద్దరు అపరిచితులు అకస్మాత్తుగా ప్రత్యక్షమైనారు. ముహమ్మద్ ﷺ స్వయంగా నాతో చెప్పాడు, వాళ్లు ముహమ్మద్ ﷺ ను కింద పడుకోపెట్టారట. అతని గుండెను తెరిచి హృదయం లోపల వున్న ఒక నల్లటి మచ్చను తొలగించి తిరిగి గుండెను మూసివేసి అదృశ్యమయ్యారు"– అని చెప్పు కుంటూ పోయింది హలీమా ఆయా.

ఆమినా ఆశ్చర్యంగా అడిగింది, "నువ్వు చెబుతున్నది నా పిల్లవాడి గురించేనా?"

"అవును. నేను కళ్లారా ఆ సంఘటన చూసాను. ఇద్దరు మనుషులు ఎక్కడి నుంచో ఇట్టే ప్రత్యక్షమై అట్టే అదృశ్యమైపోయారు' అన్నది హలీమా.

ఆమె మాటలు విని ఆమినా నిశ్శబ్దంగా ఉండిపోయింది. ఆ విషయం గురించి ఆమె ఏమనుకున్నదో మనకు తెలియదు. ఎందుకంటే ఆ తరువాత ఈ విషయం గురించి చెప్పడానికి ఆమె ఎక్కువ కాలం బతికి ఉండలేదు.

https://teluguislam.net

# 3. జమ్‌జమ్ బావి

పసితనంలోనే తల్లిదండ్రులను కోల్పోయిన ముహమ్మద్ﷺ తన తాత అబ్దుల్ ముత్తలిబ్ సంరక్షణలో పెరుగుతున్నారు. అబ్దుల్ ముత్తలిబ్ మక్కా నగరానికి నాయకునిగా ఉండేవారు. 'ఖురైష్' అనే ప్రముఖమైన వంశానికి చెందినవారు. అంటే ప్రవక్తల పితామహుడు ఇబ్రాహీమ్ వారసత్వానికి చెందిన వారన్నమాట. అబ్దుల్ ముత్తలిబ్ బాగా ముసలివారు. మక్కాలో అత్యంత గౌరవనీయుడైన వ్యక్తి. కాబా ప్రాంగణంలో, పవిత్రమైన బావి ముందర ఆయనకంటూ ఒక ప్రత్యేక పీఠం ఉండేది.

ఒక రాత్రి, చాలా పొద్దు పోయాక అబ్దుల్ ముత్తలిబ్ తన ముద్దుల మనవడు ముహమ్మద్ﷺ ను ఒళ్లో కూర్చోబెట్టుకొని పూర్వ కాలంనాటి చారిత్రక సంఘటనల గురించి చెబుతున్నారు. వాళ్ల తెగకు చెందిన కొంతమందికి అది ఇష్టం ఉండేది కాదు. తమ గడ్డాలను నిమురుకుంటూ వాళ్ళు తమ అయిష్టతను వ్యక్తపరచేవాళ్లు. అబ్దుల్ ముత్తలిబ్ తన మనవడిని చెడగొడుతున్నాడని వారి అభిప్రాయం. "ముహమ్మద్ﷺ ఆరేళ్ల చిన్న పిల్లవాడు. అతడిని పడుకోవటానికి పంపించకుండా, పెద్దవాళ్ల సమూహంలోనే ఇంత రాత్రి వరకు ఎందుకు ఉంచుతున్నావు" అనేవాళ్లు. వాళ్ళ అభ్యంతరం అబ్దుల్ ముత్తలిబ్‌కు నచ్చేది కాదు. అసలు

https://teluguislam.net

అది వాళ్లకు సంబంధించిన వ్యవహారం కాదని ఆయనకు అనిపించేది. ఆ పిల్లవాడి తల్లిదండ్రులు మరణించినందున అది తన బాధ్యత అనుకునేవారు ఆయన.

ముహమ్మద్ﷺ తన తాత బొంత కప్పుకుని ఆయన చెప్పే విషయాలు అర్ధరాత్రి వరకూ వినేవారు. తనతో పాటు తన కుటుంబానికి సంబంధించిన వారూ, స్నేహితులూ ఉండేవారు. ముహమ్మద్ﷺ తనకు పదాలు అర్థం కానప్పుడు పడుకునేవారు. కాని ఆ రోజు రాత్రి తన తాత చెబుతున్న చారిత్రక ఘట్టాలు, తన చెవులకు ఎంతో వినసొంపుగా అనిపించాయి. అందుకని ముహమ్మద్ﷺ తన గుండ్రటి కండ్లతో ముడుతలు పడ్డ తాత చర్మాన్ని, ఆయన తెల్లటి గడ్డాన్ని చూస్తూ ఆ రాత్రంతా ఆయన చెప్పిన మాటలు విన్నారు.

అబ్దుల్ ముత్తలిబ్ ఇలా చెప్పారు:

"ఒకప్పుడు మాది చాలా నిరుపేద కుటుంబం. నేను యవ్వనంలో ఉన్నప్పుడు పేదరికం వలన మా తెగలోని ధనికులు నన్ను చిన్న చూపు చూసేవారు. నాకూ, నా చిన్న కొడుకుకూ ఎంతో పని ఉండేది. కాబాలో ప్రార్థించటం కొరకు ఎడారి దాటి వచ్చే యాత్రికుల కోసం మేము నీళ్లు తీసుకొచ్చేవాళ్లం. ఎన్నో బావులు తిరిగే వాళ్లం. ఒకసారి ఏం జరిగిందంటే, కాబా చుట్టూ ఉన్న బావులు ఎండిపోయాయి. మరికొన్ని బావులు ఉన్నప్పటికీ అవి మురికి నీటితో నిండి ఉండేవి. ఆ కరువు కాలంలోనూ యాత్రికులు కాబాని సందర్శిస్తూనే ఉన్నారు. పవిత్ర జమ్‌జమ్ బావిని కనుగొనక ముందటి పరిస్థితి అది. ఔనూ...! అసలు జమ్‌జమ్ బావి ఎలా పుట్టిందో మీకు తెలుసా?!"

ముత్తలిబ్ ఆ మాట అనేసరికి ముహమ్మద్ﷺ చిరునవ్వు నవ్వారు. ఎందుకంటే తాత అబ్దుల్ ముత్తలిబ్ జమ్‌జమ్ సంఘటన గురించి పదే పదే చెబుతుండేవారు. దాని గురించి చెప్పటం ఆయనకు ఎంతో ఇష్టం. అంతకు ముందే ముహమ్మద్ﷺ తాత దగ్గర ఆ సంఘటన గురించి విని వున్నారు. ఆ సంఘటన మొత్తం ముహమ్మద్ﷺకు బాగా జ్ఞాపకం. అదొక్కటే కాదు, అబ్దుల్ ముత్తలిబ్ ముహమ్మద్ﷺ కు అలాంటి మరెన్నో సంఘటనల గురించి చెప్పారు.

"సుమారు 2500 యేండ్ల క్రితం. మక్కా నగర నిర్మాణ నిమిత్తం దైవప్రవక్త ఇబ్రాహీమ్ తన భార్య హాజిరాను, కుమారుడు ఇస్మాయీల్‌ను మక్కా లోయలో వదలి పెట్టి వెళ్లారు. ఇస్మాయీల్ అప్పటికి ఇంకా పాలుత్రాగే పసికందు. అప్పుడు మక్కా లోయలో నీళ్లులేవు. ఆ ప్రదేశంలో చిన్న గడ్డి పరక కూడా పెరిగేది కాదు. కొన్నాళ్లకు హాజిరా దగ్గర ఉన్న ఆహార పదార్థాలు, నీళ్ళు అన్నీ నిండుకున్నాయి. ప్రస్తుతం ఆ

https://teluguislam.net

తల్లీబిడ్డలకు తినడానికి తిండి లేదు. త్రాగటానికి నీళ్ళు కూడా లేవు. హాజిరాకు ఏం చేయాలో తోచలేదు. తీవ్రమైన ఎండలో ఇసుక తిన్నెల మధ్య ఆమె నీళ్ళ కోసం గాలించింది.

ఆ తల్లీబిడ్డలను ఆకలిదప్పులతో బాధించటం అల్లాహ్ ఇచ్ఛ కాదు. కనుక అల్లాహ్‌దూత జిబ్రయీల్ మెరుపులాంటి వెలుగుతో అక్కడ ప్రత్యక్షమయ్యారు. ఇసుక నేలపై గట్టిగా కొట్టారు. పసిపిల్లవాడి పాదాల దగ్గర నుంచి ఒక్క ఉదుటున స్వచ్ఛమైన నీరు పైకి చిమ్మింది. నేల నుంచి ఉబికిన ఆ నీటిధారకు "జమ్‌జమ్" అని పేరు పెట్టటం జరిగింది. కాని కాలక్రమంలో ఆ జలధార పూడుకుపోయింది. ఒకప్పటి జమ్‌జమ్ ఊట ఎక్కడ ఉండేదో ఎవరికీ తెలియదు.

ఓ ముహమ్మద్ ﷺ ! నువ్వు విన్నట్లుగానే మీ పెద్దనాన్న అబూతాలిబ్ కూడా ఈ సంఘటన గురించి తరుచూ వినేవాడు. ఒక రోజు అతను నాతో అన్నాడు, "నాన్నా! దైవదూత జిబ్రయీల్ రప్పించిన జమ్‌జమ్ నీటిధార ఇక శాశ్వతంగా ఇంకి పోయినట్లేనా?" అని అతను అడిగాడు. దానికి నేను, "జమ్‌జమ్ బావి ప్రత్యేకమైనది. అది ఖచ్చితంగా ఇంకిపోదు" అన్నాను. అప్పుడతను, "నాన్నా! అదే నిజమయితే ఇప్పుడది ఎక్కడుంది?" అని అడిగాడు. "మనం ఇప్పుడు దానికోసమే వెతుకు తున్నాం" అన్నాను.

మొత్తానికి జమ్‌జమ్ బావి కోసం త్రవ్వటం మొదలు పెట్టాం. అప్పటికే కొన్ని వారాలు త్రవ్వాం. ఉధృతంగా గాలులు వీస్తున్నాయి. మేము తవ్విన గుంతల్లో ఇసుక చేరుతూ ఉంది. అయినా కూడా మేము ఆగలేదు. ఇతరులెవరూ మాకు సహకరించ లేదు. పైగా మా తెగవాళ్లు సైతం దీనిపై తమ అనాసక్తతను వెలిబుచ్చారు. మమ్మల్ని వెక్కిరిస్తూ, "మీరు ఇసుక తుఫానులో సూదిని వెదుకుతున్నారు" అని అనేవారు.

కాని నాకు మాత్రం ఖచ్చితంగా బావిని కనుక్కొంటామని గట్టి నమ్మకం ఉండేది. అదే విషయాన్ని నాకు నేను చెప్పుకున్నాను. అల్లాహ్‌తో విన్నవించుకున్నాను. ఆ పవిత్రమైన జమ్‌జమ్ బావి కనిపిస్తే చాలు, ఎవరూ మమ్మల్ని చూసి నవ్వరు. పైగా మక్కా ప్రజలు మమ్మల్ని పొగడ్తలతో ముంచేస్తారు. మా ఖురైషి తెగవాళ్లు నా గురించి గొప్పగా చెప్పుకుంటారు. అందువలన నాకు గనుక పది మంది కుమారులు జన్మిస్తే వారిలో ఒకడిని అల్లాహ్‌కు సమర్పించుకుంటానని మనస్సులో మొక్కుకున్నాను.

అప్పుడే ఒక అనూహ్యమైన సంఘటన జరిగింది. నా గునపానికి ఏదో గట్టిగా తగిలింది. త్రవ్వి దాన్ని బయటికి తీసాను. జింక ఆకారంలో వున్న రెండు పెద్ద బంగారపు ముద్దలు! సరిగ్గా ఆ ముద్దల క్రింద తడితడిగా, నల్లగా వున్న ఇసుక!! మా

https://teluguislam.net



కళ్ల ముందే జమ్‌జమ్ జలం పైకి ఉబికింది. బంగారపు ముద్దలను వెలికి తీసిన గుంత నీటితో నిండి పోయింది. సహజంగానే అక్కడున్న చాలామంది జమ్‌జమ్ బావి మీద కన్నా, ఆ బంగారం పట్లనే ఆసక్తి చూపించారు. కాని నేను వాళ్లతో, 'ఆ బంగారం కాబాకు చెందినది' అని చెప్పాను. ముహమ్మద్ﷺ! నువ్వు గమనించావో లేదో! ఆ రెండు బంగారపు ఆకృతులు, ఇప్పటికీ కాబా గృహ గుమ్మానికి వేలాడ దీసి వున్నాయి.

ముహమ్మద్ﷺ! ఆ రోజు నుంచి తియ్యటి జమ్‌జమ్ నీళ్లు కాబా యాత్రికుల కొరకు ఆగకుండా ధారాపాతంగా వస్తూనే ఉన్నాయి. అందువల్లనే అందరూ మీ తాతను కొనియాడారు. మక్కా ప్రజలు సంతోషంతో ఈ నాటికీ మీ తాతను గౌరవిస్తున్నారు. జమ్‌జమ్ బావి సంరక్షకునిగా ఒక పేరును, బాధ్యతను ఖరారు చేశారు. పవిత్ర జమ్‌జమ్ బావి వల్ల కాబాలో నా స్థానం చిరస్థాయిగా నిలబడి పోయింది."

● ● ●

ఈ చారిత్రక గాథ విన్నాక ముహమ్మద్ﷺ నిద్రలోకి జారిపోకుండా చాలా ఉత్సాహవంతులయ్యారు. అబ్దుల్ ముత్తలిబ్ అతని ఉత్సాహాన్ని చూసి ఇంకో సంఘటన చెప్పటం మొదలు పెట్టారు.

https://teluguislam.net

# 4. వంద ఒంటెల విందు

ఇప్పుడు నేను మీకు చెప్పబోయేది వంద ఒంటెల విందు గురించి. ఒంటె ఎంతో గొప్ప జంతువు. ఒక్కసారి ఆలోచిస్తే తెలుస్తుంది, అరబ్బులకు అది ఎంత అవసరమో! ఒంటె తప్ప మరే జంతువు నీళ్ళు లేకుండా ఇరవై అయిదు రోజులు ప్రయాణం చేయగలదండీ?! మనిషైతే మాత్రం నీళ్ళు లేకుండా అన్ని రోజులు బ్రతకడం అసాధ్యం.

నా ప్రియమైన చిన్నారి మనవడా! నువ్వు చెప్పు. ఎడారి సంచారులు ఎడారుల్లో ఎట్లా బ్రతుకుతారు? చల్లటి ఎడారి రాత్రులలో తమ శరీరాలను వెచ్చగా ఎలా ఉంచుకుంటారు?

ఎడారి సంచారులు ఒంటె లద్దెను ఇంధనంగా ఉపయోగించుకుంటారు. వేడిని పుట్టించడానికి దానిని వినియోగిస్తారు. ఎడారుల్లో సుదీర్ఘ ప్రయాణాలు చేస్తున్నప్పుడు తమ వెంటనున్న తోలు సంచుల నిండా ఒంటె పాలు తీసుకొని వెళ్తారు. పగలంతా ప్రయాణించి, రాత్రికి ఎంతో రుచికరమైన ఒంటె మాంసాన్ని కాల్చుకొని తింటారు. ఒంటె చర్మమే వాళ్ళకు అద్భుతమైన గుడారం. ఆఖరికి ఒంటె మనిషికి ఈ విధంగానూ ఉపయోగపడుతుంది. ఈ ఎడారి దేశంలో ఒంటె

https://teluguislam.net

లేకుండా జీవించడం దుర్లభం. అందుకని నా ప్రియమైన మనవడా! ఒంటె ఎంతో విలువైన జంతువు.

వింటున్న పెద్దవాళ్ళ వైపు ఒకసారి దృష్టిని సారించి, ఇంకా గంభీరంగా చెప్పుకుంటూ పోతున్నారు అబ్దుల్ ముత్తలిబ్.

"ముహమ్మద్ﷺ తండ్రి అబ్దుల్లాహ్ జన్మించాక గతం తాలూకు ఒక దిగ్భ్రాంతికరమైన విషయాన్ని నేను ఎదుర్కోవలసి వచ్చింది. అల్లాహ్‌కు నేను చేసిన వాగ్దానాన్ని నెరవేర్చవలసిన సమయం ఆసన్నమైంది. బహుశ మీలో కొంతమందికి ఆ రాత్రి గుర్తుండే ఉంటుంది. అక్కడ ఉన్నవాళ్ళు ఎవరైనా ఆ విషయాన్ని ఎట్లా మర్చిపోగలరు?!"

అబ్దుల్ ముత్తలిబ్ ఆ సంఘటన చెప్పటం ప్రారంభించగానే అక్కడ ఊపి రాడనంతగా గాలి స్థంభించిపోయింది.

● ● ●

నేనూ, నా కొడుకులు బలిపీఠం ముందు నిలబడ్డాం. ఆ వ్యక్తులు ఎంతో కఠినంగా ఉన్నారు. ఖచ్చితంగా వాళ్ళు ఒక దుఃఖభరితమైన సంఘటన జరగబోతున్నదని అంచన వేసే ఉంటారు. అయినా వాళ్ళు వెనుకంజ వేయలేదు. నా మొక్కుబడి గురించి నేను వాళ్ళకు ఇలా చెప్పాను:

"నేను యవ్వనంలో ఉన్నప్పుడు జమ్‌జమ్ బావి కోసం అదే పనిగా వెతుకుతూ ఉండేవాణ్ణి. ఆ సమయంలో నేను, "ఓ అల్లాహ్! నాకు పదిమంది కుమారులను ప్రసాదించినట్లయితే, వారిలో ఒకరిని పవిత్ర కాబా గృహం వద్ద బలి ఇస్తాను, జమ్‌జమ్ బావి నాకు కనబడేటట్టు చేయి" అని అల్లాహ్‌ను ప్రార్థిస్తూ ఒక ప్రమాణం చేసాను. ఈ విషయాన్ని నా పిల్లలు కూడా సమ్మతించారు. అందుకుగాను లోలోపల తండ్రిగా నేనెంతో గర్వపడ్డాను. మీకూ గుర్తుండే ఉంటుంది, బలి ఇవ్వటానికి అబ్దుల్లాహ్ పేరును ఖరారు చేయటం."


నా ధైర్యాన్నంతా కూడదీసుకుని నా చిన్నకొడుకు అబ్దుల్లాహ్‌ను నాతోపాటు బలిపీఠం వద్దకు తీసుకెళ్ళాను. సరిగ్గా ఆ క్షణంలో కొంతమంది మాటలు వినిపించాయి. వాళ్ళలో ఒకతను, "ఈ బలి జరగాల్సిన అవసరం లేదు. అబ్దుల్ ముత్తలిబ్! నీవు ఈ పనికి సిద్ధం కావద్దు. దానిని ఆపివేయి" అన్నాడు. ఆ సమూహాన్ని చూసి

https://teluguislam.net

నేను ఆశ్చర్యపోయాను. నా తెగవాళ్ళందరూ ఒకరితో ఒకరు అభిప్రాయాలు పంచుకుంటున్నారు.

వాళ్ళు తమ అభిప్రాయం చెప్పారు. ఒక్కసారి మదీనా నగరంలో ఉన్న మంత్ర గత్తెతో మాట్లాడాలన్నది వాళ్ళ ఆలోచన. కొంతమంది అప్పటికే ఆమెను సంప్రదిం చటానికి మదీనాకు బయలుదేరి వెళ్ళారు. రెండు రోజుల తరువాత ఆ మంత్రగత్తె వద్ద నుంచి జవాబు వచ్చింది. మేమందరం మళ్ళీ బలిపీఠం వద్ద సమావేశం అయ్యాం. మంత్రగత్తె సందేశాన్ని చదివి వినిపించాం.

"అబ్దుల్లాహ్ పేరున ఒకటి, పది ఒంటెలు ఇంకొకటిగా ఖరారుచేసి పాచికలు వేయండి. అంటే నీ కొడుకు జీవితం పది ఒంటెలతో సమానమన్నమాట. పాచికలు పది ఒంటెల వైపున సూచిస్తే, వాటిని బలి ఇవ్వాలి. ఒకవేళ అబ్దుల్లాహ్ వైపు సూచిస్తే ఇంకో పది ఒంటెలను పెంచి తిరిగి పాచికలు వేయాలి. అల్లాహ్ ప్రసన్నుడై ఒంటెల వైపు పాచికలను సూచించేంత వరకు పాచికలు వేస్తూ పోవాలి."



ఒంటెల పేర్లు వచ్చేంత వరకు మేము మళ్ళీ మళ్ళీ పాచికలు వేస్తూపోయాం. చివరికి బలి ఇవ్వవలసిన ఒంటెలు వంద అయ్యాయి.

నా బుగ్గల మీద కన్నీరు కారుతుండగా, నా హృదయం నిండా అల్లాహ్ పట్ల కృతజ్ఞతను నింపుకొని ఎంతో ఆనందంగా నా చిన్నకొడుకు అబ్దుల్లాహ్‌ను కౌగిలించుకున్నాను.

"ఆ రోజు రాత్రి నగరమంతా పండగ వాతావరణం నెలకొంది. వంద ఒంటెలను బలి ఇచ్చి పెద్ద విందును ఏర్పాటు చేయటం జరిగింది.

https://teluguislam.net

మక్కావాసులందరికీ, మరీ ముఖ్యంగా పేద ప్రజలకు ఈ విందు ఇవ్వటం జరిగింది. ఎడారిలోని చిన్న జంతువులు సైతం ఈ విందులో పాలుపంచుకున్నాయని చెప్పుకుంటారు. అటువంటి విందును మీలో ఎవరూ చూసి ఉండరు. నేను ఖచ్చితంగా చెప్పగలను, ఆ 100 ఒంటల విందులో పాల్గొన్నవాళ్ళెవరూ దాన్ని మరచిపోలేరు!"

● ● ●

కాబా ప్రాంగణంలో చిమ్మచీకటి అలుముకుంది. ఎంతో పెద్దగా, వెచ్చగా ఉన్న తన బొంతలోకి అబ్దుల్ ముత్తలిబ్ మనవడ్ని పొదుపుకున్నారు. మిగిలినవాళ్ళు ఆయన దగ్గర సెలవు తీసుకుని ఇరుకుగా ఉన్న వీధుల గుండా ఆ కటిక చీకట్లోనే తమ ఇళ్ళకు వెళ్ళిపోయారు.

పై సంఘటనను కలలో కూడా ఎవరూ ఊహించి ఉండరు. ఆ కాలంలో అటువంటి విందును ఎవరూ ఇవ్వలేదు. మొత్తానికి వంద ఒంటెల బలిదానం అల్లాహ్ కృపకు నోచుకున్నది.

అయితే ఆ కరుణకు కారణం బలి ఒక్కటే కాదు,

– వంద ఒంటెల స్థానంలో బలికావలసిన అబ్దుల్లాహ్ ముహమ్మద్ﷺ కు తండ్రి కావటం,

– రాబోయే కాలానికి ముహమ్మద్ﷺ దైవప్రవక్త కావటం,

– అందులోనూ చిట్టచివరి ప్రవక్త కావటం,

అదీ అసలు కారణం.

https://teluguislam.net

# 5. వర్తక బృందం

ముహమ్మద్ ﷺ తల్లిదండ్రులు అబ్దుల్లాహ్, ఆమినా ఆయన చిన్నతనంలోనే చనిపోయినందున ఆయన అనాథగా మిగిలారు. తర్వాత కొంతకాలం తన తాత అబ్దుల్ ముత్తలిబ్ సంరక్షణలో పెరిగారు. అబ్దుల్ ముత్తలిబ్ జమ్‌జమ్ బావి సంరక్షకులు. ఆ తాత-మనవళ్ళ మధ్య ఎంతో ప్రేమ ఉండేది. వాళ్ళిద్దరూ చాలా సంతోషంగా ఉండేవారు. కాని అబ్దుల్ ముత్తలిబ్ మరణంతో ముహమ్మద్ ﷺ సంతోషం, ఆనందం ఆవిరైపోయింది.

విషాద వదనంతో, ఎంతో ఒంటరి భావనతో ముహమ్మద్ ﷺ తన పెదనాన్న అబూ తాలిబ్ ఇంటికి చేరారు. పెదనాన్న కూడా ఆయనను ఎంతో అల్లారు ముద్దుగా చూసుకున్నారు. ముహమ్మద్ ﷺ తనను తాను సమాధాన పర్చుకున్నారు. కాని తాను అనాథనన్న విషయం ఆయన జీవితాంతం మరిచిపోలేదు.

తన కొత్త జీవితం అన్ని విషయాలలోనూ ఎంతో భిన్నంగా ఉండేది. తన పెదనాన్నకు సరదాగా ఉండడం కాని, తాత ముత్తలిబ్ లాగా పురాతన గాధలు చెప్పడం కాని రాదు. అంత సమయం కూడా ఆయనకు ఉండేది కాదు. మక్కాలో ఆయన ఒక పేరుమోసిన వ్యాపారి.

https://teluguislam.net

రాత్రింబవళ్లు వ్యాపారం, లాభనష్టాల గురించే ఆయన ఆలోచిస్తూ గడిపేవారు.

అప్పుడు ముహమ్మద్ﷺ కు పదకొండేళ్ల వయస్సు. తన పెదనాన్న వ్యాపార నిమిత్తం ఒక సుదీర్ఘ ప్రయాణానికి సిద్ధమవ్వసాగారు. అందుకోసం తన ఒంటెలను సిద్ధం చేయసాగారు. ఆయన వెళ్లబోయేది సిరియా దేశానికి.


మక్కా వ్యాపారులు ప్రయాణానికి బయలుదేరే ముందు ఒకటికి పలుమార్లు ఒంటెలను సరి చూసుకునేవారు. వ్యాపారానికి సంబంధించిన వస్తువులను సిద్ధం చేసుకునేవారు. నీళ్లు అందుబాటులో ఉంచుకునేవారు.

సరుకంతా ఒకసారి పరిశీలించుకున్న తర్వాత అబూతాలిబ్ బిడారు కూడా మరుసటి రోజు బయల్దేరడానికి సిద్ధమయింది. ఆ రోజు ముహమ్మద్ﷺకు నిద్రపట్ట లేదు. ఎలాగైనాసరే తను కూడా సిరియా వెళ్లాలన్నది ముహమ్మద్ﷺ కోరిక.

మర్నాడు ఉదయం అబూ తాలిబ్ సరుకులను సరి చూసుకుంటున్నారు. ముహమ్మద్ﷺ ఆయనకు కొద్ది దూరంలో నిలబడి పరిశీలిస్తున్నారు. చివరికి ఉండ బట్టలేక పెదనాన్న దగ్గరికి వెళ్ళి తనను కూడా సిరియా తీసుకెళ్లమని గట్టిగా అడిగారు.

ముహమ్మద్ﷺ ప్రవర్తనతో అబూ తాలిబ్ ఆశ్చర్యానికి లోనయ్యారు. ఇంతకు ముందు ఆయన ఏనాడూ ఇలా ప్రవర్తించలేదు. ముహమ్మద్ﷺ కళ్ళల్లో బలమైన కోరికను గమనించిన అబూతాలిబ్ కాదనలేక పోయారు. ముహమ్మద్‌ను తన వెంట తీసుకువెళ్ళటానికి అంగీకరించారు.

వర్తకుల సమూహం బయలుదేరింది. ఇసుకల్లో నుంచి, పట్టణాల్లో నుంచి, ఒయాసిస్సుల గుండా ప్రయాణిస్తూ ముందుకు సాగిపోతోంది.



https://teluguislam.net

# 6. క్రైస్తవ పండితుడు-బహీరా

అది మధ్యాహ్న సమయం. అబూ తాలిబ్ వర్తక బృందం సిరియా దేశంలోని బుస్రా పట్టణానికి చేరు కుంది.

“వాళ్లు మనల్ని ఆహ్వానిస్తున్నారా”? అని ముహమ్మద్ ﷺ తన పెదనాన్నను అడిగారు.

“ప్రార్థన కొరకు ప్రజలను పిలిచే చర్చ్ గంటలు అవి” అని అబూ తాలిబ్ చెప్పారు.

ముహమ్మద్ ﷺ నిశ్శబ్దంగా ఉండిపోయారు. ప్రార్థన కొరకు పిలిచే ఆ విధానం ముహమ్మద్ ﷺ కు ఆశ్చర్యకరంగా కనిపించింది. కాని ఆ విషయాల గురించి ఆయనకు కొంచెం మాత్రమే తెలుసు.

ఎడారిలో కొన్ని రోజుల యాంత్రిక ప్రయాణం తరువాత, వారికి కనిపించిన మొదటి చిన్నపాటి పట్టణం ఈ బుస్రానే. అక్కడ ఇటీవలే వర్షాలు పడి అక్కడక్కడ పచ్చదనం కనిపిస్తుంది. గాలంతా మట్టి వాసనతో నిండిపోయి ఉంది. అకస్మాత్తుగా గంటల గణగణ ఆగిపోయి అంతటా నిశ్శబ్దం అలుముకుంది. ఆ చల్లటి, తడితడి వాతావరణంలో స్వచ్ఛమైన గాలిని పీల్చుకుని ముహమ్మద్ ﷺ ఉత్తేజాన్ని పొందారు. మలమల మాడే ఎండలతో, దుమ్ము ధూళితో, శబ్దాలతో

https://teluguislam.net

నిండివుండే మక్కా ఎక్కడ, చల్లని, ప్రశాంతమైన ఈ బుస్రా ఎక్కడ అని ముహమ్మద్ﷺ ఆలోచించుకోసాగారు.

ముహమ్మద్ﷺ ఈ విషయాల గురించి ఆలోచిస్తూ ఉండగా, ఆయనకు కొద్ది దూరంలో ఒక క్రైస్తవ పండితుడు ఉంటున్న కుటీరం కనిపించింది. అందులో ఏదో జరుగుతోంది. ఆ పండితుని పేరు బహీరా. అతను ఒక పొడవాటి జుబ్బా ధరించి ఉన్నాడు. నున్నటి గుండు, పొడవాటి గడ్డంతో ఉన్నాడు. అతను క్రైస్తవ మత ఆచారాలను ఖచ్చితంగా పాటించే ఓ సదాచార సంపన్నుడు. బుస్రా పట్టణపు పొలిమేరల్లో, ఒక చిన్న కుటీరంలో నిరాడంబర జీవితాన్ని గడుపుతున్నాడు.

అది ప్రార్థనలకు ప్రత్యేకమైన రోజు అయినందున ఆ పనులు చూసుకుంటూ తన సమీపానికి చేరుతున్న వర్తక బృందాన్ని గమనించాడు బహీరా. ఆ దారి గుండా సంవత్సరాలుగా ఎన్నో వర్తక బృందాలు వస్తూ పోతుండేవి. కాని ఈ సారి మాత్రం ఒక అసాధారణమైన, ఆశ్చర్యకరమైన విషయం జరిగింది. అది ఏమిటంటే, అతను కళ్లు మూసుకుని ఉన్నప్పటికీ ఆ వర్తక బృందాన్ని చూడగలిగాడు. అతను చూసిన దృశ్యం - ఒంటెల మీద సరుకులు, సుదీర్ఘ ప్రయాణం చేసి ఎండ వేడిమికి అలిసి పోయి డీలా పడిపోయిన మనుషులు, వారితోపాటు ఒక చిన్న పిల్లవాడు. వాళ్ల మధ్యన ఆ పిల్లవాడు ఎంత అందంగా ఉన్నాడో! ఇంకా ఆశ్చర్యకరమైన విషయం, ఒక మేఘం ఆ పిల్లవాడిని మాత్రమే ఎండ నుంచి గొడుగులా కాపాడుకుంటూ వస్తోంది. బహీరా కళ్లు చిట్లించి దగ్గరగా చూసే ప్రయత్నం చేశాడు. అప్పటికే ఆ దృశ్యం మాయ మయ్యింది. తెల్లటి గది గోడలు తప్పించి అతనికి మళ్ళీ ఆ దృశ్యం కనిపించలేదు.

బహీరా వెంటనే మోకాళ్ల మీద నుంచి లేచి ఆ దృశ్యాన్ని చూడటానికి కుటీరం నుంచి బయటకు పరుగు తీశాడు. గదికి దగ్గరలో ఉన్న ఓ చెట్టు నీడలో అదే వర్తక బృందం కనిపించింది. ఆ బృందంలో తాను చూసిన ఆ పిల్లవాడు కూడా ఉన్నాడు. అయితే ఆశ్చర్యకరంగా పిల్లవాడికి ఎక్కువ నీడ ఉండాలన్నట్టు ఆ చెట్టు తన ఆకులను, కొమ్మలను బాగా వంచి ఉంచింది.

బహీరాకు బాగా తెలుసు, అటువంటి అద్భుతాలు సాధారణంగా, సామాన్య మనుషుల విషయంలో జరగవని. అందుకని తనలో తను, “ఇది ఖచ్చితంగా అల్లాహ్ సూచనే” అనుకున్నాడు బహీరా. “ఈ అబ్బాయి ఏదో ప్రత్యేకమైన పని కొరకే తీసుకురాబడ్డాడు” అని అనుకున్నాడు.

అతని మెదడుకు ఏదో ఆలోచన వచ్చి, అతను వర్తక బృందాన్ని కలిశాడు. “ఓ ఖురైషీ తెగ వర్తకులారా! మీ కొరకు నేను భోజనం తయారు చేయించాను. మీరు చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ వచ్చి నా ఆతిథ్యాన్ని స్వీకరించాలని కోరుకుంటున్నాను” అన్నాడు.

వర్తక బృందంలోని ఒకతను నవ్వుతూ, “బహీరా! ఈ రోజు నీకు ఏమయింది? గతంలో మేము ఎన్నోసార్లు ఈ దారి గుండా పోతూ నిన్ను కలవడం జరిగింది. కాని నువ్వు ఎప్పుడూ మమ్మల్ని ఈ విధంగా ఆహ్వానించలేదు” అన్నాడు.

బహీరా కాస్తంత చికాకుపడ్డాడు. “అవును, నువ్వు చెప్పింది నిజమే. కాని మీరు నా అతిథులుగా ఉండాలని కోరుకుంటున్నాను. మీకో విందు ఇచ్చి గౌరవించాలని అనుకుంటున్నాను” అన్నాడు.

బహీరా విందును ఏర్పాటు చేశాడు. అబూ తాలిబ్ భోజనానికి వెళ్తూ, “ముహమ్మద్ ﷺ ! ఇదిగో నీ భోజనం. మేము వచ్చేంత వరకు ఈ ఒంటెలను, సరుకు



లను కనిపెట్టుకొని వుండు. మా మంచి పిల్లవాడివి కదూ!" అని ఆప్యాయంగా తల నిమిరి వెళ్లారు.

ముహమ్మద్ﷺ ఈ విషయాలేవీ పట్టించుకోలేదు. ఒంటరిగా కూర్చోవడం ఆయనకు ఎంతో సంతోషం. చెట్టు నీడన భోజనం చేసి, తన గురించి ఆలోచించు కోవడం ఆయనకు మహా ఇష్టం. కాని బహీరా ఏ మాత్రం సంతృప్తిగా లేడు. అందరూ భోజనానికి కూర్చున్నారు. ఆ బాలుడు మాత్రం కనిపించలేదు. నిజం చెప్పాలంటే ఇదంతా ఆ బాలుడి కోసమే చేశాడు. కాని ఆ బాలుడు మాత్రం ఎక్కడా కనిపించలేదు.

ఆ బాలుడు, ఆ మేఘం, ఆ చెట్టు ఒట్టి ఊహాజనితమేనా?

ఖచ్చితంగా కాదు. తను ఇప్పటికీ తెలివితక్కువ ముసలివాడేమీ కాదు. అతను పూర్తిగా అసహనానికి లోనై ఉన్నాడు.

"మీలో ఒకతను ఈ విందుకి రాలేదు. అతను రాకూడదా ఏమిటి?" అని అడిగేశాడు ఉండబట్టలేక.

"అబ్బే..అలాంటిదేమీ లేదు. ముహమ్మద్ﷺ ను మేము కావాలనే బయట వదలిపెట్టి వచ్చాం. మమ్మల్ని క్షమించండి" అంటూ వాళ్లలో ఒకతను ముహమ్మద్ﷺ ను పిలవడానికి బయటికి వెళ్ళాడు. కొద్దిసేపటి తరువాత ముహమ్మద్ﷺ ను విందు భోజనం దగ్గరికి తీసుకొచ్చాడు.

ఆ విందు జరుగుతున్నంత సేపూ, బహీరా ముహమ్మద్ﷺ నే చూస్తూ ఉన్నాడు. చిన్నవాడయినప్పటికీ ఎంతో ఉన్నతంగా కనిపిస్తున్నాడు. ఎంతో వినయ విధేయతలతో ఉన్నాడు. అతని చూపులు ఎంతో నిజాయితీగా, మరెంతో నిదానంగా ఉన్నాయి. విందు పూర్తవగానే బహీరా ముహమ్మద్ﷺ ను తన దగ్గరకు పిలిచి, "లాత్, ఉజ్జా దేవుళ్ల తోడు! నా పక్కన కూర్చొని నీ గురించి అన్ని విషయాలూ చెబుతావా?" అని అడిగాడు. మక్కా దేవుళ్లు అయిన లాత్, ఉజ్జా పేర్లు చెప్పినందు వల్ల ఆ బాలుడు సంతోషంతో తన గురించి అంతా చెబుతాడని బహీరా ఆశించాడు.

కాని ముహమ్మద్ﷺ అతనిని సరిచేస్తూ చెప్పారు. "అల్లాహ్‌కు బదులుగా లాత్, ఉజ్జాలపై ఒట్టేసి నన్నేమీ అడగకు. నాకు అన్నిటికన్నా అయిష్టమైనవి ఆ రెండు పేర్లే".

బహీరా వేరే విధంగా ముహమ్మద్ﷺ నుంచి విషయాలు రాబట్టే ప్రయత్నం చేశాడు.

https://teluguislam.net

" సరే; అల్లాహ్ తోడు! నీ విషయాలు మొత్తం నాకు చెప్పు" అన్నాడు.

ముహమ్మద్ﷺ చెప్పిన విషయాలు అన్నింటిని పరిశీలించాక ముసలివాడైన బహీరాకు ఒక విషయం స్పష్టంగా అర్థమైంది. అది ఏమిటంటే, ఈ పిల్లవాడు అల్లాహ్ కృపకు నిజంగా నోచుకున్నవాడే.

చివరికి బహీరా ముహమ్మద్ﷺ ను అబూ తాలిబ్ వద్దకు తీసుకు వెళ్లి, "ఈ పిల్లవాడిని జాగ్రత్తగా చూసుకో. ఇతనికి ఎంతో ఉజ్వలమైన భవిష్యత్తు ఉంది" అన్నాడు.

వర్తక బిడారు కాసేపు అక్కడే విడిది చేసింది.

తిరిగి మక్కాకి చేరుకుంటున్నప్పుడు ముహమ్మద్ﷺ అబూ తాలిబ్‌తో, "పెదనాన్నా! నేను ఎప్పుడన్నా మీతో కలిసి సిరియాకి మళ్లీ ప్రయాణం చేయగలనా?" అని అడిగారు.

"ఏం. ఎందుకుని అలా అడుగుతున్నావు?" అబూతాలిబ్ ప్రశ్నించారు.

"ఇక్కడ నాకెంతో సంతోషమనిపించింది" ముహమ్మద్ﷺ జవాబు చెప్పారు.

"ఈసారి నువ్వు సిరియా వచ్చినప్పుడు వ్యాపారంలో ఎంతో సహాయపడతావు. కొనుగోళ్లు, అమ్మకాలు చేస్తావు. ఇప్పుడు చేసినట్టు, ఏ పనీ లేకుండా, ఏవో మాట్లాడుతూ సమయాన్ని వృధా చేస్తూ కూర్చోవు" నవ్వుతూ అన్నారు అబూ తాలిబ్.

ముహమ్మద్ﷺ వినయంగా నవ్వుతూ తల వంచారు.

# 7. యవ్వనం

"అదిగో ముహమ్మద్ ﷺ !"

"చూడండి, ముహమ్మద్ ﷺ తిరిగి వచ్చాడు" – చినిగిన బట్టలు వేసుకున్న పిల్లలు అరిచారు. ఒకళ్లను ఒకళ్లు తోసుకుంటూ ముహమ్మద్ ﷺ ను కలవటానికి ఇరుకైన మక్కా వీధుల గుండా పరిగెత్తారు. ఆయనతో చేతులు కలపడానికి పోటీపడ్డారు. గుంపుల్ని చీల్చుకుంటూ, పెద్దగా పాటలు పాడుకుంటూ, ఒకర్ని కరునెట్టుకుంటూ ఆయన్ను సమీపించారు.

ఈ అలికిడి విని తన ఇంటి ముందు ఆడుకుంటున్న ఒక చిన్న పాప ఆడుకోవటం ఆపేసింది. అందరి వెంట వెళ్తున్న అన్నయ్య చేయి పట్టుకుని ఆ పిల్లల గుంపుతో పరిగెత్తింది.

"మనం ఎక్కడికి వెళ్తున్నాం? ఎవరీ ముహమ్మద్ ﷺ ?" తన ఆట బొమ్మను మట్టిలో ఈడ్చుకుని వెళ్తూ అడిగింది.

"అతను ఎవరంటే....." ఆమె అన్నయ్య వివరించాడు. "ఎప్పుడూ వెళ్తూ వెళ్తూ మన స్నేహితుడు అస్వద్ పెంచుకుంటున్న గాడిదకు క్యారెట్ పెట్తాడే! మన పిల్లికి వీపు నిమురుతాడే అతను".

"మరి అతను నాకు ఖర్జూర పండ్లు ఇస్తాడా?"

https://teluguislam.net

"తప్పకుండా. త్వరగా పద. లేకుంటే అతను వెళ్లి పోతాడు."

"మీరు ముహమ్మద్ ﷺ ను కలవటానికి పోతున్నారా?" ఒక పెద్దమ్మాయి వీళ్లను అనుసరిస్తూ అడిగింది.

"అతను చాలా అందగాడు. మీకు తెలుసా? మక్కాలో చాలా మంచిగా దువ్వుకునేది అతనే. అతని తల, గడ్డం ఎప్పుడు చూసినా చూడ చక్కగా ఉంటాయి. అబూ అఫక్ లాగా చిందరవందరగా ఉండవు. అతని పళ్లు తెల్లగా మిలమిల మెరుస్తూ ఉంటాయి"– ఆ పెద్దమ్మాయి చెప్పుకుంటూ వాళ్లతో పాటు నడుస్తోంది.

"ఎందుకో చెప్పనా! అతను పండ్లపుల్లతో చాలా శుభ్రంగా పండ్లు తోముకుంటాడు" అంది ఆమెకు వంతపాడుతూ మరో చిన్న పాప.

"అతనికి ఉల్లిగడ్డలంటే అయిష్టం. వాటిని అతను అస్సలు తినడు. అతను మాట్లాడుతుంటే సువాసన వస్తుంది" అని చెప్పుకుపోసాగింది.

"ఆ సువాసనలు అతను వాడే సుగంధ ద్రవ్యాల నుంచి వచ్చేది" అని మాటల మధ్యలో ఆ పెద్దమ్మాయి చెప్పింది.

ఇద్దరు కుర్రవాళ్లు ముహమ్మద్ ﷺ ను తెల్లటి దుస్తులలో చూశారు. ముహమ్మద్ ﷺ ను కలవడానికి వెళ్తున్న ఈ చిన్న గుంపులో వాళ్లూ చేరారు.

"అతడు తిరిగి వచ్చాడన్న మాట" అని చిన్నపాటి గడ్డంతో ఉన్న ఒకతను చెప్పాడు.

"ఎప్పుడూ నా కళ్ల ముందు తిరిగేవాడు అతను. అతనికి మేము ఎప్పుడు కనిపించినా తీరికగా, ఆత్మీయంగా కనిపించేవాడు. అతను మా పరిసరాల్లో ఎంతో ప్రశాంతంగా సంచరించేవాడు. నేను ఎవరిని ఉద్దేశించి మాట్లాడుతున్నానో మీకు అర్థం కాలేదా?" బజారుకు పోతున్న బడా వ్యాపారవేత్తలను చూపిస్తూ ఒక పిల్లవాడు అన్నాడు.

"తొందరగా పదండి, అతని ప్రయాణం ఎలా జరిగిందో అడుగుదాం" అంటూ వర్తక బిడారు వైపు పరుగెత్తాడు.

ముహమ్మద్ ﷺ వారి కుశల ప్రశ్నలన్నింటికీ ప్రశాంతంగా జవాబులు చెప్పారు. తన వెంట తెచ్చిన ఖర్జూరాలను వాళ్లందరికీ సమానంగా పంచారు. ముహమ్మద్ ﷺ కు ఇరవై ఏళ్లు వచ్చాయి. అప్పటికే ఆయన విజయవంతమైన

https://teluguislam.net

వ్యాపారస్తుడు అయ్యారు. ఆయన వ్యాపారంలో చాలా నిజాయితిగా ఉండేవారు. ఆయన్ని అందరూ నమ్మేవారు. తన సరుకులు ఎక్కువ ధరలకు అమ్మడం కాని, మోసాలు చేయడం లాంటివిగాని చేసేవారు కాదు. ఇతర వ్యాపారస్తులు ఆయన్ని ఆదర్శంగా తీసుకునేవారు. వాళ్లు ఆయన్ని 'అమీన్' అని పిలిచేవాళ్లు. అమీన్ అంటే నమ్మకస్థుడు అని అర్థం. ఇది ఆయనకు ముద్దు పేరయింది.

ఒక రోజు పొద్దున్నే ముహమ్మద్ﷺ ఎవరినో కలవడానికి బయలుదేరారు. ఖదీజా అనే ధనిక విధవరాలును కలవటానికి వెళ్లారాయన. తన వ్యాపార వ్యవహారాలు చూసుకోవటానికి ఆమెకు ఒక మనిషి అవసరం ఉంది. దాని గురించి అబూ తాలిబ్ ముహమ్మద్ﷺ తో చెబుతూ, "ముహమ్మద్ﷺ! మనిద్దరం కలిసి ఉండడం నాకెంతో ఇష్టం. కాని నీకు తెలియనిది ఏముంది, నా వ్యాపారం సరిగా నడవడం లేదు. ఖదీజాకు తన వ్యాపారం చూసుకోవటానికి ఒకరి అవసరం ఉంది. ఆమె నా సహాయం కోరింది. నువ్వు వెళ్లి ఆమెకు సహాయపడతావని నిన్ను ఆమె దగ్గరికి పంపిస్తున్నాను" అన్నారు.

ఖదీజా తన వ్యాపారానికి సంబంధించిన లెక్కలను చూసుకుంటుండగా ముహమ్మద్ﷺ వచ్చారు. ఎంతో అందంగా, స్వచ్ఛంగా, మిలమిల మెరిసే నల్లటి కళ్లతో ఉన్న ఆ యువకుణ్ణి చూసి ఆమె మది సంతోషించింది.

"నేను ఒక నిజాయితీపరుడి కోసం చూస్తున్నాను. నా వర్తక బృందాలను వివిధ ప్రదేశాలకు తీసుకువెళ్లే బాధ్యతాయుతమైన మనిషి నాకు కావాలి. మీ పెదనాన్న అబూ తాలిబ్ మీ పేరును సూచించారు" అని చెప్పింది.

ఆమె అప్పగిస్తున్న బాధ్యతలను నిర్వర్తించటానికి ముహమ్మద్ﷺ సమ్మతించారు. వాళ్లిద్దరూ నిర్వర్తించవలసిన బాధ్యతలను గురించి చర్చించారు. అవి ఏమంటే, ఒక్కో వర్తక బృందానికి ఎన్ని ఒంటెలు అవసరం అవుతాయి, ఎంత పరిమాణంలో ఆహారాన్ని, నీటిని, వ్యాపారస్తులు తమతో తీసుకుని పోవాలి, ఎలాంటి వస్తువులు తీసుకుని పోవాలి, వాటిని ఎంత ధరకు విక్రయించాలి, మరీ ముఖ్యంగా వర్తకులు ఏ దారుల గుండా, ఏయే కాలాల్లో ప్రయాణించాలి.

ఆ మాటలన్నీ పూర్తయ్యాక ముహమ్మద్ﷺ ఆమె దగ్గర సెలవు తీసుకున్నారు. ఆయన తిరిగివెళ్తుంటే, ఆ స్త్రీ, ఖదీజా ఆయనను పిలిచి, "మిమ్మల్ని 'అమీన్' అని పిలుస్తారు కదూ! నమ్మకస్థులుగా మీరు పేరు పొందారు. నా దగ్గర పని చేస్తున్నంత

https://teluguislam.net

కాలం మీరు ఆ పేరును నిలబెట్టుకుంటారని ఆశిస్తున్నాను" అన్నది. ఆ పేరును నిలబెట్టుకుంటానని ముహమ్మద్ﷺ ఆమెకు మాట ఇచ్చారు.

అన్నట్టుగానే ముహమ్మద్ﷺ తన మాట నిలబెట్టుకున్నారు. చాలా కష్టపడి పని చేశారు. ఖదీజా తనకు వర్తక బృందాన్నంతా చూసుకునే బాధ్యతను అప్పగించారు. ఎడారుల వెంబడి ప్రయాణించడం, ఒయాసిస్సుల మీదుగా దూర ప్రదేశాలకు, నగరాలకు వెళ్లడంలోనే ఆయన సమయమంతా గడిచేది.

ఒక రోజు చాలా ఆశ్చర్యకరమైన విషయం జరిగింది. ఖదీజా పని మనిషి ముహమ్మద్ﷺ ను కలవడానికి వచ్చింది. ముహమ్మద్ﷺ ను పెళ్లి చేసుకోవాలన్న తన తలంపును ఖదీజా తన పని మనిషి ద్వారా తెలియచేసారు. ఆ విషయం విని ముహమ్మద్ﷺ నిర్ఘాంతపోయారు. అప్పటి దాకా ముహమ్మద్ﷺ కు స్త్రీలతో పరిచయంలేదు. తను ఎప్పుడూ వాళ్ల గురించి ఆలోచించలేదు కూడా.

కొంత కాలం క్రితం ఆయన గొర్రెలు మేపుతుండగా కొంత మంది గొర్రెల కాపరులు ఆయనను పిలిచి, "ముహమ్మద్ﷺ! ఈ రాత్రి మాతో నగరానికి వచ్చేయ్. అమ్మాయిలను ఏడిపిద్దాం" అన్నారు. ముహమ్మద్ﷺ వాళ్లతో కొంత సమయం తరువాత కలుస్తానని చెప్పారు. కాని ఆయన వాళ్లను కలవలేదు. మరుసటి రోజు వాళ్లు, "ఏమైంది, నిన్న రాత్రి రాలేదు?" అని ఆయనను అడిగారు. "సరిగ్గా ఆ సమయంలోనే నేను నిద్రపోయాను" అన్నారు ముహమ్మద్ﷺ. ఆ మాట విన్నాక వాళ్లందరూ సరదాగా నవ్వారు. ముహమ్మద్ﷺ కూడా వాళ్లతో కలిసి సరదాగా నవ్వుకున్నారు.

ముహమ్మద్ﷺ దృష్టిలో ఖదీజా ఒక ప్రత్యేకమైన స్త్రీ. ఆమె ఎంతో దయ కలది. మంచిది. ముహమ్మద్ﷺ కన్నా వయస్సులో ఆమె పెద్దవారే అయినప్పటికి అందంగా ఉండేవారు. పెళ్లికి సమ్మతించటానికి ముహమ్మద్ﷺ ఎక్కువ సమయం తీసుకోలేదు. వారి పెళ్లి జరిగింది. వాళ్లెంతో అన్యోన్యంగా జీవించారు. పిల్లపాపలతో వారి జీవితం సంతోషంగా గడవసాగింది.

https://teluguislam.net

# 8. అల్లాహ్ పిలుపు

ముహమ్మద్ﷺ వర్తక బిడారు యమన్‌కు బయలుదేరింది. చాలా సరుకులను మోసుకుంటూ పోతున్న ఆ సమూహపు ఒంటెలను ఇద్దరు మక్కా వర్తకులు గమనించారు. ఆ ఇద్దరిలో ఒకతను స్వయానా ముహమ్మద్ﷺకు పెద్దనాన్న. పేరు అబూ లహబ్.

తన బూడిద రంగు గడ్డం నిమురుకుంటూ అబూ లహబ్ అన్నాడు, "యువకుడు, ఖురైష్ తెగకు చెందిన మా అనాథ ఇదంతా చేశాడన్న మాట. చదువు సంధ్యలు లేనంత మాత్రాన తెలివి తక్కువవాడిగా మిగిలి పోలేదు. డబ్బు, ఖ్యాతి ఉన్నటువంటి మక్కాకు చెందిన ఒక విధవరాలి మనస్సును జయించడం గొప్ప విషయమే. అందువలన అటు ధనాన్ని, ఇటు సమాజంలో ఒక స్థానాన్ని సంపాదించుకున్నాడు. ఇది హర్షించదగిన పథకమే."

"నేను అట్లా అనుకోవడం లేదు. అదృష్టమే ముహమ్మద్ﷺతలుపు తట్టింది. అతని కొడుకైనటువంటి ఖాసిం చనిపోయినప్పటికీ అతనిని దురదృష్టం వెంటాడ లేదు. అతను నలుగురు కూతుర్లను కలిగి ఉన్నాడు. ఇప్పటికీ అతని భార్య ఎంతో సౌందర్యవతి, గొప్ప సమర్థురాలు. ఆమె వలననే అతను మక్కాలోకెల్లా

https://teluguislam.net

అత్యుత్తమైన వర్తక సమూహానికి నాయకుడు కాగలి గాడు. నిజంగానే అతను ఎంతో అదృష్టవంతుడు. ముహమ్మద్ﷺ ఇదంతా ఎంతో సక్రమంగా చేశాడనే నేను భావిస్తున్నాను" అని రెండో అతను అన్నాడు.


కాని ఆ సమయంలో ముహమ్మద్ﷺ అంతరంగం ఎవరికీ తెలియదు. బహుశ ఖదీజాకు తెలిసి ఉండవచ్చు. నిజానికి ముహమ్మద్ﷺ సిగ్గుపడుతున్నారు. తనకు ఇంత అదృష్టాన్ని కలిగించినటువంటి ఖదీజాకు తను ఇంకా చాలా చేయవలసి ఉండిందని. ఇదంతా ఆలోచించడానికి కూడా ఆయనకు సమయం లేకుండా పోయింది. ఊపిరాడనంతటి పని ఒత్తిడిలో మునిగి పోయి ఉన్నారు. భౌతిక ప్రపంచానికి సంబంధించిన వస్తువులను కొనడం, అమ్మడం ఆయనకు అసంతృప్తిని కలిగించేది. విసుగునూ కలిగించేది. ఆయనకు ఖచ్చితంగా తెలుసు, ఈ భూమి మీద తనది వర్తకుడి పాత్ర కాదని.

వర్తకుడి జీవితం సంకుచితమైనది, నిస్సారమైనది అని ముహమ్మద్ﷺ తెలుసుకున్నారు. ఆయన ఆత్మ వేరే దేని కొరకో పరితపిస్తోంది. జీవితానికి సంబంధించిన, మృత్యువుకు సంబంధించిన రహస్యాలను తెలుసుకోవాలని తీవ్రంగా ఉబలాటపడుతున్నది. అంతేకాదు, అల్లాహ్ పట్ల, తన పట్ల మానవుడి బాధ్యత గురించి ఆలోచిస్తున్నది. తనకు కావలసిన సమాధానాలు ప్రస్తుతం వున్న స్థితిలో కాబా గృహంలో దొరకవని ఆయనకు అర్థమైంది. ఎందుకంటే ఆ ప్రదేశమంతా విగ్రహారాధనతో, మూఢనమ్మకాలతో నిండిపోయింది. తన ఇంటి దగ్గర కాని, తను చేసే పని కాని ఆయనను సంతృప్తి పరచలేకపోయాయి.

ఆ సమయంలో ముహమ్మద్ﷺ అల్లాహ్‌ను ఇలా ప్రార్థించారు: "నేను ఈ అంధకారంలో నుంచి బయటపడే విధంగా నాకు మార్గాన్ని చూపు. నేను సన్మార్గంలో పయనించే విధంగా దారి చూపు".

వ్యాపార నిమిత్తం వెళ్లిన యాత్రల నుంచి తిరిగి వచ్చిన తరువాత ముహమ్మద్ﷺ తన భార్యను అడిగి, కొద్ది రోజులు గొర్రెలకాపరిగా ఉన్నారు. ఆ సమయాల్లో తను ఎంతో స్వతంత్రంగా నక్షత్రాలను చూస్తూ తన చిన్న నాటి రోజుల వలె గడిపేవారు. సౌమ్యమైన గొర్రెల ప్రకృతి సహచర్యంలో, నిశ్శబ్దంగా పారే నీటి దగ్గర, రాత్రి అందాన్ని ఆస్వాదిస్తూ గడిపేవారు. అప్పుడు ఆయన ఆలోచనల్లో చాలా

https://teluguislam.net



ప్రశాంతత వచ్చేది. తరచుగా ఉపవాసాలు ఉండేవారు. ఖదీజా అయోమయంగా, "ఏమిటి? పని దినాన కూడా ఉపవాసమేనా? ఎందుకు మిమ్మల్ని మీరు కష్టపెట్టుకుంటారు?" అని అడిగేవారు. అందుకు ముహమ్మద్ ﷺ, "నిజంగా నాకు ఉపవాసమే హాయి. పనిలా కాకుండా అది నాకు ఆటలా ఉంటుంది. నా కెంతో తేలికగా, ఉత్సాహంగా అనిపిస్తుంది" అనేవారు.

ఆయన అప్పుడప్పుడు మక్కా నుంచి హిరా కొండ వద్దకు పోతుండేవారు. అక్కడ ఎంతో సమయాన్ని గడుపు తుండేవారు. ఉపవాసం ఉంటూ, ప్రార్థనలు చేసుకుంటూ, ఆలోచించుకుంటూ, చింతన చేస్తూ ఆ కొండల్లో గడిపేవారు. అక్కడ ఆయన గడిపే సుదీర్ఘమైన సమయాలకు సరిపడేంత భోజనం ఖదీజా పంపిస్తుండేవారు.

రమజాన్ నెల చివరి పది దినాలలోని ఒక ప్రత్యేకమైన రాత్రి ముహమ్మద్ ﷺ హిరా కొండ వద్దకు వెళ్లారు. అలవాటుగా కూర్చునే ప్రదేశంలో కూర్చున్నారు. ఒక దినమంతా ఉపవాసం ఉన్నారు. ఒక రాత్రంతా ప్రార్థనలు చేశారు.

చిమ్మ చీకటిలో వేకువజాముకు కొద్ది ముందు ఆయన ఒక పిలుపును విన్నారు. ఆ పిలుపు పెద్దగా పెరుగుతూ పోయింది. అన్ని దిక్కుల నుంచి వస్తున్నట్లుంది. ఆ కొండ గుహలన్నీ మార్మోగుతున్నట్లుంది. అన్నిటికీ అతీతంగా ఉన్నట్లుంది. ఆయన చుట్టూ పరిశీలించారు. ఆయన ముందు దైవదూత ప్రత్యక్ష మయ్యాడు. అతని చేతిలో అందమైన పట్టువస్త్రం ఉన్నది. దాని మీద కుట్టినట్లుగా ఏదో రాసి ఉంది.

https://teluguislam.net

"చదువు" అని ఆజ్ఞాపించింది ఆ ఆకారం.

ముహమ్మద్ﷺ ఆశ్చర్యపోయారు. "నాకు చదవటం రాదు" అన్నారు.

దైవదూత ఆయన్ను ఒక్కసారిగా గట్టిగా కౌగిలించుకుని వదిలేశాడు.

"చదువు" దైవదూత మరొక్కసారి ఆజ్ఞాపించాడు.

"నాకు చదవటం రాదు?" ముహమ్మద్ﷺ కొంచెం బిగ్గరగా అన్నారు.

తిరిగి దైవదూత ముహమ్మద్ﷺ ను గట్టిగా కౌగిలించుకున్నాడు.

"చదువు" అని మూడవసారి ఆజ్ఞాపించాడు.

"నాకు చదవటం రాదు" ఇంకో కౌగిలింత జరుగుతుందేమోనని భయంతోనే మరలా అన్నారు ముహమ్మద్ﷺ .

దైవదూత తిరిగి కొనసాగించాడు,

**"చదువు, సృష్టించిన నీ ప్రభువు పేరుతో.**

**ఆయన మనిషిని నెత్తుటి ముద్దతో సృష్టించాడు.**

**నువ్వు చదువుతూ పో. నీ ప్రభువు దయాశీలి.**

**ఆయన కలం ద్వారా (జ్ఞాన) బోధ చేశాడు.**

**మనిషికి, అతడు ఎరుగని దానిని నేర్పాడు."**

దైవదూత వెళ్లిన తరువాత పై వాక్యాలను ముహమ్మద్ﷺ పదేపదే మననం చేసుకున్నారు. ఆ వాక్యాలు ఉచ్చరించటం వచ్చేంతవరకు ఆయన వాటిని గుర్తు చేసుకున్నారు.

ఆ దైవదూత, అతని చేతిలో రాసి ఉన్న వస్త్రం అదృశ్యమయ్యాయి. ముహమ్మద్ ఒంటరిగా మిగిలారు. కాని ఆయన మస్తిష్కంలో మాత్రం ఆ వాక్యాలు నిక్షిప్తమయి పోయాయి. అంతేకాదు, దైవదూత ఆలింగనం చేసిన ఒక అసాధారణమైన అనుభూతి కూడా ఆయన శరీరంలో ఉండి పోయింది. అకస్మాత్తుగా ముహమ్మద్ﷺ పూర్తిగా స్పృహ లోనికి వచ్చారు. వెంటనే ఒక ఆకస్మికమైన భయానికి కూడా లోనయ్యారు. చిన్నగా కంపిస్తున్న శరీరంతో, ఒక విధమైన భయంతో లేచి నిలబడ్డారు. గుహ నుంచి

https://teluguislam.net

బయటికి నడిచారు. ఆయన కొండ మీద నుంచి దిగుతున్నప్పుడు కూడా ఆ పిలుపును, అదే పిలుపును తిరిగి విన్నారు. ఆ పిలుపు ఆకాశాల నుంచి వినిపిస్తున్నది.

"ఓ ముహమ్మద్ﷺ! నువ్వు దైవప్రవక్తవి. నేను దైవదూతని. నా పేరు జిబ్రయీల్".

ముహమ్మద్ﷺ ఆకాశం వైపు చూశారు. అక్కడ మానవ ఆకారంలో దైవదూత నిలబడి ఉన్నాడు. ఎంత పెద్దగా ఉన్నాడంటే అతని రెండు పాదాలు భూమ్యాకాశాలను తాకుతున్నట్లు అనిపిస్తుంది. ముహమ్మద్ﷺ ఒక్క క్షణం నిర్ఘాంతపోయారు. ఆ దృశ్యం నుంచి తప్పించుకోవటానికి పక్కకి తిరిగారు. కాని దైవదూత ఆకాశమంతా నిండి ఉన్నాడు. ఏ దిక్కు తిరిగినా కనిపిస్తూనే ఉన్నాడు. ముహమ్మద్ﷺ నిస్సహాయంగా నిలబడిపోయారు. ముందుకు పోలేకపోయారు. వెనక్కీ రాలేక పోయారు. జిబ్రయీల్ దూత అదృశ్యమయ్యే దాకా అలానే ఉండిపోయారు. ఆ వేకువ సమయాన ముహమ్మద్ﷺ ఆ సన్నని వెలుగులో పర్వతం దిగి ఇంటికి చేరారు.

https://teluguislam.net

# 9. ఖురైష్ తెగ

ముహమ్మద్ﷺ ఇంటికి చేరి జరిగినదంతా తన భార్యకు పూసగుచ్చినట్టు చెప్పారు. అకస్మికంగా దైవ దూత ప్రత్యక్షమవడం, వెలుగంటి అతని మహా రూపం ఆకాశమంతా నిండి ఉండడం గురించి వివరించారు. జిబ్రయీల్ తనకు నేర్పించిన అద్భుత వాక్యాలను ముహమ్మద్ﷺ తన భార్య ముందు ఉచ్చరించారు. ఖదీజా ఆశ్చర్యంగా, ఆనందంగా చేతులు చరిచారు. అల్లాహ్ తన ప్రవక్తగా ముహమ్మద్ﷺ ను ఎంచుకున్నందుకు అల్లాహ్‌ను స్తుతించారు. వరుసకు సోదరుడయ్యే వరఖా బిన్ నౌఫల్‌కు ఈ విషయం తెలియజేశారు.

చాలా సమయం వరకూ ముహమ్మద్ﷺ ఆందోళన తగ్గలేదు. ఆయన భార్యను సమీపించి, ఆమె చేతిని తన చేతిలోకి తీసుకొని తనలోని ప్రశ్నలకు సమాధానాన్ని ఆమె కళ్లల్లో వెతుకుతున్నారు. "బహుశా నన్ను కలిసినది ఏదైనా ఆత్మ ఏమో? జిన్నాత్ రూపంలో నా భవిష్యత్తును, నా అదృష్టాన్ని చెప్పే శక్తి కావచ్చేమో? లేదా ఏదైనా షైతాను, ఉపాయంగా తనను వలలో వేసుకుందేమో?"

ఖదీజా ఆత్మీయంగా ఆయన చేతిని తన చేతుల్లోకి తీసుకొని, "లేదండి, అలా జరిగే అవకాశమే లేదు.

https://teluguislam.net

చాలా కాలం నుంచి మీరు నాకు తెలుసు. మీరెప్పుడూ పొగడ్తల కొరకు ఏమీ చేయలేదు. మీరంటే ఎంతో మందికి నమ్మకం. ప్రతి ఒక్కరికి మీ స్వచ్ఛమైన వ్యక్తిత్వం తెలుసు. ఏ దుష్ట ఆత్మా, మరే షైతానూ మిమ్మల్ని ప్రభావితం చేయడం అసాధ్యం. "అల్లాహ్ ఒక్కడే" అనే ధర్మం గురించి నా సోదరుడు వరఖా చెబుతుండేవాడు. అందు కని నేను మీ విషయమంతా అతనికి చెప్పాను. మీరు చూసిన ఆ దృశ్యాన్ని నేను అతని ముందు వర్ణిస్తున్నప్పుడు ముడతలు పడ్డ అతని ముసలి ముఖం ఎంతో వెలిగి పోయింది. ఇది దైవదూత బహిరంగ పరచిన అద్భుతమట. ప్రవక్తల దగ్గరకు అల్లాహ్ సందేశాన్ని దైవదూత తీసుకొని వస్తుంటాడట. ప్రవక్తలు ఇబ్రాహీమ్ దగ్గరకు, మూసా దగ్గరకు వచ్చిన దైవదూత ఇతనేనట, వరఖా నాతో చెప్పాడు" అని భర్తను ఓదారుస్తూ మాట్లాడారు.

అది విన్నాక, ముహమ్మద్ﷺ కాస్త కుదుటపడ్డారు. వరఖా అంటే తనకి ఎంతో గౌరవం. ఆయన తెలివైనవాడని తన నమ్మకం.

నెలలు గడుస్తున్న కొద్దీ మళ్ళీ ఏం జరుగుతుందో అని అనిపిస్తుండేది ముహమ్మద్ﷺకు. దైవదూత జిబ్రయీల్ తిరిగి ప్రత్యక్షమవలేదు. అతని నుంచి ఏ సందేశమూ లేదు. ముహమ్మద్ ప్రవక్తﷺ చాలా నిశ్శబ్దంగా ఉండసాగారు. ముభావంగా ఉంటున్నారు. ఖదీజా జరుగుతున్నదంతా గమనిస్తూ సాధ్యమైనంత వరకు తనని ఓదారుస్తూ ఉన్నారు.

ఊహించని విధంగా ఒక రాత్రి దైవదూత తిరిగి ప్రత్యక్షమయ్యాడు. ప్రవక్త ముహమ్మద్ﷺను నిద్ర లేపి మార్గాన్ని చూపిస్తున్నట్టుగా తన వ్రేలెత్తి చూపిస్తూ ఈ వాక్యాలు చెప్పాడు:

"ఓ దుప్పటి కప్పుకున్నవాడా! లే.

లేచి జనులను హెచ్చరించు.

నీ ప్రభువు గొప్పతనాన్ని చాటిచెప్పు."

అప్పట్నుంచి దైవదూత తరచుగా ప్రత్యక్షమయ్యేవాడు. అందమైన అరబిక్ భాషలో ప్రవక్తﷺకు చాలా బోధనలు చెప్పేవాడు. ప్రవక్తﷺ వాటిని తన సహచరులకు బోధించేవారు. ఆ సూక్తులను వాళ్లు నేర్చుకొని రాసేవాళ్లు. చాలా కాలం తరువాత ఆ సూక్తులన్నింటిని జతపరిచి పుస్తకంగా తేబడింది. అది దివ్య ఖుర్ఆన్‌గా మనందరికీ సుపరిచితమే.

https://teluguislam.net

మొట్టమొదటి ప్రవక్త అనుచరులు తన భార్య ఖదీజా, తన ఆప్తమిత్రుడు అబూ బక్ర్, ఇంకా ఇద్దరు పిల్లలు. ఆ పిల్లలిద్దరు ముహమ్మద్ ప్రవక్త ﷺ దత్తత తీసుకున్న వాళ్లే. ఒక పిల్లవాడి పేరు జైద్. అతను అబిసీనియాకు చెందిన బానిస. రెండో పిల్లవాడు స్వయానా ప్రవక్త పెత్తండ్రి కుమారుడు అలీ. అలీ చూడటానికి పెద్ద ఆకర్షణీయంగా ఉండరు. పొట్టిగా, బక్కపల్చగా కనిపిస్తారు. కాని ముహమ్మద్ ﷺ అంటే ఆయనకు ఎంతో అభిమానం, గౌరవం.

అబూ బక్ర్ ప్రవక్త ﷺ కు ప్రాణ స్నేహితులు. ప్రవక్త ﷺ అంటే అబూ బక్ర్‌కు ఎంతో నమ్మకం. ప్రవక్త ఏది చెబితే అదే సత్యమని నమ్మే మనిషి. "అల్లాహ్ ఒక్కడే" అన్న ప్రవక్త ﷺ సందేశాన్ని ఖదీజా, అలీ, జైద్‌లతో పాటు అబూ బక్ర్ కూడా ఎటువంటి సందేహం లేకుండా బలపర్చారు.

అబూ బక్ర్ వర్తకుడిగా మంచి పేరును సంపాదించుకున్నారు. ఆయన్ను ఇష్టపడి, గౌరవించేవాళ్లు తమ సమస్యలను చర్చించడానికి ఆయన వద్దకు వస్తుండేవారు. మెల్లమెల్లగా ఆయన వారికి కూడా "ఇస్లాం" గురించి చెప్పసాగారు.

జిబ్రయీల్ నుండి ముహమ్మద్ ﷺ అందుకుంటున్న అద్భుతమైన సందేశాలను వినడానికి ఒక్కొక్కరుగా వీరంతా వెళ్లసాగారు. మక్కా పట్టణానికి శివారు ప్రాంతంలో వీళ్లంతా ప్రార్థనలు చేస్తుంటారు. ఒక్కొక్కరు నిశ్శబ్దంగా ఇస్లాం పట్ల విశ్వాసులుగా మారిపోసాగారు.

మూడు సంవత్సరాలు గడిచాయి. ఒకరోజు జిబ్రయీల్ దూత ప్రత్యక్షమై ముహమ్మద్ ﷺ కు కొత్త సందేశం చెప్పారు. "ఓ ముహమ్మద్ ﷺ ! హెచ్చరించు, నీ సమీప బంధువులను, నిన్ను అనుసరించే విశ్వాసులను."

తన కుటుంబంలోని, తన ఖురైష్ తెగలోని ముఖ్యమైన వ్యక్తులకు ముహమ్మద్ ﷺ తన సందేశం చెప్పాల్సిన సమయం వచ్చేసింది. కాని ఆయన చెప్పే దానికి వాళ్లంతా ఎట్లా సమ్మతిస్తారు? వాళ్లు ఇష్టపూర్వకంగా పూజించుకుంటున్న తమ దేవీదేవతలను ఎట్లా వదులుకుంటారు? "అల్లాహ్ (నిజమైన ఆరాధ్యుడు) ఒకే ఒక్కడు" అని వారు ఎట్లా విశ్వసిస్తారు? ఖచ్చితంగా ఈ వ్యవహారమంతా ఏదో ఒక ఇబ్బందికి దారి తీస్తుందని ముహమ్మద్ ﷺ కు తెలుసు. అయినా సరే ఆయన ఈ పని చేయక తప్పదు. ఇది అల్లాహ్ ఆజ్ఞ.

https://teluguislam.net

అల్లాహ్ మీద భారం వేసి కర్తవ్యాన్ని నిర్వర్తించటం తప్పించి ఆయనకు ఇంకో మార్గం లేదు. ఈ నిర్ణయం తీసుకున్న తరువాత తనకు కొడుకు లాంటివాడైన అలీని పిలిచి చెప్పారు, "ఈ రాత్రి మనం ఒక ఉత్సవం జరుపుకోబోతున్నాం. పాలు, మాంసం ఇంకా ఇతర ఆహార పదార్థాలు సిద్ధం చేయి. మన బంధువులందరికీ నా తరఫున విందు ఆహ్వానాన్ని అందజేయి. ఆ సందర్భంగానే అల్లాహ్ ఆజ్ఞను నేను వాళ్లందరికీ వినిపిస్తాను".

అలీ వెనువెంటనే విందు ఏర్పాట్లలో నిమగ్నులయ్యారు. కాని లోలోపల ఆయనకు ఆశ్చర్యంగా ఉంది, ముహమ్మద్ﷺ తనకు అప్పజెప్పిన అతి కొద్ది మాంసం, ఒక గ్లాసుడు పాలు నలభై మంది ఖురైషి తెగ వాళ్లకు ఎట్లా సరిపోతాయా? అని.

ఆహ్వానించిన బంధువులందరూ విందుకు విచ్చేసారు. నలభై మంది దాకా వచ్చారు. అబూ తాలిబ్, అబూ సుఫియాన్‌తో పాటు అబ్బాస్, హమ్జా కూడా వచ్చారు. మెత్తని దిండ్ల మీద అందరూ కూర్చోగా, "అలీ పళ్లెంలో మాంసం తీసుకుని వచ్చి మధ్యలో పెట్టారు. ఆకలిగా ఉన్న బంధుమిత్రులంతా తమకు తామే వడ్డించుకో సాగారు. అలీ తన కళ్లను తానే నమ్మలేకపోతున్నారు. ఎందుకంటే ఎంత తిన్నా, మాంసం కూర ఏ మాత్రం అయిపోతున్నట్లులేదు, ఆశ్చర్యపోయిన అలీ దాని గురించి ఏదో మాట్లాడబోయి తల పైకెత్తి ముహమ్మద్ﷺను చూశారు. ప్రవక్తﷺ తననే చూస్తూ నవ్వుతూ ఉన్నారు.

అతిథులంతా విందు పూర్తి చేసుకుని హాయిగా, నెమ్మదిగా ఒకరినొకరు మాట్లాడుకోసాగారు. ప్రవక్తﷺ వారందరి దృష్టిని తన వైపుకు మరలించుకున్నారు. దైవ ప్రవక్తగా తన మీదున్న ప్రత్యేకమైన బాధ్యత గురించి చెప్పటం ప్రారంభించారు. అనేక మంది దేవుళ్లను పూజించటం కన్నా ఒకే ఒక్క అల్లాహ్‌ను ఆరాధించటం వాళ్లందరి జీవితాలకు శ్రేయస్కరమని అభ్యర్థన పూర్వకంగా విన్నవించారు.

తన మాట చెప్పటం పూర్తయిన తర్వాత లేచి నిలబడి, "మీలో నా మార్గంలో ఉండడానికి ఎవరు సిద్ధంగా ఉన్నారు?" అని స్పష్టంగా, నిర్మొహమాటంగా అడిగారు.

ముహమ్మద్ﷺ అందరినీ ఒకసారి కలియజూశారు. అందరూ ముఖం తిప్పుకున్నారు.


https://teluguislam.net

ఇబ్బందికరమైన ఆ నిశ్శబ్ద వాతావరణంలో అలీ ముందుకు వచ్చి, ప్రవక్త ﷺ పక్కన నిల్చుని, “నేనుంటాను, మీ సహచరుడిగా మీ సహాయకుడిగా” అన్నారు. ప్రవక్త ﷺ అలీ తల మీద చేతిని ఉంచి అక్కున చేర్చుకున్నారు.

వెటకారంగా నవ్వుతూ గుంపులో నుంచి ఎవరో అబూ తాలిబ్‌తో అన్నారు, “నీ తమ్ముని కొడుకు చెప్పినదాన్ని నువ్వు సమ్మతిస్తున్నావా?” అని.

ఆ మాటలు విన్న అబూతాలిబ్ బాధపడ్డారు. సుఫియాన్, హమ్జాకి మాత్రం నవ్వు ఆగడం లేదు. నవ్వుతూనే, వచ్చిన అతిథులంతా వెళ్లిపోయారు. ప్రవక్త ﷺ చెప్పిన చివరి వాక్యాలు వాళ్లందరికీ ఆ తర్వాతి కాలంలో పదే పదే గుర్తుకు వచ్చాయి.

తను చెప్పదల్చుకున్న సందేశాన్ని ముహమ్మద్ ﷺ ఖురైష్ తెగ వాళ్లకు చెప్పలేక పోయారు. అయినా కూడా మరోసారి ప్రయత్నిద్దామనుకున్నారు. ఈసారి ఆయన ఎంతో స్పష్టంగా చెప్పాలనుకున్నారు, ఇదంతా ఏదో కలో లేక కథో కాదని. ఒకే ఒక్కడైన అల్లాహ్ ఇచ్చిన నిజమైన బహిరంగ సందేశమనీ, విగ్రహారాధన నుంచి, దుష్ట సంప్రదాయాల నుంచి ప్రజలు తమ జీవనశైలిని మార్చుకోవాలనీ, ఆలస్యం కాక ముందే తమలో పరివర్తన తెచ్చుకోవాలని ముహమ్మద్ ﷺ వారికి చివరి హెచ్చరిక చేయాలనుకున్నారు.



https://teluguislam.net

తను చెప్పాలనుకున్నది ప్రజలకు తెలియజెప్పడానికి ఇక ఆయనకు తెలిసిన మార్గం ఒకే ఒక్కటి మిగిలి ఉంది. ముహమ్మద్ﷺ నడుచుకుంటూ వెళ్ళి సఫా కొండను అధిరోహించారు. తన ప్రజలను కాపాడుకునేందుకు, తనలో ఆత్మవిశ్వాసాన్ని, పట్టుదలను ప్రోది చేసుకున్నారు. సఫా కొండ అంచుకు చేరి ప్రమాదం ముంచుకొస్తున్నట్లు ఒక పెద్ద కేక వేశారు. నగరానికి ఏదన్నా విపత్తు సంభవించినప్పుడు, "యా సబాహా! యా సబాహా!" అని కేకవేయటం అక్కడి ఆనవాయితి.

మక్కాలోని పిల్లలు, పెద్దలు, స్త్రీలు అందరూ ఆ పిలుపుని విన్నారు. వెంటనే ఒక పెద్ద గుంపు అక్కడ చేరింది. అందులో తన ఖురైష్ తెగకు సంబంధించిన నలభై మంది కూడా ఉన్నారు. రంగు రంగుల జుబ్బాలు, తలపాగాలు ధరించి ఉన్న తన బంధు మిత్రులను పేరు పేరున కండ్లతోనే పలకరించి, అందరికీ వినిపించేలా బిగ్గరగా మాట్లాడటానికి గొంతును సవరించుకున్నారు.

"ఓ నా రక్త సంబంధీకుల్లారా! ఖురైష్ తెగ ప్రజలారా! ఈ పర్వతాల వెనుక నుంచి మీమీద దాడి చేయటానికి సాయుధ శత్రువులు వస్తున్నారని నేను చెబితే, మీరు నన్ను నమ్ముతారా?" అన్నారు.

అక్కడున్న వారు తాము తప్పకుండా నమ్ముతామని జవాబిచ్చారు.

"అయితే నా మాట వినండి. కొన్ని విషయాలలో మిమ్మల్ని హెచ్చరించమని నాకు ఆజ్ఞ అయింది. అందులో ముఖ్యమైనది ఒకే ఒక్క అల్లాహ్‌ను ప్రార్థించటం, ఇదే అన్ని ప్రార్థనల కన్నా శ్రేష్టమైనది, శ్రేయస్కరమైనదీను. అయినప్పటికీ మీరు విగ్రహాలనే పూజిస్తే మీ పరలోక జీవితం భయంకరంగా ఉంటుంది. ఆడపిల్లలను సజీవ సమాధి చేసే వారికి, అనాథలను దోచుకునే వారికి కఠినమైన శిక్షలు ఉంటాయి. జూదరులకు, తాగుబోతులకు కూడా శిక్షలు ఉంటాయి. కనుక ఒకే ఒక్క అల్లాహ్‌ను విశ్వసిస్తున్న నాతో చేతులు కలపండి."

నిలబడిఉన్న జనం వెనుక అకస్మాత్తుగా ఖడ్గాన్ని ఝుళిపించినట్లు, "అబద్ధాల కోరు, అబద్ధాలకోరు" అంటూ ఒక పెద్ద శబ్దం వినిపించింది. ఆ గొంతు అబూ లహబ్‌ది.

అబూ లహబ్ అంటే జ్వాలాముఖి అని అర్థం. అతని పేరు లాగానే, ఆ సమయంలో అతని ముఖం మండుతున్న జ్వాల మాదిరిగా ఉంది. జనం అతని వైపు తిరిగారు. ఆవేశంతో ఊగిపోతూ అతను మళ్ళీ అరిచాడు, "నీకెంత ధైర్యం. పని

https://teluguislam.net

చేసుకుంటున్న మాకు అంతరాయం కలిగించడమే కాక ఈ చెత్తంతా వినిపిస్తావా?" అంటూ కోపంగా కింద నుంచి రాళ్లందుకుని ప్రవక్త మీదకు విసిరాడు.

అక్కడున్న అలీ, జైద్‌లు అది చూసి నిశ్చేష్టులయ్యారు. అబూ లహబ్, అబూ జహల్‌లు నోట్లో ఏవేవో గొణుక్కుంటూ అక్కడ నుంచి వెళ్ళిపోయారు. పోగైన జనమంతా వారిని అనుసరించారు.

చాలాసేపటి వరకు ప్రవక్త అలానే ఉండిపోయారు. విచార వదనంతో, తన బొంత కప్పుకుని, ప్రపంచంతో సంబంధం లేని వాడిలాగా అలానే నిలబడిపోయారు. ఎన్నో గంటలు గడిచి పోయాయి. చీకటి అలుముకుంది. ప్రవక్త ﷺ నిదానంగా మౌనం వీడి ఇలా చెప్పారు,

"అబూ లహబ్ మాటలు, ఆలోచనలు కాలానికి నిలబడేవి కావు. అవి ఖచ్చితంగా కొట్టుకుపోతాయి. అతని సంపద, ఆస్తిపాస్తులు అతణ్ణి ఏ విధంగానూ కాపాడలేవు".

https://teluguislam.net

# 10. ప్రతి పక్షం

అది సాయంకాలం. మక్కా నగరం నలువైపులా చీకటి కమ్ముకుంటోంది. మసక మసక వెలుతురు మాత్రమే కనిపిస్తోంది. ఎక్కడో దూరాన కుక్కలు మొరుగుతున్నాయి. వేగంగా వీస్తున్న గాలులు ఎడారి లోని ఇసుకను ఉవ్వెత్తున లేపుతున్నాయి. మేఘాల మాటున నక్కిన అస్తమించే సూర్యుడు కాబా మీద, అక్కడ గుమిగూడిన ప్రజల మీద ఒక గంభీరమైన చీకటిని ప్రసరింపజేస్తున్నాడు. అక్కడ పోగైన పెద్దలంతా ఖురైష్ తెగవాళ్లు. అబూ లహబ్ వాళ్ళందరి ముందు ముహమ్మద్ﷺ గురించి ప్రస్తావిస్తున్నాడు. కాబా సింహ ద్వారం వద్ద ఉన్న హుబల్ దేవుని చిత్రపటం, అబూ లహబ్‌ను చూస్తున్నట్లే ఉంది.

"ముహమ్మద్ﷺ కేవలం కలలు కనేవాడో లేక కల్పనా చతురుడో కాదు, అతనో ప్రమాదకరమైన పిచ్చి వాడు. అతను తరతరాలుగా వస్తున్న విశ్వాసాలను, నమ్మకాలను కాలరాస్తున్నాడు. ఇదంతా ఎక్కడికి దారి తీస్తుందో, మీకేమన్నా అర్థమవుతుందా? ఒకవేళ అతను మక్కా ప్రజలను నమ్మించగలిగితే, ఉన్న విగ్రహాలను నాశనం చేయించగలిగితే, ఈ మక్కా తీర్థయాత్రలకు ఎవరు వస్తారు? యాత్రికులు లేకుండా మక్కా

https://teluguislam.net

బంగారం లేకుండా మన ఖజానాలు మిగిలిపోతాయి, మనమంతా కూడా పేదరికంతో ఉండిపోతాం. బాధాకరంగా మిగిలిపోతాం, ఒక పొగరుబోతు, మానసిక బలహీనుడి తప్పిదాల వలన మనం ఈ బాధలు అనుభవించవలసినదేనా?"

ఇక అప్పుడు అబూ జహల్ జోక్యం చేసుకున్నాడు. కండ్లు చిట్లించి, చిన్నవిగా చేసి గొణుగుతూ అన్నాడు. "నా అభిప్రాయం అడిగితే, అతన్ని చంపేయాలని అంటాను. హుబల్ దేవుడి సాక్షిగా! ఆ పని చేయటం నాకెంతో సంతోషం" అన్నాడు. ఇంకో పెద్ద మనిషి తన చేతిని పైకి ఎత్తి తను మాట్లాడుతానని సంసిద్ధత ప్రకటించాడు. అతను ఎంతో తెలివిగా, జాగ్రత్తగా మాట్లాడసాగాడు. "నా ప్రియ మిత్రుడా, అబూ జహల్! నాకు నీ హింసాత్మక చర్యల గురించి భయం కలుగుతుంది. ఎందుకంటే ఇప్పటి వరకు అటువంటి చర్యలేవీ సత్ఫలితాలను ఇవ్వలేదు. మొన్నటికి మొన్న జనం మధ్యలో నువ్వు ముహమ్మద్ﷺకు వ్యతిరేకంగా మాట్లాడుతూ ఉంటే మన యోధుడు హమ్‌జాకు రోషం వచ్చింది. అతను ముహమ్మద్ﷺ వైపు మాట్లాడేంత ఉద్వేగానికి లోనయ్యాడు. తర్వాత కొద్ది కాలానికే అతనూ ముహమ్మద్ﷺ వర్గంలో చేరిపోయాడు. అసలు ఏమి జరుగుతున్నదో ఎవరికీ తెలియకముందే ఇది జరిగిపోయింది. 'అల్లాహ్ ఒక్కడే' అనే విశ్వాసాన్ని నమ్మినవాడిగా ప్రకటించుకుని హమ్‌జా కూడా ముహమ్మద్ﷺకు అనుచరుడిగా మారిపోయాడు. అంతేకాదు అతనికి నమ్మకంగా, వినయంగా ఉంటానని ప్రతిజ్ఞ కూడా చేశాడు. నీ వలన మన ఖురైష్ తెగ నుంచి ఇంకో మనిషి ఆ మూర్ఖపు విశ్వాసాలలోకి వెళ్లిపోయాడు".

అబూ లహబ్ వైపు చూసి, తిరిగి తన మాటలు కొనసాగించాడు.

"మీరు చెప్పేది మేము బాగానే అర్థం చేసుకున్నాం. కాని ఈ సమస్యను పరిష్కరించే మార్గాలు వేరేవి ఉన్నాయి".

"ఏమిటా పద్ధతులు? దయ చేసి చెప్పండి!" అన్నాడు అబూ లహబ్.

"ముహమ్మద్ﷺకు పెదనాన్న, మన తెగ నాయకుడు అయిన అబూ తాలిబ్ మన దేవుళ్లను, దేవతలను వదిలి వెళ్లడానికి సిద్ధంగా లేకపోయినా ముహమ్మద్ﷺను మాత్రం రక్షిస్తానని మాట ఇచ్చాడు. ఇప్పటికే రెండు సార్లు మనం అతని నిర్ణయం మార్చడానికి ప్రయత్నించాం. కాని అతను తన నిర్ణయం మార్చుకోలేదు. అదీగాక హాషిమ్ ఉపతెగకు సంబంధించిన సభ్యులు కూడా ముహమ్మద్ﷺకు వినయంగా ఉంటున్నారు. అతని అభిప్రాయాలను వాళ్లు నమ్మినా నమ్మకపోయినా ఖురైష్ తెగ

https://teluguislam.net

చీలిపోయింది. హాషిమ్ వంశస్తులు ముహమ్మద్ﷺ వైపు ఉన్నారు. విపక్షం మన వైపు ఉన్నది."

ఇంకో పెద్ద మనిషి అక్కడికి వచ్చి అయాసపడిపోతూ అన్నాడు, "ఆ ప్రస్తావన అక్కడితోనే ఆగిపోలేదు. మీరు అసలు నమ్మలేరు. ఇదెంతో దిగ్భ్రాంతికరమైన విషయం. మన మిత్రుడు, మహా బలుడైన ఉమర్ తన ఇష్టంగా ముహమ్మద్ﷺతో కలిసిపోయాడు. అతను తిరుగుబాటు గుంపులో చేరాడు".

వింటున్న వాళ్లంతా స్థాణువులైపోయారు. ఈ విషయాన్ని తాము నమ్మలేమన్నట్టు అరిచారు. కాని ఆ పెద్దమనిషి తన మాటలను కొనసాగించాడు.

"తన సొంత చెల్లెలు, బావ రహస్యంగా ముహమ్మద్ﷺతో చేరిన విషయం తెలుసుకున్న ఉమర్ కోపంతో ఊగిపోయాడు. వాళ్లను తిట్టాలని, శిక్షించాలని వాళ్ల ఇంటికి వెళ్లాడు. కాని అక్కడికి చేరాక అతను ముహమ్మద్ﷺ సందేశాలను విన్నాడు. ఆ మాటలు విని మంత్రముగ్ధుడయ్యాడు. ఒకలాంటి మోహంలో నేరుగా 'అల్-అర్ఖమ్' ఇంటికి బయలుదేరాడు. ముహమ్మద్ﷺ, అతని అనుచరులు అక్కడే సమావేశమవుతుంటారు. ఉమర్‌ను చూసి అక్కడి వాళ్లంతా భయపడ్డారు. కాని ముహమ్మద్ﷺ మాత్రం అతనిని అడిగాడు, "ఉమర్! ఎంత కాలం ఈ వేదన అనుభవిస్తావు? ఏదో ఒక ఉపద్రవం సంభవించవలసిందేనా?"

ఉమర్ సమాధానం అందరినీ ఆశ్చర్యచకితులను చేసింది, "అల్లాహ్ ఒక్కడే అనటానికి నేనే సాక్షి, మీరు అల్లాహ్ ప్రవక్త."

ఈ పరిణామం గురించి విన్న పెద్దలు తాము నమ్మలేక పోతున్నట్టు గుసగుసలాడుకున్నారు. "మనం ఉమర్‌లాంటి బలమైన అనుచరుడిని కోల్పోయాం" అంటూ వారిలో ఒకతను నిరుత్సాహంగా అరిచాడు.

తెలివి గల పెద్ద మనిషి తిరిగి మాట్లాడాడు. "మనం ఇద్దరు బలమైన మనుషులను కోల్పోయాం అన్నది స్పష్టం. ఏది ఏమైనా హింస రక్తపాతానికే దారి తీస్తుంది. అంతేకాదు, చివరికి అది మన రక్తమే కావచ్చు. అందుకే నేను వేరే మార్గాలు ఉన్నాయని ఇదివరకే చెప్పాను. మీరు వింటానంటే నా దగ్గర దీనికి ఒక చక్కటి ఉపాయం ఉంది. అది - ముహమ్మద్ﷺకు, అతని అనుచరులకు ఆహారం అందకుండా చేయటం. ఖురైష్ తెగ పెద్ద మనుషులముగా, మక్కాను పరిపాలించే

https://teluguislam.net

యంత్రాంగ సభ్యులముగా మనం ఒక నిషేధాజ్ఞను జారీ చేద్దాం, కాబాలో ఆ తిరుగుబాటుదారులకు ఆహారాన్ని విక్రయించకూడదని".


"అవును.. ఏమీ అమ్మకూడదు. బట్టలు కాని, సామాన్లు కాని ఇంకేమైనా కాని. అసలు ఏ సంబంధాలు, ఏ వ్యవహారాలూ వాళ్లతో ఉండకూడదు. అన్ని విధాలుగా వారు మాడిపోవాలి. ఈ మోసగాడి పట్టు వారిమీద ఎంత బలంగా ఉన్నదో అప్పుడు బయటపడుతుంది. కడుపులు మాడితే అప్పుడు వాళ్లే హుబల్, లాత్ దేవుళ్ల కొరకు కేకలేస్తారు."

"నిజమే. అద్భుతమైన ఆలోచన" – అబూ లహబ్, ఇతరులు అందరూ అంగీకరించారు.

అక్కడ గుమిగూడిన వాళ్లంతా దాన్ని సమర్థిస్తున్నట్లు చేతులు కలిపారు. ఈ ఉపాయం తెలిపిన పెద్దమనిషే నిషేధ ఉత్తర్వును స్వహస్తాలతో రాశాడు. ఉత్తర్వును గొర్రె తోలు కవరులో పెట్టి సీలు చేశారు. దాన్ని కాబాలో వ్రేలాడదీసి చీకటి రాత్రిలో అందరూ ఇళ్లకు వెళ్లిపోయారు.

ఆ ఉత్తర్వు కాబాలో ఒక ఎత్తయిన ప్రదేశంలో రెండు సంవత్సరాల పాటు అలాగే ఉంచబడింది. అంత కాలం ముహమ్మద్ﷺ, ఇంకా ఆయన అనుచరులు బహిష్కృత జీవితం గడిపారు. పేదరికంతో, ఆకలితో అలమటించారు. కొంతమంది మంచిమనుషుల సహాయంతో వీళ్ల కష్టం కొంత తగ్గేది. ముహమ్మద్ﷺ అనుచరులు వలస పోయి ఉన్న శివారు ప్రాంతానికి ఆ కొద్దిమంది రహస్యముగా ఎప్పుడన్నా ఆహారమును అందచేసే వాళ్లు. అనుచరులు భయంకరమైన ఆకలిని, పేదరికమును ఎదుర్కొన్నప్పటికీ, ముహమ్మద్ﷺ పట్ల, ఆయన సందేశం పట్ల విశ్వాసంగానే ఉన్నారు. అబూ తాలిబ్ ఏర్పాటు చేసిన ఆశ్రయాలలో వీళ్లంతా కూర్చుని ప్రవక్త బోధించినట్లు ప్రార్థించేవాళ్లు. వాళ్లంతా ముహమ్మద్ﷺ చుట్టూ ఖర్జూరపు మట్టల మీద కూర్చుని సందేశాలను వినేవాళ్లు. ప్రశ్నలు వేసే వాళ్లు. సలహాలు అడిగేవాళ్లు. కొంతమంది అనుచరులు, ముహమ్మద్ﷺ సాంగత్యంలో గడపటాన్ని ఎంతో అదృష్టంగా భావించేవాళ్లు. అల్లాహ్ సందేశం ప్రవక్తﷺకు చేరాక, ప్రవక్తﷺ వీళ్లతో తిరిగి చెపుతున్నప్పుడు వీళ్లు వెంటనే గొర్రె చర్మాల మీదనో లేదా ఖర్జూరపు ఆకుల మీదనో రాసుకునేవాళ్లు.

https://teluguislam.net



ఇవే ఖుర్‌ఆన్‌లోని మక్కా సూరాలుగా ఆదరింపబడ్డాయి.

ముహమ్మద్ﷺ అనుచరులు ఈ సూరాలను ఉచ్చరిస్తూ, చూడకుండా కంఠతా వల్లించే విధంగా వాటిని నేర్చుకుంటూ ఉండేవాళ్లు. సుదీర్ఘమైన చీకటి రాత్రుల్లో, బయటి ప్రపంచమంతా ఆదమరిచి నిద్రిస్తున్న సమయంలో ప్రవక్త ముహమ్మద్ﷺకు తన అనుచరుల ఖుర్‌ఆన్ పారాయణ శబ్దాలు వినిపిస్తుండేవి.

ఎక్కడో దూరంగా ఒక మూలనున్న ఇంటి నుంచి, భక్తి పారవశ్యంలో మునిగి తేలుతూ ఎంతో గంభీరమైన అరబిక్ భాషలో ఖుర్‌ఆన్ పారాయణం చేస్తున్న ఒక అనుచరుని ఇంపైన స్వరం లీలగా వినపడుతోంది:

"......దీని కన్నా గొప్పదేదీ కాదు.

అల్లాహ్‌ను ప్రార్థించటం.

స్వచ్ఛంగా ఆయనకు అర్పితమవడం

నిజంగా, నిజాయితీగా విశ్వసించటం

నిత్యం ప్రార్థనలు చేస్తూ ఉండడం.

https://teluguislam.net

నిత్యం దాన ధర్మాలు చేయడం
ధర్మం అంటే ఇదే"
ఇంకో మూల నుంచి తరంగంలా మరో గొంతు-
కరుణామయుడు, కృపాశీలుడైన అల్లాహ్ పేరుతో ప్రారంభం
"అల్లాహ్ ఒక్కడే,
అల్లాహ్ ఒక్కడంటే ఒక్కడే
ఆయన ఎవరికీ జన్మించలేదు
ఆయనకు సంతానం ఎవరూ లేరు
ఆయనను పోలినవారు మరెవరూ లేరు."

ఉదయపు వెలుగు మక్కా మీద ప్రసరించగా, వాళ్లంతా నమాజు చేయటానికి ప్రవక్తను అనుసరించారు.

నిషేధానికి గురి కాని ప్రవక్త బంధువు హిషామ్ విచారంలో మునిగి ఉన్నారు. తన కుటుంబంలోని సభ్యులు మలమల మాడుతూ ఉండడం చూస్తూ తను ఎలా సహించగలరు? తను ఏదో ఒకటి చేయాలి.

ఒక అర్థ రాత్రి అవసరమైన అన్ని రకాల ఆహారాలతో, సరుకులతో ఒంటె మీద, విశ్వాసులు ఉన్న ఇంటికి బయలుదేరారు. ఆ ఇరుకు సందుల్లో గుండా ఒంటెను రహస్యంగా గమ్యానికి చేర్చడం కష్టమని తోచింది. ఆయనకు ఒకే ఒక ఉపాయం తట్టింది. ఒంటె వెనుకకు వెళ్లి దాన్ని గట్టిగా బాదారు. దానితో ఒంటె సందు చివరి వరకు వెళ్లింది.

ఈ పద్ధతి కొంత కాలం నడిచింది. కాని అది పూర్తి పరిష్కారం కాదు కదా! ఒక నలుగురు మనుషులను పోగు చేసి మక్కా వెలుపల రహస్యముగా కలిశారు. నిషేధాన్ని ఎత్తి వేయటం గురించి వాళ్ళు చర్చించుకుంటున్నారు. "విశ్వాసులంతా నాశనం అయిపోవటం మీకు సమ్మతంగా ఉందా? ఖురైష్ తెగ పెద్దలు మీ పట్ల కూడా ఇలానే ప్రవర్తిస్తారు" అంటూ తోటివారిని ఆయన గట్టిగా అడిగారు.

ఆయన మాటలు అబూ జహల్ విన్నాడు. పెద్దగా అరిచాడు. "నువ్వు పిచ్చిగా మాట్లాడుతున్నావు. నిషేధపు ఉత్తర్వును చించి వేయటం జరగని పని. ఇప్పటి వరకు

https://teluguislam.net

అలా జరగలేదు. ఉత్తర్వు రాశాక ఇక మనం చేసేది ఏమీ ఉండదు. నిన్ను చూస్తుంటే ఉత్తర్వును చించి వేయాలని ముందుగానే నిర్ణయించుకున్నట్లు ఉన్నావు. పైగా ఈ విషయం ఇంకెక్కడో కూడా చర్చించినట్లు ఉన్నావు".

అబూ జహల్ కోపంగా ఏవేవో అన్నాడు. కాని హిషామ్ మాత్రం ఏమీ పట్టించుకోలేదు. నేరుగా ఉత్తర్వు తగిలించిన చోటికి వెళ్లారు. దాన్ని తీసుకొని చింపేయాలని చూశారు. కాని అప్పటికే చెద పురుగులు దాన్ని దాదాపుగా తినేశాయి. ఆ దుష్ట నిషేధపు ఉత్తర్వులో అక్షరాలేమి లేకుండా పోయాయి.

నిషేధపు రోజులు పూర్తయ్యాయి. ముహమ్మద్ ﷺ, ఆయన అనుచరులు మక్కాలో సంచరించడానికి, కొనుగోళ్లు, అమ్మకాలు చేసుకోవడానికి తిరిగి అనుమతించబడ్డారు.

https://teluguislam.net

# 11. జిన్నాత్ ●

ముహమ్మద్ ప్రవక్త ﷺ మక్కా వీధుల్లో వేగంగా నడవసాగారు. తనతో పాటు అలీ, జైద్ కూడా ఉన్నారు. చేతులు రెండూ వెనక్కి కట్టుకుని, శరీరం కాస్త ముందుకి వంగినట్లుగా, పర్వతాన్ని ఎక్కుతున్నట్లుగా ముహమ్మద్ ﷺ ముందుకు వెళ్లసాగారు. నిషేధం ఎత్తి వేసిన తరువాత విశ్వాసులు స్వేచ్ఛగా నగరంలో తిరగ సాగారు. ప్రజా సమూహాలలో, అందరితోనూ కలవ సాగారు. యాత్రికులతోనూ, వినడానికి సిద్ధంగా ఉండేవాళ్లతోనూ ప్రవక్త మాట్లాడేవారు. ఆయన చెప్పే సందేశం వినటానికి కొందరు ఎంతో కుతూహలంతో వచ్చేవారు. వారిని అబూ లహబ్ తరచుగా అడ్డుకోవ డానికి ప్రయత్నించేవాడు.

ఒక రోజు, కాబాగృహ దర్శనానికి వచ్చిన కొంత మంది యాత్రికులు ముహమ్మద్ ﷺను ఆపారు. వారిలో పొడవాటి యమనీ వస్త్రం ధరించివున్న ఒక యువకుడు, "నిన్ను దైవప్రవక్త అని పిలుస్తారట కదా! అయితే మేము నిన్ను తిరస్కరిస్తే మాకు హాని జరుగు

● *'జిన్నులు' అనేవి ఒక రకపు అగోచర ప్రాణులు. మానవుల మాదిరిగా వీరు కూడా బుద్ధిజ్ఞానాలు కలిగిన జీవులు. అల్లాహ్ మానవులతోపాటు జిన్నులను కూడా తన ఆరాధన కోసమే పుట్టించాడు. (ఖుర్ఆన్ 51 : 56)*

https://teluguislam.net

తుందా?" అని అడిగాడు. దానికి జవాబుగా ప్రవక్త వాళ్లకు అంతిమ రోజును గురించిన ఒక సూరాను వినిపించారు.

"ఆ రోజు మనుషులంతా
వర్గీకరించబడిన గుంపులుగా వస్తుంటారు,
కర్మల చిట్టా చూపించడానికి–
ఏవైతే వాళ్లు చేశారో అవి.
అప్పుడు ప్రతి ఒక్కరి
ప్రతి మంచి పని చూడబడుతుంది,
అది ఎంత సూక్ష్మమైనదైనా సరే;
అప్పుడు ప్రతి ఒక్కరి
ప్రతి చెడ్డ పని కూడా చూడబడుతుంది
అది ఎంత సూక్ష్మమైనదైనా సరే;

అల్లాహ్ సెలవు:

మేము అటు వైపు తిరిగాము
జిన్నాత్‌ల ఒక బృందం
శ్రద్ధగా ఖుర్ఆన్ వింటున్న వైపు–
వాళ్లల్లో వాళ్లు పరస్పరం
మౌనంగా ఖుర్ఆన్ విందాం
అనుకున్నారు
వినటం పూర్తయ్యాక వాళ్లు
తమ ప్రజల దగ్గరికి వెళ్ళారు–
ఖుర్ఆన్ గురించి చెప్పటానికి,
వారు చేస్తున్న పాపాల గురించి హెచ్చరించటానికి.
ఓ మా ప్రజలారా!
మేము ఒక గ్రంథం విన్నాము
అది మూసా తరువాత అవతరించినది
ఆ విషయం కూడా అందులోనే ఉంది

https://teluguislam.net

అది మానవులందరికీ మార్గదర్శి
సత్యాన్ని తెలుపుతుంది
సరియైన మార్గాన్ని చూపుతుంది
ఓ మా ప్రజలారా! వారి మాట వినండి
ఎవరైతే మిమ్మల్ని అల్లాహ్ వైపు ఆహ్వానిస్తున్నారో
వారిని నమ్మండి
మిమ్మల్ని, మీ పాపాలని అల్లాహ్ క్షమిస్తాడు
మిమ్మల్ని దుఃఖం నుంచి విముక్తుల్ని చేస్తాడు
ప్రవక్త మాటలు ఎవరు వినరో
అతను బయటపడలేడు
భ్రష్టుపట్టిన మార్గంలోనే ఉండి పోతాడు
ఈ అనంత విశ్వంలో అల్లాహ్ అస్తిత్వమే సత్యం
అల్లాహ్‌ను మించిన రక్షకుడు వేరెవరూ లేరు.

– 46వ సూరా, అల్ అహ్‌ఖాఫ్‌కు భావానువాదం

అప్పుడే అబూ లహబ్ అందరినీ తోసుకుంటూ ముందుకు వచ్చి, "అతను చెప్పేవన్నీ అబద్ధాలు. అతనో పిచ్చోడు" అని అరిచాడు. అక్కడ పోగైన ప్రజలందరూ ఎవరి దారిన వాళ్లు వెళ్లసాగారు. ఆ గొడవలో తలదూర్చడం ఎవరికీ ఇష్టంలేదు.

కొంచెం దూరం వెళ్లాక, పవిత్ర గ్రంథాల మీద అధ్యయనం చేసే ఒక సమూహం విశ్వాసుల వద్దకు వచ్చి ప్రవక్తతో, "నిన్ను నువ్వు దైవప్రవక్త అని పిలుచుకుంటావు కదా! కాని గతంలో వచ్చిన దైవప్రవక్తలు అద్భుతాలు చేసేవారు. యేసు చనిపోయిన వారిని తిరిగి బతికించేవారు. మోషే తన బెత్తాన్ని పాముగా మార్చే వారు. సముద్రాన్ని ఆపగలిగే శక్తి కూడా ఉండేది ఆయనకి" అన్నారు.

అప్పుడు ప్రవక్త(స) వారినే చూస్తూ, "ఖుర్ఆన్ అవతరింపబడుతుంది. దీని కన్నా పెద్ద అద్భుతం ఇంకేం కావాలి?" అన్నారు.

అక్కడి నుంచి నడుస్తూ ఉండగా, ప్రవక్త(స) తన చేతిని అలీ భుజం మీద వేసి, "అది నిజమే. ఆ ఇద్దరు ప్రవక్తలు మోషే, యేసులు అద్భుతాలు చేశారన్న మాట నిజమే. కాని చాలా మంది వాళ్లను కూడా నమ్మలేదు" అని చెప్పారు.

https://teluguislam.net

మాట్లాడుకుంటూ, వాళ్లు ఇంటికి చేరగానే కోపంతో అరుస్తున్న జనం వాళ్లకు ఎదురుపడ్డారు.

'మన దేవుళ్లను నమ్మనివాడు' 'లేనిపోని సమస్యలను సృష్టించేవాడు' 'అమాయకంగా నటిస్తున్నవాడు ఇతడే!' అంటూ ఆ గుంపులో నుంచి ఒకతను అరుస్తున్నాడు, గుప్పెట్లో మట్టి తీసుకుని ప్రవక్త ముఖం మీదకి విసిరాడతను.

ఇదంతా చూస్తున్న ప్రవక్తﷺ కూతురు ఫాతిమా త్వరత్వరగా ప్రవక్తను ఇంటి లోపలికి తీసుకుని వెళ్లింది. ప్రేమగా మట్టితో నిండిన ఆయన తలను శుభ్రం చేసింది. ఆ తరువాత ఏడ్వడం మొదలు పెట్టింది.

ప్రవక్తﷺ తన కూతురిని ఓదారుస్తూ, "ఏడవకమ్మా...... ఏడవకు.... నువ్వు చూస్తావు....అల్లాహ్ నీ తండ్రికి రక్షకుడిగా ఉన్నాడు" అన్నారు.

తన ప్రియమైన స్నేహితుడు అబూబక్ర్‌ను తన వద్దకు పిలుచుకుని సంభాషించటం మొదలు పెట్టారు.

"నా బాగోగులు చూసే నా ప్రియమైన భార్య ఖదీజా చనిపోయింది. నా సంరక్షకులు, పెదనాన్న అబూ తాలిబ్ కూడా చనిపోయారు. అల్లాహ్ ఒక్కడే అనే విశ్వాసం ఉన్న వాళ్లు ఈ పట్టణంలో పెరగటంలేదు. ప్రియ మిత్రమా! మనం ఏ దారిలో ప్రయాణించాలన్నది అర్థం కాకుండా ఉన్నది."

ప్రవక్తﷺ మాటలు జైద్ విన్నారు. ఆయన బాధను భరించలేక పోయారు. ఆలోచించగా, ఆయనకో ఉపాయం తట్టింది. ప్రవక్తﷺకు సమీపంగా వెళ్లి అన్నారు, 'ఓ దైవప్రవక్తా! మనకు సమీపంలో ఉన్న ఒక ఊరు గురించి విన్నాను... అక్కడ నీటి వసతి బాగా ఉన్నది, పండ్ల తోటలు చాలా ఎక్కువ. అంతేకాదు అక్కడి గాలి చల్లగా, ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది. మనం ఆ ఊరికి వెళ్లి మన విశ్వాసాన్ని నమ్మే వాళ్ల కొరకు ఎందుకు ప్రయత్నించకూడదు?"

ప్రవక్తﷺ చిరునవ్వు నవ్వి జైద్‌ను దగ్గరకు తీసుకుని, "నువ్వు చెప్పింది నిజమే. నువ్వు చెప్పే ఆ ఊరు 'తాయెఫ్'. అది చాలా దూరం. అయినా మనిద్దరం అక్కడికి వెళ్దాం. ఈ ప్రయాణంలో అల్లాహ్ సహాయం మనకు తప్పకుండా తోడు ఉంటుంది.

ఆ విధంగా ప్రవక్తﷺ, ఆయన దత్త పుత్రుడు జైద్‌ల ప్రయాణం మొదలైంది. తోటలతో నిండి ఉండే ఆ తాయెఫ్ పట్టణం మక్కాకు యాభై మైళ్ల దూరంలో ఉంటుంది.

https://teluguislam.net

ఒంటరిగా మిగిలిన అబూ బక్ర్ తల అడ్డంగా ఊపుకుంటూ తనలో తను అనుకున్నారు, "ఇక మాకు అబూ తాలిబ్ అండ లేదు. ఈ విధంగా ప్రవక్త(స) మనుగడ ఎంతో ప్రమాదంలో ఉంది".

అందాల తాయెఫ్ పట్టణానికి ముఖ్యులు ముగ్గురు అన్నదమ్ములు. ముహమ్మద్(స) జైద్ వెంట బయలుదేరారు. తాయెఫ్‌కు చేరగానే ప్రవక్త వారిని కలిసారు. కాని తన మాటలు వారికి రుచించటం లేదన్న సంగతి ప్రవక్త(స)కు కాసేపట్లోనే అర్థమైపోయింది.

ముగ్గురు ముఖ్యుల్లో ఒకతను అన్నాడు, "అయితే నిన్ను అల్లాహ్ పంపించాడంటావు? ఆ విషయాన్ని నమ్మటం కన్నా కాబా మీద కప్పి ఉంచిన వస్త్రాన్ని చించి వేయటమే మాకు సులువు."

రెండవతను ప్రవక్త(స)ను ఎగాదిగా చూసి, "ప్రవక్తగా నీ కన్నా సరియైన వాడు అల్లాహ్‌కు వేరే అతను కనిపించలేదా?" అన్నాడు హాస్య ధోరణిలో.

మూడవ అతను కళ్లు చిట్లించి వెటకారంగా అన్నాడు, "అల్లాహ్ సాక్షిగా! నువ్వు ప్రవక్తవన్న సంగతి నిజమే అయితే నువ్వు చాలా ప్రాధాన్యతగల వాడివన్న మాట. అలా కాకుంటే నువ్వు చాలా చిన్నవాడివన్నమాట. ఏది నిజమయినా మనం మాట్లాడుకునేందుకు సరిజోడు కాము."

తాయెఫ్ ప్రజలు కూడా తమ నాయకుల మాదిరిగానే ప్రవర్తించారు. ప్రవక్త(స)ను వేళాకోళం చేశారు.

ప్రవక్త(స) తిరిగి వారిని ఒప్పించే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ వారి ధోరణిలో మార్పు రాలేదు. ప్రవక్త(స)ను తిడుతూ, అవమానపరుస్తూ, హింసాత్మకంగా వ్యవహరించారు. ప్రవక్త(స)ను, జైద్‌ను అక్కడి నుంచి తరిమారు. చేతికందిన రాళ్లను, మట్టిని వాళ్ల మీదకు విసిరారు. వాళ్ల కాళ్లకు గాయాలయ్యాయి. కుంటుతూ, తడబడుతూ ద్రాక్ష తోటలను చేరారు ప్రవక్త మహనీయులు(స). ఆ ద్రాక్ష తోటలలోనే ఆ రాత్రికి విశ్రమించాలని అనుకున్నారు. ఆ తోట యజమాని వారిమీద జాలిపడ్డాడు. గాయాలు శుభ్రపరుచుకోవడానికి నీళ్ళు ఇచ్చాడు. తినటానికి తోట నుంచి తాజా ద్రాక్ష పళ్లు కూడా పంపించాడు.

సుదీర్ఘమైన మక్కా తిరుగు ప్రయాణంలో వాళ్లు నక్లా అనబడే లోయలో మరల బస చేశారు. ప్రవక్తను అక్కడే ఉంచి జైద్ ముందుగా మక్కా చేరి, ఏర్పాట్లు చూశారు. ఇబ్నె అదీ తన ఇంటిలో రక్షణ కల్పించగా ప్రవక్త తిరిగి మక్కా చేరుకున్నారు.

https://teluguislam.net



సరిగ్గా అది రాత్రి సమయం. జిన్నాత్‌లు సంచరించే సమయం. ప్రవక్త ﷺ బాగా అలసి పోయి ఉంటారని జైద్ ఊహించారు. కాని ప్రవక్త ﷺ నవ్వుతూ ఎంతో ఆహ్లాదంగా కనిపించారు. ఇదేమి అర్థం కాని జైద్ ప్రవక్త ﷺ ను అడిగారు, "అంతా కుశలమేనా?"

"అంతా కుశలమే. అల్లాహ్ దయ వలన అన్నీ సవ్యంగానే జరుగుతాయి. సత్యాన్ని తాయఫ్ ప్రజలు వినలేదు. కాని సత్యాన్ని విని ఉన్న వాళ్ళ ఇతరులు ఇంకెందరో ఉన్నారు." ప్రవక్త ﷺ ఆ విధంగా సమాధానం చెప్పి, కొన్ని విషయాలను ఉచ్చరించారు.

"నాకు ఏమని తెలియచేయటం జరిగిందంటే ఒక జిన్నాత్‌ల బృందం ఖుర్‌ఆన్ విన్నది' వాళ్ళేమన్నారంటే,

"మేము నిజంగా ఒక అద్భుతమైన సందేశాన్ని విన్నాము
అది సన్మార్గ దర్శిని
మాకు అందులో నమ్మకం కుదిరింది
మేమిక విగ్రహారాధన చేయము
ఇంకే దేవుడినీ అల్లాహ్‌తో చేర్చము."

https://teluguislam.net

# 12. రాత్రి ప్రయాణం

## (ఇస్రా-మేరాజ్)

కొంతమంది విశ్వాసులంతా కలిసి అబూ బక్ర్ ఇంటి ముందు చేరారు. "ఆ రాత్రి యాత్ర గురించి ముహమ్మద్ ప్రవక్త ﷺ చెప్పినప్పుడు మేము లేము; అందుకే నీ దగ్గరికి వచ్చాము. అదంతా మాకు మళ్లీ చెప్పు" - గుంపులో నుంచి ఒకతను అబూ బక్ర్‌ను ఆత్రుతగా అడిగాడు.

"అవును, అబూ బక్ర్! దయచేసి మాక్కూడా చెప్పండి, ఆ రాత్రి జరిగిన ఆశ్చర్యకరమైన విషయాలను గురించి మేము ఎంతో ఆసక్తితో ఉన్నాము" అని ఇంకో అతను అన్నాడు.

"అల్లాహ్ తన ప్రవక్త ﷺను, ఇంకా మనందరిని కూడా అనుగ్రహించాడని ప్రజలు అనుకుంటున్నారు" మూడవ అతను అన్నాడు.

"స్వాగతం... స్వాగతం...మీ అందరికీ హృదయ పూర్వక స్వాగతం. అల్లాహ్ అనుగ్రహం ఎల్లప్పుడూ మనపై ఉండు గాక! నేనెంత బాగా చెప్పగలనో అంత బాగా ఆ సంఘటనను మీకు వివరిస్తాను. దాని గురించి విన్నప్పుడు నేను కూడా ఎంతగానో ఆనందించాను. దాని గురించి చెప్పటంలో నేను ఏదన్నా విషయం మర్చి పోవచ్చేమో! అలాంటిది ఏదైనా జరిగితే అల్లాహ్ నన్ను క్షమిస్తాడని ఆశిస్తున్నాను".

https://teluguislam.net

గుంపునుద్దేశించి అబూ బక్ర్ ఆ మాటలు అని, తాను చెబుతున్నది అందరికీ వినపడాలన్నట్లు గది మధ్యలో కూర్చున్నారు. మిగిలిన వాళ్లంతా బాసింపట్లు వేసుకుని చాపల మీద దగ్గర దగ్గరగా కూర్చున్నారు. ఆ గది చాలా చిన్నది. ఎక్కువ మంది కూర్చునేందుకు వీలులేదు.

పెద్దగా మాట్లాడుతున్న వాళ్లంతా ఒక్కసారిగా నిశ్శబ్దంలోకి వెళ్లి పోయారు. అబూ బక్ర్ ప్రార్థన మొదలుపెట్టారు. "అందరం ఒక్క అల్లాహ్‌నే కొనియాడుదాం...."

అకస్మాత్తుగా తలుపులు తెరుచుకున్నాయి. అందరికీ పరిచితుడు అయిన అబ్బాస్ గడపలో నిలుచుని ఉన్నారు. ఆయన కళ్లు మెరుస్తూ ఉన్నాయి, తలపాగా కొంచెం చెదిరి ఉంది. పెద్దగా అరుస్తూ అడిగారు, "నేను విన్నది నిజమేనా? మా తమ్ముని కొడుకు ముహమ్మద్ﷺ ఉపయోగించే ఒంటెకు ఏమన్నా రెక్కలు వచ్చాయా? దానంతట అదే అర్ధరాత్రి పూట జెరుసలెంకు ఎగిరి పోయిందా? దీన్ని బట్టి చూస్తే మంచి కథే అల్లినట్టు ఉన్నారు. నేను ఈ విషయాన్ని తేలికగా తీసుకోవటం లేదు. చాలా కాలం నుంచి ఈ పనులన్నీ గోప్యంగా జరుగుతున్నట్లు నాకు అనిపిస్తుంది. సరే అలాగే కానియ్యండి. కాని చేసే పనులు మంచిగా చెయ్యండి" అంటూ గది లోపలికి వచ్చారు.

అబ్బాస్ విశ్వాసే. కాని తనదైన ఒక పద్ధతిలో, తనకి ఇష్టమైన రీతిలో ఉండే మనిషి.

"ప్రవక్త ఒంటెకు రెక్కలేమీ మొలవలేదు. మీరందరూ కాస్త సర్దుకుని నిశ్శబ్దంగా ఉంటే నేను చెప్పటం కొనసాగిస్తాను" అబ్బాస్‌ను ఓరగా చూస్తూ అబూ బక్ర్ గంభీరంగా అన్నారు.

అబూ బక్ర్ ఒక క్షణం ఆకాశం వైపు చూసి తిరిగి చెప్పడం ప్రారంభించారు. "ఆ రాత్రి ప్రవక్త బాగా అలిసిపోయి ఉన్నారు. ఆ రోజు పగలంతా సుదీర్ఘ ప్రయాణం చేసి వచ్చారు. ఎంతో మనస్తాపానికి గురై ఉన్నారు. గాఢ నిద్రలో ఉండగా, అకస్మాత్తుగా ఆయన్నెవరో పిలిచారు. ప్రవక్తﷺ నిద్ర మేల్కొని కళ్లు తెరిచి చూశారు. ఎదురుగా ఎంతో ఠీవిగా జిబ్రయీల్ దూత నిలబడి ఉన్నారు. తనను అనుసరించమని జిబ్రయీల్ దూత ప్రవక్తﷺకు సంజ్ఞ చేశారు. ఇద్దరూ గడప దగ్గరకు చేరుకున్నారు. జిబ్రయీల్ ఒక అద్భుతమైన జంతువును ప్రవక్తﷺకు బహూకరించారు. అటువంటి జంతువు ఇంతకు ముందు భూమి మీద లేదు. అది కాంతి కన్నా వేగంగా ప్రయాణం చేయగలదు.

https://teluguislam.net

"ఇది బుర్రాఖ్, దీనిని అధిరోహించండి'-జిబ్రయీల్ దూత ప్రవక్తతో అన్నారు. తరువాత వారిద్దరూ మక్కా నుండి రాత్రి ఆకాశంలో పైకి ఎగిరారు.

ఈ ప్రయాణంలో వాళ్లు చెప్పలేనన్ని వింత వింత ప్రదేశాలను చూశారు. కొన్నయితే ప్రవక్తﷺకు సైతం సత్య మార్గాన్ని విడిచి పెట్టేంత ఆకర్షవంతంగా ఉన్నాయి. మిగిలినవి మరెన్నో భయంకరమైన శిక్షలకు నమూనాలు! భూమ్మీద మనిషి చేసిన పాపాలకు పరిహారంగా ఇవ్వబడే శిక్షలు అవి.

వాళ్లు జెరూసలెం పట్టణం పైన ఉన్నప్పుడు జిబ్రయీల్ బుర్రాఖ్‌ను కిందికి దిగమని ఆజ్ఞాపించారు. ప్రార్థనా స్థలపు ప్రవేశ ద్వారముల వద్ద బుర్రాఖ్ క్రిందికి దిగింది. పాత ప్రవక్తలు చేసినట్లుగానే, మన ప్రవక్తﷺ కూడా బుర్రాఖ్‌ను కట్టివేశారు. ఆ తర్వాతే లోనికి ప్రవేశించారు. అక్కడ యేసు, మోషే, ఇంకా చాలా మంది ప్రవక్తలను చూశారు.

మీకో విషయం చెప్పాలి, అదేమంటే పూర్వకాలపు ఒక్కో ప్రవక్తﷺను గురించి మన ప్రవక్త కళ్లకు కట్టినట్లుగా వర్ణించారు. మేము కూడా వాళ్లను చూడగలిగామన్నంత తృప్తిగా ఉంది. ఇతరులతో కలిసి ప్రార్థన పూర్తయ్యాక మన ప్రవక్త బయటకు వచ్చారు. అక్కడ ఒక ఆశ్చర్యకరమైన విషయం ఆయన పరిశీలనలోకి వచ్చింది. ఆకాశాలలోకి ప్రయాణించడానికి ఎంతో ప్రకాశవంతమైన నిచ్చెన అక్కడ ఉన్నది. ఆ నిచ్చెన ఎక్కమని జిబ్రయీల్ దూత ప్రవక్తﷺతో చెప్పారు. ప్రవక్తﷺ అలానే చేశారు. మెరుపు వేగంతో ఇదంతా జరిగిపోయింది. ఆ నిచ్చెన గాల్లో తేలియాడుతున్నట్లుగా ఉన్నది.

వాళ్లిద్దరు మొదటి ఆకాశం దాకా ప్రయాణించారు. జిబ్రయీల్ ఎవర్నో పిలుస్తున్నట్లు ప్రవేశ ద్వారమును తట్టారు.

"ఎవరూ?" లోపలి నుంచి అడిగారు.

"జిబ్రయీల్"

" మీవెంట ఉన్నది ఎవరు?"

"ముహమ్మద్"

" అతనికి ఆహ్వానం ఉందా?"

" ఉంది"

"అయితే అతనికి మా తరఫున స్వాగతం"

https://teluguislam.net

ప్రవేశ ద్వారాలు తెరుచుకున్నాయి.

● ● ●

ఈ యాత్రను మేరాజ్ యాత్ర అంటారు. ఇస్లామీయ చరిత్రలో మేరాజ్ యాత్ర ఓ అత్యద్భుత సంఘటన. ముహమ్మద్ﷺ స్వయంగా ఇలా అన్నారు: "ఉరిజ బీ ఇలస్సమాయి" (నన్ను గగనానికి ఎక్కించటం జరిగింది). మేరాజ్ అన్న పదం ఈ "ఉరిజ" అనే పదం నుంచి వచ్చినదే. దైవప్రవక్త ముహమ్మద్ﷺ పూర్తి మెలకువలో సశరీరంగా ఆకాశ యాత్ర చేశారు. ఈ ప్రయాణంలో దివ్యలోకాల స్థితిగతులను ఆయన కళ్ళారా వీక్షించి వచ్చారు. అల్లాహ్ యొక్క గొప్ప సూచనలను దైవప్రవక్తﷺకు చూపెట్టటం ఈ యాత్ర అసలు ఉద్దేశం. అంత సుదీర్ఘ యాత్ర ఒకే ఒక రాత్రిలోని అతి స్వల్ప భాగంలో జరిగిపోవటం అతి గొప్ప అద్భుతం. ఆ రాత్రి దైవప్రవక్తﷺ ఏడవ ఆకాశంలో 'అర్ష్' పీఠానికి (అల్లాహ్ సింహాసనానికి) దిగువన ఉన్న 'సిద్రతుల్ మున్తహా' (ఆఖరి రేగిచెట్టు) వరకూ వెళ్ళారు.

అల్లాహ్‌కు స్తోత్రములు
ఇక్కడి మసీదు నుంచి
ఎంతో సుదూరపు మసీదుకు
తన దాసుడ్ని రాత్రికి రాత్రే
ప్రయాణం చేయించి
తన వద్దకు రప్పించుకున్న
అల్లాహ్‌కు స్తోత్రములు
అన్నీ వినేవాడూ
అన్నీ చూసేవాడు
ఒకే ఒక్కడు ఆ అల్లాహ్! *(సూరా 17, బనీ ఇస్రాయీల్)*

https://teluguislam.net

# 13. కొండ గుహ

అవి మక్కా యాత్ర (హజ్) చివరి రోజులు. మక్కా నగరమంతా అరేబియా జన సందోహంతో నిండి ఉంది. అన్ని ప్రాంతాల నుంచి వివిధ తెగల ప్రజలు ప్రతి సంవత్సరం ఒక నిర్దిష్టమైన సమయంలో మక్కాను సందర్శిస్తారు. ప్రముఖమైన బిడోయిన్ అరబ్బులు పడమటి వైపు నుంచి తమ అద్భుతమైన ఒంటెల మీద మక్కాకు చేరుకున్నారు. తాయెఫ్‌కు చెందిన దఖ్‌వాన్ తెగ విగ్రహారాధకులు తమ తెగ దేవుడు లాత్‌కు ఎన్నో జంతువులను బలి ఇస్తున్నారు. హవాజిన్, ఆమిర్ తెగల వాళ్లు కాబా చుట్టూ సంప్రదాయంగా జరిపే ప్రదక్షిణను పూర్తి చేసుకుని ఎడారికి ఉత్తరం వైపు వెళ్తున్నారు.

మక్కాను చీకటి ఆవరిస్తున్నది. మక్కా వ్యాపారులు, బాగా బలిసిన పిల్లుల మాదిరి, బంగారంతో నిండిన సంచులతో తమ ఇండ్లకు చేరుకున్నారు. ఆ వ్యాపారుల్లో ప్రవక్త పెదనాన్న అబ్బాస్ కూడా ఉన్నారు. ఆ యేడు ఆయన వ్యాపారం జోరుగా సాగింది. సొమ్ములు బాగా సంపాదించుకున్న అబ్బాస్ ఒక విందును ఏర్పాటు చేశారు. ప్రవక్త(స)ను, ఆయన సహచరులను ఆ విందుకు ఆహ్వానించారు. చాలా కాలం తరువాత ప్రవక్త(స) సహచరులు ఒక మంచి విందు భోజనం ఆరగించారు.

https://teluguislam.net

అప్పుడే తలుపులు తట్టిన శబ్దం! దాంతో వారి సంతోషానికి అంతరాయం కలిగింది. తలుపులు తెరిచారు. కొత్తగా అక్కడికి ప్రవేశించిన మనిషికి ఎదురుగా వెళ్లిన అబ్బాస్ అరిచినట్లు పలకరించారు. అలీ, జైద్‌లు ఆ వచ్చిన వ్యక్తిని మొదట్లో గుర్తించలేక పోయారు.

అతని వస్త్రధారణ మక్కా వాసిలా లేదు. అతని ప్రవర్తన కూడా నిలకడగా లేదు. అతను ఏదో ఆందోళనలో ఉన్నాడు. లోపలికి ప్రవేశించాక అతను అక్కడున్న అందరి ముఖాలను పరిశీలనగా చూశాడు. తన శత్రువులు ఎవరన్నా అక్కడ ఉన్నారేమో అని వెతుకుతున్నట్లు ఉన్నాయి అతని చూపులు. ప్రవక్త ﷺ తన సహచరులను మరో గదిలోనికి పొమ్మని సంజ్ఞ చేశారు. అలీ, జైద్‌లను పాలు ఖర్జూర పండ్లు తీసుకురమ్మని ఆదేశించారు.

"ఎవరితను? ఎక్కడి వాడితను?" గుసగుసగా జైద్ అడిగారు.

"నీకు గుర్తుకు రాలేదా, ఈయన ముస్అబ్. గత ఏడాది హజ్ యాత్ర తరువాత మన ప్రవక్త ﷺ ఈయనను మదీనాకు పంపించారు. అప్పట్లో ఏడుగురు మదీనా వాసులు మక్కా నగరాన్ని సందర్శించి ఇస్లాం పట్ల విశ్వాసులుగా మారారు. ఆ ఏడుగురితో పాటు ఈయన కూడా మదీనా నగరం వెళ్లారు. అక్కడివారికి నమాజు, ఖుర్‌ఆన్‌లను బోధిస్తూ ఆ సంవత్సరమంతా ఆయన మదీనాలోనే ఉండిపోయారు. ఇప్పుడే తిరిగి మక్కాకు వచ్చారు" అని అలీ బదులిచ్చారు.

ఖర్జూర పండ్లు నిండిన పళ్లెంతో తిరిగి అలీ, జైద్‌లు ప్రవేశించినప్పుడు, ముస్అబ్ ఒక ముఖ్యమైన విషయం చెప్తున్నట్లు చిన్ని గొంతుతో మాట్లాడుతున్నారు.

"మదీనా నగరానికి చెందిన డెబ్బై మంది విశ్వాసులుగా మారారు. ఈ అర్థ రాత్రి వాళ్లు అఖ్బా లోయ ప్రాంతంలో ప్రవక్త ﷺను చూడాలనుకుంటున్నారు. "

"డెబ్బై మందా? ఏడుగురు అని విన్నానే!" అబ్బాస్ అన్నారు.

"అల్లాహ్ అందరికంటే గొప్పవాడు. ఆయనను మాత్రమే స్తుతించాలి. ఏడుగురు కాదు, డెబ్బై మందే! ఇంకోమాట, వాళ్లు ప్రవక్త ﷺకూ, మక్కా విశ్వాసులకు తమ గృహాలను ఇవ్వటమే కాక రక్షణ ఏర్పాట్లు చూడటానికి కూడా సిద్ధంగా ఉన్నారు."

"అల్లాహ్‌కు స్తోత్రములు. ప్రతికూల సమయంలో అనూహ్యంగా జరుగుతున్న

https://teluguislam.net

సంఘటన ఇది. ముస్‌అబ్ వల్లనే ఇదంతా సాధ్యమయింది. ఓ ముస్‌అబ్! అల్లాహ్ మిమ్మల్ని అనుగ్రహించుగాక!" అంటూ ప్రవక్త(స) లేచి నిలబడి ముస్‌అబ్‌పై తన శాలువాను కప్పారు. ముస్‌అబ్ కూడా లేచి నిలబడి ఎంతో గౌరవంగా ప్రవక్త(స)తో అన్నారు, "ఇప్పటికే చాలా ఆలస్యం అయింది. ధైర్యం చేసి ముందుకు వచ్చిన ఆ విశ్వాసులను ఎక్కువ సేపు నిరీక్షణలో ఉంచడం అంత మంచిది కాదు. నేను వెళ్లేందుకు అనుమతి ఇప్పించండి."

మధ్యలో అబ్బాస్ జోక్యం చేసుకుని, " వద్దు..వద్దు.. తొందరపడకు. ఈ రాత్రి పూట నిన్ను ఒక్కడినే ఆ ప్రమాదకరమయిన, నిషేధింపబడిన స్థలానికి పంపను. సాహసవంతుడయిన, బలమైన, నిబద్ధత కలిగిన నా లాంటి మనిషి తోడు నీకెంతో అవసరం. నేనూ నీతో వస్తాను" – గడ్డం నిమురుకుంటూ అబ్బాస్ దర్పంగా అన్నారు.

ఆయన మాటలు విని ప్రవక్త(స) చిరునవ్వు నవ్వారు.

జైద్, అలీల వైపు చూస్తూ ముస్‌అబ్ అన్నారు, "నిజమే.. కాని అబ్బాస్! ఈ సమావేశం ఎంతో రహస్యంగా జరగాలి. ఆ డెబ్బై మంది అనుచరుల రక్షణా బాధ్యతనూ మనం దృష్టిలో ఉంచుకోవాలి. అందువలన నాతో ఎవరూ రాక పోవటమే శ్రేయస్కరం".

అఖబా పర్వత శ్రేణుల మీద అర్ధ చంద్రుడు వెలిగిపోతూ ఉన్నాడు. ఒక మేఘం తర్వాత ఇంకో మేఘం చంద్రుని కాంతిని కప్పేస్తుండగా చిత్ర విచిత్ర రూపాలు వేగంగా ఆ పర్వత శ్రేణుల మీదుగా కిందకు లోయలోనికి దిగుతున్నాయి.

డెబ్బై మంది అనుచరులు ఆ సమయంలో ప్రవక్త(స)ను, అబ్బాస్‌ను కలిశారు. అబ్బాస్ తన చేతిని పైకెత్తి, గొంతు సవరించుకుంటూ, వారి దృష్టిని తన వైపు మళ్లించి ఇలా అన్నారు:

"ఓ మదీనా ప్రజల్లారా! మీరేం చేస్తున్నారో జాగ్రత్తగా ఆలోచించుకోండి. మీరు ప్రమాదకరమయిన బాధ్యతను నెత్తికెత్తుకున్నారు. నా తమ్ముడి కొడుకైనటువంటి ముహమ్మద్(స) అనుచరులు చాలా మంది ఇక్కడ వేధించబడ్డారు. కొంతమందిని హింసించి చంపేశారు. మిగిలిన వాళ్లు అబిసీనియాకు పారిపోయారు. మీరు ముహమ్మద్(స)కు, అతని అనుచరులకు ఆశ్రయం ఇచ్చినట్లయితే, మీ దేశవాసులే మీకు వ్యతిరేకం అయిపోవచ్చు. మక్కావారితోనూ మీకు తగాదాలు రావచ్చు. ఇంత

https://teluguislam.net

ప్రతికూల వాతావరణంలో కూడా మీరు ప్రవక్త(ﷺ)ను బలపర్చాలని తీర్మానించుకుంటే, మీరు ప్రతిజ్ఞ చేయండి. ఒకవేళ మీరు అనిశ్చయంగా ఉంటే, మీ దారిన మీరు వెళ్లిపోండి. ఇప్పటికీ మీకు అవకాశం ఉంది."

వారిలో ప్రత్యేకంగా కనిపిస్తున్న ఒక యువకుడు ప్రతిస్పందించాడు. "అబ్బాస్! మేము మీ ముందు నిల్చున్నది ఎంత సత్యమో, మా నిర్ణయం దృఢమైనదన్నదీ అంతే సత్యం. దైవప్రవక్తా! మీరు మాట్లాడండి. మీ మాటలు వినడానికి మేము ఉవ్విళ్లూరు తున్నాము. ఎప్పటి నుంచో నిరీక్షిస్తున్న సమయం ఇప్పటికి ఆసన్నమైంది'.

ప్రసంగించడానికి ప్రవక్త ముందుకు వచ్చారు. కొన్ని క్షణాలు ఆ సమావేశంలో నిశ్శబ్దం ఆవరించుకుంది. అద్భుతమైన ఖుర్‌ఆన్‌లో నుంచి బ్రహ్మాండమైన అరబిక్ పంక్తులు కొన్ని అక్కడ, ఆ చీకట్లో ప్రతిధ్వనించాయి. వింటున్న వాళ్లందరి హృదయా లనూ తాకుతున్న ఆ భావాలు:

కరుణామయుడు, కృపాకరుడైన అల్లాహ్ పేరుతో ప్రారంభం.

"సృష్టికి అధిపతి

ఎంతో జాలి కలవాడు

ఎంతో దయ కలవాడు

అంతిమదినాన తీర్పు చెప్పేవాడు

మనం ప్రార్థించటానికి ఉన్న ఒకే ఒక్కడు

అయినటువంటి అల్లాహ్! నీకు స్తోత్రములు

మమ్మల్ని సరైన మార్గంలో నడిపించు

ఏ మార్గంలో నడిచినవాళ్లు

నీకు ప్రీతిపాత్రులయ్యారో

నీ కోపతాపాలకు గురికాలేదో

దారి తప్పి భ్రష్టు పట్టలేదో...ఆ మార్గం"

పైపీ, ఇంకొన్ని ఖుర్‌ఆన్ వాక్యాలను పఠించిన తరువాత వారిని అడిగారు, "మీరంతా ఈ ఘర్షణలో, ఈ పోరాటంలో నాకు బాసటగా ఉంటారా?" అని.

https://teluguislam.net

వెంటనే అందరూ ముని కాళ్ల మీద లేచి నిలబడి, ముక్త కంఠంతో అన్నారు, "ఓ దైవప్రవక్తా! మీకు అండగా, రక్షణగా ఉంటామని మేమంతా ప్రతిజ్ఞ చేస్తున్నాము."

అబ్బాస్ మెల్లిగా అన్నారు, "ఉష్! అరవకండి! మీరే మనుకుంటున్నారు? ఈ పర్వతాలకు, ఈ జిన్నాత్‌లకు, ఈ ఎడారి జీవులకు చెవులు లేవనుకుంటున్నారా? మీరు మీ విధేయతను ప్రకటించదలచుకుంటే, ఒక్కొక్కరుగా ముందుకు వచ్చి చేతిలో చేయి వేసి ప్రమాణం చేయండి. అంతే కాని పెద్దగా అరవకండి. అర్థమైందా?"

డెబ్బై మంది మదీనా వాసులు ఒక్కొక్కరుగా ముందుకు వచ్చి చేతులు కలిపి ప్రతిజ్ఞ చేశారు. కాని చిట్టచివరి అతను ముందుకు వచ్చినప్పుడు కొండల వెనక నుంచి ఒక పెద్ద అరుపు వినిపించింది. అదొక క్రూర జంతువు ఏడుస్తున్నట్లుగా ఉంది.

"ప్రజలారా! అప్రమత్తంగా ఉండండి. పిచ్చివాడైపోయిన ముహమ్మద్ﷺ మిమ్మల్ని బహిరంగంగా తప్పు దారి పట్టిస్తున్నాడు. "

ఆ సమావేశంలోని విశ్వాసులు నిశ్చేష్టులయిపోయారు, వణికి పోయారు. కాని ప్రవక్తﷺలో నుంచి వెలువడిన నిమగ్నతా పూర్వకమైన మాటలు వారి హృదయాల్లోని అలజడిని తుడిచివేశాయి. ఎంతో మృదువుగా ప్రవక్తﷺ వారికి ఇలా చెప్పారు, "భయ పడకండి. భయపడకండి. అది అఖబా షైతాన్ గొంతు.. అతను అల్లాహ్‌కు శత్రువు."

ఆ మాటలతో స్పృహలోకి వచ్చిన మదీనా వాసులు తమ గుడారాలకు బయలుదేరారు. ధైర్యస్తుడయిన ఒక యువకుడు ఒక అడుగు ముందుకు వేసి ప్రవక్తను అడిగాడు, "ఓ దైవప్రవక్తా! ఈ మంచి ఉద్యమం కొరకు శ్రమిస్తూ ఒకవేళ మేము చనిపోతే, మీ నుంచి మాకు లభించే బహుమతి ఏదయినా ఉందా?"

ప్రవక్తﷺ అతని వైపు తిరిగి, "మీ కొరకు స్వర్గం ఉంది" అన్నారు. ఈ చివరి మాటను వినుకుంటూ వాళ్లంతా అఖబా లోయ దిగువ ప్రాంతంలో కనుమరుగై పోయారు. అఖబా షైతానుకు పిచ్చిపనులు చేసే అవకాశం లేకుండాపోయింది.

ఈ సమావేశం గురించి విన్న 'ఖురైష్ తెగ పెద్దలు' ఆ మరుసటి రాత్రి కాబాలో దీని గురించి చర్చించటానికి సమావేశమయ్యారు.

"తన అనుచరులను తీసుకుని మదీనాకు పారిపోవడానికి ముహమ్మద్ﷺ పథకం వేసుకుంటున్నాడు. ఖచ్చితంగా అతను మనకు వ్యతిరేకంగా సైన్యాన్ని తీసు కుని వచ్చి మనల్ని చుట్టుముడుతాడు"– వారిలోని ఒకతను అన్నాడు.

https://teluguislam.net

"బహిష్కరించండి.. అతన్ని వెంటనే బహిష్కరించండి. జన సంచారం లేని ఎడారి ప్రాంతానికి పంపించండి." – ఇంకో మనిషి సూచించాడు.

"సమాధిలో పడేసినట్లు, ఒక రాతి గదిలో నిర్బంధించి చచ్చేంత వరకూ ఇంత తిండి పడేద్దాం" మరొకతను బిగ్గరగా అరిచాడు.

"రక్త సంబంధీకులారా! అవేమీ కాదు, హుబల్ దేవుడి సాక్షిగా! అతన్ని శాశ్వతంగా వదిలించుకోవాలంటే ఒక మార్గం ఉంది. ఒకే ఒక్క మార్గం..." అంటూ అబూ జహల్ తన కరవాలపు పిడిని చేతి వేళ్లతో పట్టుకుని కళ్లను సూటిగా ఉంచాడు.

అబూ సుఫియాన్ ఈ ప్రతిపాదనకు తన సమ్మతిని తెలుపుతూ తలను ఆడించాడు.

" హత్యా...?...?...? మన రక్త సంబంధీకుడిని చంపడమా? మనలో ఎవరూ దీనిని ఆమోదించరు" ఇంకొకతను ఆశ్చర్యాన్ని, ఆందోళననూ ప్రకటించాడు.

"అవును ఆమోదించరు. మనలో ఎవరూ అటువంటి చర్యకు సాహసించరు. కాని మనందరం కలిసికట్టుగా ఆ పని చేయొచ్చు. అప్పుడు ఏ ఒక్కడో ఆ నిందను మోయవలసిన పని లేదు. మీలో ఎవరి వద్దా నాలాంటి కరవాలం లేదా? మనందరం కలిసి కూడా అతన్ని ఏమీ చేయలేమా? కనీసం ఇలాగన్నా...."

– అబూ జహల్ విసుగ్గా, అసహనంగా తన కరవాలాన్ని గాలిలో ఝుళిపిస్తూ ఉక్రోషంతో అన్నాడు.

అక్కడి వాళ్లు ముందు తటపటాయించారు. తరువాత ఒప్పుకుంటూ తల లూపారు. ఆ తరువాత అందరూ తమ కరవాలపు పిడులను పట్టుకున్నారు. కొన్ని క్షణాలపాటు అక్కడ నిశ్శబ్దం రాజ్యమేలింది.

ఈ నిశ్శబ్దాన్ని భగ్నం చేస్తూ వారి వెనకాల నుంచి ఒక గొంతు ప్రతిధ్వనించింది. "ఓ మక్కా ప్రజలారా! నమ్మండి... మిమ్మల్ని మీరు నమ్మండి".

వాళ్లంతా వెనక్కు తిరిగి చూశారు. వేరే తెగకు చెందిన ఒక ముసలి మనిషి వారికి కనిపించాడు.

● ● ●

చీకటి గదిలో చాప మీద సేదతీరుతున్న ప్రవక్త ముహమ్మద్ ﷺ ఒక్కసారిగా లేచికూర్చున్నారు. తనను ఏదో శక్తి మేల్కొలిపింది. ఆ శక్తి ఏదీ? జిబ్రయీలా?

https://teluguislam.net

ఇప్పుడు అక్కడయితే ఏ దైవదూతా లేడు. ఆ నిశ్శబ్దం ఏదో రాబోయే ప్రమాదాన్ని హెచ్చరిక చేస్తున్నట్లు ఉంది. గాలి పూర్తిగా స్తంభించిపోయి వుంది. భుజం మీది శాలువాను సవరించుకుంటూ, పూర్తి నిశ్చలత్వంలో కూర్చుని ఉన్న ప్రవక్త(స) గదికి ఆవల నుంచి కొన్ని అడుగుల చప్పుళ్ళు, గుసగుసగా మాట్లాడుకుంటున్న శబ్దాలు వినిపించాయి. బయట తచ్చాడుతున్న వారి ఉద్దేశాన్ని ఊహించిన ప్రవక్త(స), వారు తలపెట్టిన కీడు నుంచి తనను కాపాడమని లోలోపలే అల్లాహ్‌ను వేడుకున్నారు.

అకస్మాత్తుగా ప్రవక్త(స) లేచి తనకు సమీపంలో ఉన్న అలీకు తన శాలువా అందించారు. అలీ అది తీసుకుని, ప్రవక్త చాప మీద నిండా కప్పుకుని కూర్చున్నారు.

తనను హత్య చేయటానికి బయట కాచుకొని వున్న దుర్మార్గుల కండ్ల ముందు నుంచే ప్రవక్త(స) అదృశ్యమయ్యారు. ఎంతో ఆశ్చర్యంగా, భౌతిక విషయాలకు అతీతంగా క్షణాల్లోనే ఇదంతా జరిగిపోయింది. ఆ రాత్రి పూట ప్రవక్త(స) అబూ బక్ర్ ఇంటికి వెళ్ళారు.

గది బయట నుంచి, ఒక ఖురైష్ యువకుడు కిటికీ గుండా లోపలికి తొంగి చూశాడు. ప్రవక్త శాలువాను కప్పుకొని అలీ పడుకుని ఉన్నారు. అది చూసి ఆ యువకుడు గుసగుసగా చెప్పాడు, "ముహమ్మద్(స) పడుకొని ఉన్నట్లున్నాడు".

కోపంగా పళ్లు కొరుకుతూ ఇంకో అతను దృఢనిశ్చయంతో అన్నాడు, "వేకువ జామున.. గదిలో నుంచి ముహమ్మద్(స) అడుగు బయట పెట్టగానే చంపేద్దాం".

అలీ కదలకుండా చాప మీద పడుకున్నారు. ఆయన ముఖం చెమటతో నిండిపోయింది. ఆందోళనగా వారి మాటలు వింటూ, ఏం జరుగుతుందోనని నిరీక్షిస్తూ ఉండిపోయారు. రాత్రంతా నిశ్శబ్దంగా గడిచింది. వాళ్లు కుట్ర చేసి, ప్రవక్త(స)ను హత్య చేయాలని వ్యూహం పన్నారు. కాని అల్లాహ్ సహాయం ప్రవక్తకు తోడుగా నిలిచింది. వారు తమ పథకంలో విఫలం అయ్యారు.

తెల్లవారింది. కుట్రదారులు నెమ్మదిగా, నిశ్శబ్దంగా ఇంటి ముందుకు చేరారు. గది తలుపులు తెరుచుకున్నాయి. వారి కరవాలాలు పైకి లేచాయి. కాని అవి అర్థాంతరంగా గాలిలోనే ఆగిపోయాయి. వారి పెదవుల్లో నుంచి ఆశ్చర్యం, అసంతృప్తులతో కూడిన నిట్టూర్పు వెలువడింది.

ద్వారం వద్ద అలీ తల పైకెత్తి నిలబడి ఉన్నారు. ఆయన చూపులు ఎదురుగా

https://teluguislam.net

నిలబడి ఉన్న ప్రతి మనిషినీ సునిశితంగా పరిశీలించాయి. ఆ తరువాత తను కప్పుకొని వున్న ప్రవక్త శాలువాను తీసి, వారి చేతుల్లోని కరవాలాలను తోసుకుంటూ కాబా వైపు పరుగు లంకించారు.

● ● ●

అబూ బక్ర్‌తో కలిసి మక్కా వెలుపలి కొండ గుహల్లోకి పోతున్న ప్రవక్త తూలి పడిపోయారు. వాళ్లు గనుక ఒంటెల మీద మదీనాకు ప్రయాణం అయి ఉంటే, ఖచ్చితంగా పట్టుబడి ఉండేవారు. కుట్రదారులు వేరే వైపు ప్రవక్త కోసం గాలిస్తున్నారు. ఇంతలోనే వారు మళ్ళీ ఏదో ఆలోచించుకొని తమ దారిని మరల్చుకున్నారు. కొండ గుహల వైపుగా ప్రయాణించి చివరికి ప్రవక్త(స)ను సమీపించారు.


ప్రవక్త, అబూ బక్ర్‌లు బాగా అలిసిపోయారు. దప్పికగొని ఉన్నారు. శరీరాలు దుమ్ము, ధూళితో నిండిపోయి ఉన్నాయి. ప్రవక్త వెంట మదీనా నగరం వెళ్ళాలని అబూ బక్ర్ ఎంతగానో కోరుకున్నారు. కాని ఇటువంటి విపత్కర పరిస్థితులను ఆయన ఊహించలేదు. ఆయన అంతరంగంలో ఈ ఆలోచనలే నడుస్తున్నాయి, "దైవప్రవక్తే తన సొంత ఇంటి నుంచి వెళ్లగొట్టబట్టారు, తన తెగ మనుషులే తనను ఒక క్రూర మృగాన్ని వెంటాడినట్లు వెంటాడుతున్నారు. ఇదంతా ఎట్లా సాధ్యం? ఖచ్చితంగా ప్రపంచానికి పిచ్చెక్కింది. అల్లాహ్ మమ్మల్ని రక్షించుగాక!". చేతులతో, మోకాళ్ల సహాయంగా పదునైన రాతి గుట్టలపైకి ఎక్కుతూ, పెద్దగా నిట్టూర్పులు విడుచుకుంటూ అబూ బక్ర్ ముందుకు సాగుతున్నారు.

"అబూ బక్ర్! ధైర్యంగా ఉండండి. అల్లాహ్ తప్పకుండా మీ ప్రార్థన ఆలకిస్తాడు"- ప్రవక్త ఆప్యాయంగా అన్నారు.

చీకటి పడుతుండగా వాళ్లు ఒక కొండ గుహను చేరి, అక్కడ విడిది చేశారు. తమ ఖురైష్ తెగకు చెందిన గుర్రాల మీద మాట్లాడుకుంటూ తమ వెనకాలే వస్తున్న వాళ్ల మాటలను వాళ్లిద్దరూ విన్నారు. అబూ బక్ర్ పాకుతూ గుహ లోపలికి పోయారు. ప్రవక్త ప్రార్థన చేసుకుంటున్నారు.

ఆ రాతి ప్రదేశం గుండా పరిగెడుతున్న గుర్రపు డెక్కల శబ్దం సమీపానికి చేరింది. కుట్రదారులు గుహకు మరెంతో దూరంలో లేరు. ఆందోళనతో అబూ బక్ర్ శ్వాస స్తంభించింది.

https://teluguislam.net



"గుహలోనే.. ఈ గుహలోనే... అదిగో ఈ గుహలోనే... ఖచ్చితంగా వాళ్లు ఉన్నారు" ఒక గొంతు పెద్దగా అరిచింది.

అబూ బక్ర్ కన్నీరు పెట్టుకున్నారు. "అంతా అయిపోయింది. దైవప్రవక్త(స)ను చంపేస్తారు. ఆయనతో పాటు నన్ను కూడా."

"ఇప్పుడు ఏమిటి దారి? మనం ఇద్దరమే ఉన్నాం" భయంగా అడిగారు.

ప్రవక్త(స) మాత్రం చాలా ప్రశాంతంగా జవాబిచ్చారు, "అబూ బక్ర్! మీరు పొరబడుతున్నారు. ఇక్కడ మనం ముగ్గురం ఉన్నాం. మీరు, నేను, ఆ అల్లాహ్".

అడుగుల శబ్దం గుహ ముఖ ద్వారానికి చేరింది. అబూ బక్ర్ గట్టిగా కళ్లు మూసుకుని ప్రార్థించసాగారు.

"హుబల్ దైవం సాక్షి! వాళ్లు ఈ గుహలో ఉండే ప్రసక్తే లేదు. ఈ గుహంతా పొదలతో, సాలె గూళ్లతో నిండిపోయి ఉంది. ముహమ్మద్(స) పుట్టినప్పటి నుంచీ ఇక్కడ ఎవరూ లేరు" - వాళ్లలో ఒకతను అన్నాడు.

https://teluguislam.net

"అట్లా అయితే పదండి.. ఉత్తరం దిక్కుకు పోదాం". ఇంకొకతను అన్నాడు.

డెక్కల చప్పుడు, మనుషుల శబ్దాలు క్రమేపీ తగ్గిపోయాయి.

వాళ్లు వెళ్లి పోయారు. అయినా అబూ బక్ర్ ఇంకా కదలడానికి కూడా భయపడుతున్నారు. మనసులో అల్లాహ్‌కు కృతజ్ఞతలు చెప్పుకున్నారు. కొద్దిసేపటి క్రితం ఎవరో పొదలు, సాలె గూళ్లు అన్న మాటలు అకస్మాత్తుగా ఆయనకు గుర్తు కొచ్చాయి. నెమ్మదిగా కళ్లు తెరిచి చూశారు. కాని ఆ గుహ, వాళ్లు చెప్పినట్టు ఏమీ లేదు. గుహ ముఖద్వారానికి ఒక సాలె పురుగు ఒక్క పోగును మాత్రమే అల్లి దాని మీద వేలాడుతూ ఉంది. ఆ పోగు వెండి దారంలా మెరుస్తోంది. దాని మీద నుంచి ఆకులతో నిండిన కొమ్మ ఒకటి కిందికి వేలాడుతూ ఉంది. దాని మధ్యలో ఒక గూడు! బూడిద రంగు పావురం ఒకటి ప్రశాంతంగా ఆ గూటిలో కూర్చుని పాడుతూ ఉంది.

అబూ బక్ర్ కళ్లు నులుముకుని మళ్లీ చూశారు. సాలె పురుగు వెండి రంగులో ఉన్న పోగులతో తన గూడును నిర్మించుకోవడాన్ని ప్రవక్తﷺ గమనిస్తున్నారు.

"దైవప్రవక్తా! ఇదంతా ఎలా జరిగింది?" అబూ బక్ర్ ఆశ్చర్యంగా అడిగారు.

ప్రవక్తﷺ ఏ సమాధానమూ ఇవ్వకుండా, పావురాయి కూతను వింటూ, అబూ బక్ర్ వైపు తిరిగి చిరునవ్వు నవ్వారు.

అబూ బక్ర్ కూతురు ఎంతో చాకచక్యంగా వరుసగా మూడు రాత్రులు వీళ్లి ద్దరికీ సేవలు అందించింది. ఒంటె మీద ఎడారి గుండా ప్రయాణించి భోజన సదుపా యాలను కొండ గుహలోనికి చేర్చింది. ఒక నమ్మకస్తుడయిన అనుచరుడు ప్రతి ఉదయం ఆమె రాకపోకల ఆనవాళ్లు చెరిపేయటానికి గుహ వరకు గొర్రెల మందను మేపేవాడు.

వాళ్లిద్దరు ఆందోళన కల్గించే ఒక వార్త విన్నారు. దాని గురించి అబూ బక్ర్ విస్తుపోతూ చెప్పారు, "ఓ ప్రవక్తా! మక్కా వాళ్లు మిమ్మల్ని పట్టుకున్న వాళ్లకి వంద ఒంటెల బహుమానం ప్రకటించారు."

కొండ గుహ గోడను ఆనుకొని ప్రవక్తﷺ కళ్లు మూసుకుని గత జ్ఞాపకాల్లోకి వెళ్లారు. "నన్ను పట్టుకుంటే నూరు ఒంటెలు..... నూరు ఒంటెలు... అదే సంఖ్య..... అప్పుడు నేను చాలా చిన్న పిల్లవాడిని.. తాత రగ్గులో వెచ్చగా ముడుచుకుని పడుకుని ఉన్నాను.. కాబాలో అప్పుడు అర్ధరాత్రి సమయం...తాత తన గతం గురించి చెప్ప

https://teluguislam.net

న్నారు. తన కొడుకు జీవితం కోసం ఆయన వంద ఒంటెలను బలి ఇచ్చినట్లు చెప్పారు.... వంద ఒంటెలు!!"

ఆ చీకటిలో పావురాయి కూత వేకువ జాము అయినట్లు తెలుపుతున్నది. తను లేచి, అబూ బక్ర్‌ను పిలిచారు ప్రవక్త ﷺ. ఇద్దరూ కలిసి అల్లాహ్‌ను ప్రార్థించారు.

'ఓ సృష్టికర్తా!
మాకు రక్షణాత్మకంగా ఉండే స్థలాన్ని చూపించు
శత్రువులు కల్పిస్తున్న దుర్మార్గాల నుంచి కాపాడు
మా చుట్టూ విస్తరించి ఉన్న
అజ్ఞానపు చీకటిని తొలగించు'
రహస్యంగా జరుగుతున్న
కుట్రల నుంచి మమ్మల్ని రక్షించు
మా పట్ల అసూయాద్వేషాలను
పెంచుకుంటున్న వారి నుంచి కాపాడు'.

https://teluguislam.net

# 14. మదీనా

అది మామూలు ఒంటె కాదు. దాని పేరు ఖస్వా. అది చాలా తెలివి కలది. తనను ముఖ్యమైన దానిగా పరిగణిస్తున్నారా లేదా అన్న విషయం తెలివిగల ఏ జంతువుకైనా ఇట్టే తెలిసిపోతుంది.

ఆ ఒంటె రంగు తెలుపు. సాధారణంగా తెలుపు రంగు ఒంటెలు అరుదుగా కనిపిస్తాయి. ఖస్వా కంటి రెప్పలు దట్టంగా, నిండుగా ఉంటాయి. తన పొడవాటి మెడను ముందుకు వెనక్కు కదిలిస్తున్నప్పుడు అది ఎంతో అందంగా, దర్పంగా ఉంటుంది. అది చిన్నగా నడుస్తుంటే అలలు తీరాన్ని తాకుతున్నట్లుగా ఎంతో లావణ్యంగా, లయాత్మకంగా ఉంటుంది. ఎడారి ఇసుకలో అది జింకలా వేగంగా పరిగెత్తినప్పటికీ దాని మీద కూర్చున్న అతనికి పరుపు మీద కూర్చున్నట్టే మెత్తగా ఉంటుంది. అందుకే అది ప్రవక్తకు ఎంతో ఇష్టమైన ఒంటె.

ముహమ్మద్ﷺ, అబూ బక్ర్‌లు మక్కా నుండి బయలుదేరి మూడు రాత్రులు గడిచాయి. చివరికి వారు తమ గమ్యస్థానానికి ప్రయాణం కాగలిగారు. ఖురైష్‌లు తమను వెంటాడడం ఆపివేసినట్లు వారికి తెలిసింది. అబూ బక్ర్ కుమారుడు రహస్యంగా రాత్రి సమయంలో వారి కొరకు రెండు ఒంటెలను తీసుకొని వచ్చారు.

https://teluguislam.net

అబూబక్ర్ కుమార్తె వారి కొరకు ప్రయాణంలో తినటానికి కావాల్సిన ఆహార పదార్థాలను తయారు చేసి పంపించింది.

"స్తోత్రం అల్లాహ్‌కే! ఎట్టకేలకు మనం మదీనాకు..." సంతోషంతో ఆనంద భాష్పాలు రాలుతుండగా అబూ బక్ర్ బిగ్గరగా అన్నారు.

ఎవరు ఊహించగలరు? చినిగిన బట్టలలో, ఇద్దరు ప్రయాణికులు కొండ గుట్టల్ని దాటుకుంటూ మదీనాకు పోయే రోజును ప్రజలు ఎల్లకాలం గుర్తుంచు కుంటారని. ఆ రోజును ప్రపంచవ్యాప్తంగా ప్రతి విశ్వాసి తన యుగానికి, సరికొత్త శకానికి, సంవత్సరంలో మొట్టమొదటి దినంగా పరిగణిస్తాడు.

ఖస్వాకు తెలుసు, అది మామూలు ప్రయాణం కాదని. సర్వ సాధారణంగా మదీనాకు పోయే దారి అది కాదు. సాధారణంగా కనిపించే గుర్తులు కాని, సరస్సులు కాని ఆ దారిలో లేవు. ఎవరూ ప్రయాణించని సముద్ర తీరం వెంబడి వారిరువురూ నడిచారు.

వాళ్లు ఎక్కడా ఆగలేదు. ఒక్కసారి మాత్రం ఒక సిరియా వర్తక బృందాన్ని కలవటం జరిగింది. వాళ్ల నుంచి ఆహార పానీయాలను, తెల్లటి వస్త్రాలను తీసుకు న్నారు. అక్కడి నుంచి ఏదో ఒక దారి గుండా ప్రయాణించి మదీనాకు సమీపాన ఉన్న ఖుబా సరస్సును చేరారు. తిన్నని దారి తెలియనందున ఇక్కడకు చేరటానికి వాళ్ళు ఎన్నో ప్రయత్నాలు చేయవలసి వచ్చింది.

వారికి తెలియకుండానే, మదీనా ప్రజలు వారి రాకను దూరం నుంచి చూశారు. ప్రతి రోజూ వాళ్లంతా వీరి రాక కొరకు పొలిమేరలకు వచ్చి, ఎదురుచూసి వెళ్లిపోతుండేవారు.

"ఆయన వచ్చారు...ప్రవక్త ﷺ వచ్చారు". వాళంతా పెద్దగా అరిచారు.

ఆ వార్త ఎంతో వేగంగా మదీనా నగరం అంతా వ్యాపించింది. పరిగెత్తు కుంటూ వస్తున్న విశ్వాసులతో వీధులు నిండి పోయాయి. ప్రవక్త ﷺ, అబూ బక్ర్‌ల చుట్టూ చేరిన ప్రజలు ఆనందంతో గెంతులేశారు.

"మనప్రవక్త ﷺ వచ్చారోచ్!" పిల్లలు పాటలు పాడుకుంటూ ఖస్వా ఒంటెను చేరి, దాని మూతిని ముట్టుకుని, దాని కళ్లెం తాడును లాగి ఆనందపడ్డారు.

ప్రజల సంతోషకర ఆహ్వానానికి తన ప్రేమ పూర్వక చిరునవ్వుతో ప్రతిస్పం దించి ప్రవక్త ﷺ ఇలా అన్నారు: "విశ్వాసులారా! మీ సంతోషాన్ని కేరింతలతోనే కాక

https://teluguislam.net

ఇలా కూడా ప్రకటించండి. మీ ఇరుగుపొరుగుకు శాంతిని ప్రసాదించండి. పేదలకు ఆహారాన్ని సమకూర్చండి. ఇలా మీరు ప్రవర్తించగలిగితేనే మీకు స్వర్గం సిద్ధిస్తుంది".

అలిసిన ప్రవక్త ﷺ, అబూబక్ర్‌లు ఖుబాలోనే మూడు రోజులు విశ్రాంతి తీసుకున్నారు. విశ్వాసులు వారికి తేనె, ఖర్జూర పండ్లు, పాలు ప్రేమ పూర్వకంగా సమర్పించుకున్నారు. అక్కడే మొట్టమొదటి ప్రార్థనా స్థలమునకు (మస్జిదుకు) ప్రవక్త పునాదులు వేశారు. ప్రవక్త ﷺ తన మొట్టమొదటి బహిరంగ ధార్మిక ప్రసంగం ప్రజలందరికి వినిపించినది కూడా అక్కడే.

ఆ తరువాత అక్కడి నుంచి వాళ్లు ఒక బ్రహ్మాండమైన ఊరేగింపుతో మదీనాకు చేరారు. గొప్ప వేటగాడయిన హమ్జా, మహా బలుడయిన ఉమర్‌లు స్వారీ చేసుకుంటూ, అసంఖ్యాక విశ్వాసుల సమూహంతో ఊరేగింపు సాగింది. జనం తమ చేతుల్లో విల్లంబులతో, తల్వార్‌లతో అరుచుకుంటూ, కేరింతలతో ముందుకు సాగారు.

"ప్రాణాలైనా అర్పిస్తాం, ప్రవక్త ﷺను కాపాడుకుంటాం" అనే నినాదాలు మారుమోగాయి. సెలవు దినపు దుస్తులలో, మెరిసే కవచాలతో నగర ప్రముఖులు ఆ ఊరేగింపును అనుసరించారు.

ఖస్వా ఒంటె ఎంతో గర్వంగా ప్రవక్తను తీసుకుని ముందుకు నడిచింది. మదీనా ఉద్యానవనాల్లోంచి, ఖర్జూరపు తోటల్లో నుంచి ఊరేగింపు సాగిపోయింది. తలపాగా తీసి తయారు చేసిన ప్రవక్త ﷺ నల్లరంగు జెండా ఒక పొడవాటి ఈటెకు కట్టబడింది. ఖస్వాకు ఒక పక్కన అది గాలిలో రెపరెపలాడుతూ ఎగురుతున్నది.

ప్రవక్త ﷺ ఖస్వా మీద కూర్చుని ముందుకు కదిలారు. ప్రజలు అడుగడు గునా ఆయనకు, "ఓ దైవ ప్రవక్తా ﷺ! మా ఇంటికి విచ్చేయండి – మీ రాకతో మా గృహాన్ని పావనం చేయండి" అని విన్నవించుకుంటు న్నారు. ప్రవక్త ﷺ వారి విన్నపాలను విని, అక్కడ ఉండటానికి ఒప్పుకున్నారు.

ప్రతి ఒక్కరు ఆయనను చుట్టుముట్టారు. ఆయన ఎవరి ఇంటిలో ఉండబోతున్నారు? ఆయన ఏమి చెప్పబోతున్నారు? అందరిలో ఒకటే ఆత్రుత!

అప్పుడు ఖస్వా తన తలను గర్వంగా పైకెత్తింది. దానికి ఎంత వరకు అర్థమైందంటే; ప్రవక్త ﷺ తన పేరును ఉచ్చరించారు. తన మెడకు కట్టిన కళ్లెమును వదులు చేసినట్లు దానికి అనిపించింది. అక్కడ ఉన్న స్త్రీ పురుషుల, చిన్న పిల్లల చూపులన్నీ తన మీదే ఉన్నట్లు అది గ్రహించింది. అసలు వీళ్లు తన నుంచి ఏమి ఆశిస్తున్నారన్న

https://teluguislam.net

విషయం తనకు విస్మయాన్ని కలిగించింది. తన హోదాను, గాంభీర్యాన్ని తిరిగి అందిపుచ్చుకుని ముందుకు అడుగులు వేసుకుంటూ పోసాగింది. ప్రవక్త సంజ్ఞలేవీ లేకుండానే తన సొంత మార్గంలో ఆ వీధుల గుండా ముందుకు పోసాగింది. దాని వెనక ఊరేగింపు నిశ్శబ్దంగా అనుసరించసాగింది.

ఏ కళ్లెపు తాడులూ దాన్ని నడిపించకున్నప్పటికీ, అది మాత్రం సరిగ్గానే పోతున్నట్టు అగుపిస్తున్నది. తటపటాయిస్తూనే తన నడకను ముందుకు సాగిస్తూ పంట పొలాల మధ్య, ఖర్జూర పండ్లను నిలువ ఉంచే కొట్టం దగ్గరకు వచ్చి ఆగింది. తన మోకాళ్ల మీద కూర్చుండి పోయింది.

ఆ పక్కన ఉన్న ఇంటివాళ్లు ప్రవక్త(ﷺ)ను ఆహ్వానించటానికి పరిగెత్తుకుంటూ వచ్చారు. అప్పుడు ఉమర్ ఇలా ప్రకటించారు, “ఇక్కడే ప్రవక్త తన కొరకు ఒక మస్జిదును, ఒక ఇంటిని నిర్మించుకుని ఈ ప్రజలతో ఉంటారు.”

అందరూ సంతోషించారు. అయిష్టత ఉన్న కొద్దిమంది కూడా మౌనంగా ఉండి పోయారు. ఎవరు ఒంటెను ఇక్కడి దాకా తీసుకుని వచ్చారన్న విషయంలో ఎవరికి స్పష్టత లేదు. ఖస్వా సాధారణమైన ఒంటె కాదని అందరికీ తెలుసు.

జనం ఇంత సంతోషంగా పని చేయటాన్ని మదీనా వాసులు ఇంతకు ముందెన్నడూ చూడలేదు. ఆ కేరింతలు, పాటలు పట్టణ వాసులందరికి వినిపిస్తున్నాయి. పిల్లలు, ముసలి వాళ్లు ఇండ్లకు పోతూ పోతూ అక్కడ ఆగి ఆ మస్జిద్ నిర్మాణం పనులు చూసి ఎంతో ఆశ్చర్య పోతుండేవారు. అక్కడ కూలీలు గాని, బానిసలు గాని కనిపించటం లేదు. అక్కడంతా మదీనా వాసులతో పాటు మక్కా నుంచి వచ్చిన వాళ్లే ఉన్నారు. వాళ్లు చెమటలతో ముద్దలయిపోతున్నారు. అన్నిటికంటే ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే ప్రవక్తే స్వయంగా పని చేయడం. ఆయన చెక్కను కోస్తున్నారు. ఒక చోటి నుంచి ఇంకో చోటికి ఇటుకలు మోస్తున్నారు. ఉమర్ పునాది రాళ్లను అమరుస్తున్నారు. కుటుంబ సభ్యులతో పాటు మక్కా నుంచి వచ్చిన అలీ, జైద్‌లు వారికి సహకరిస్తున్నారు.

హమ్జా పనిని పర్యవేక్షిస్తున్నారు. “ఆ ఖర్జూర చెట్ల మొద్దులను నరకవద్దు, అవి కప్పును నిలిపి ఉంచే దూలాలుగా పనికి వస్తాయి” అని వాటిని కోస్తున్న అబూ బక్ర్ వైపు చూస్తూ పెద్దగా చెప్పారు. ఈ పని మొత్తం చేస్తూ మధ్యమధ్యలో వాళ్లు పాడుకునే పాట:

https://teluguislam.net

"తప్పక ఆనందం ప్రాప్తిస్తుంది
ఇహలోక జీవితం పూర్తయినంతనే
ఓ అల్లాహ్! కరుణించు.. నీ కృప చూపించు
మక్కా వలస వాళ్లపై, మదీనా సహాయకులపై!"

అక్కడ సోమరులుగా ఉన్న కొద్దిమందిని చూసి అలీ తన స్వంత పాట ఎత్తుకున్నారు,

"ప్రవక్త శ్రమిస్తున్నది చూస్తూ....
ఈ చెట్టు కింద విశ్రాంతి వద్దూ వద్దూ"

తిరిగి అంతా బృందగానం చేశారు –

"తప్పక ఆనందం ప్రాప్తిస్తుంది
ఇహలోక జీవితం పూర్తయినంతనే"

వాళ్లతో ప్రవక్తా జత కలిపి పాడారు.

"అల్లాహ్! కరుణించు... నీ కృప చూపించు"

మదీనా సహాయకులకు, మక్కా నుంచి వచ్చినవాళ్లకు పనిలో చేస్తున్న సహాయం ఆపేసి, అలీ, జైద్‌లు ఆశ్చర్యంగా ప్రవక్తను చూశారు. ప్రవక్త ﷺ పాటలోని చివరి చరణాన్ని సరిగ్గా పాడలేదు. "ఓ దైవప్రవక్తా! తమరెందుకుని పాటలోని పదాలను మార్చిపాడారు?"

ప్రవక్త ﷺ మొదట ఆశ్చర్యపోయి తరువాత ఇలా సమాధానమిచ్చారు, "పదాలను మార్చేశానా? మరైతే మక్కావాసులు ఎలా అంటారు? నేను కవిననీ, ఖుర్‌ఆన్ నా కల్పితమని. మీరే చూశారు కదా, కనీసం చిన్నపాటి చరణాన్ని కూడా నేను సరిగ్గా పాడలేకపోయాను."

https://teluguislam.net

# 15. మదీనా-2

మస్జిద్ నిర్మాణం పూర్తయింది. ఇటుకలతో, మట్టితో కట్టిన గోడలను అలికి, తెల్లటి సున్నం కొట్టారు. చెక్కిన ఖర్జూర చెట్ల మొదళ్లను పంగలుగా మలచి కప్పు దూలాలకు ఆధారంగా నిలిపి వుంచారు. విశ్వాసులకు అదొక చూడచక్కని దృశ్యం. కాని ధనవంతుడైన, స్థాని కంగా పలుకుబడి ఉన్న ఒక మదీనావాసికి ఆ దృశ్యమే కంటగింపుగా మారింది.

"ఎంత కాలం ఈ మస్జిద్ కూలిపోకుండా ఉంటుందని మీరు అనుకుంటున్నారు?"

బలిష్టంగా లేని మస్జిద్ కప్పును, ముహమ్మద్ﷺ ను మార్చి మార్చి చూస్తూ, "ఒక బలమైన, ఎక్కువ కాలం మన్నికగా ఉండే వస్తువులతో తయారు చేసిన మస్జిద్‌నే విధిగా నిర్మించాలి" అన్నాడతను.

అందుకు ముహమ్మద్ ప్రవక్తﷺ, "మూసా కాలానికి అయితే ఈ దూలాలు, చెట్ల మొదళ్లే బలంగా ఉండేవి. పైగా ఈ పూరి కప్పులు భూమ్మీద మనిషి అదృష్టం కన్నా మన్నికైనవి" అన్నారు.

మస్జిద్ వెనుక ప్రవక్తﷺ తన వసతి గృహాలు నిర్మించుకున్నారు. అబూ బక్ర్ కూతురయినటువంటి,

https://teluguislam.net

ప్రవక్తﷺ భార్య అయిషాను త్వరలో అక్కడికి తీసుకురావాలి. ఆమె చాలా ఉత్సాహ వంతురాలు. కొన్ని కొన్ని సమయాలలో ఆమె ఉల్లాసంగా అల్లరి కూడా చేస్తుంది. అంతేకాదు, ప్రవక్త మనసును యవ్వనభరితంగా ఉంచుతుంది. అయిషాతో పెళ్లి అంటే ప్రవక్తకు అబూ బక్ర్‌తో సంబంధం ఇంకా ఎంతో ఆత్మీయంగా బలపడి పోవడమే. వాళ్లిద్దరు మంచి మిత్రులు. ఒకరి కన్నా ఎక్కువ మంది భార్యలను కలిగి ఉండే అనుమతిని ప్రవక్తﷺకు ధర్మం ఇచ్చింది. కాలక్రమంలో ఆయన భార్యలు ఆ మస్జిద్ వెనకే వసతిని పంచుకుంటూ జీవించారు. ఆయన భార్యలు ఎక్కువ మంది విధవరాల్లే. యుద్ధంలో చనిపోయిన విశ్వాసుల భార్యలో లేక ప్రముఖ శత్రువుల భార్యలో గాని తమ రక్షణ నిమిత్తం ప్రవక్తను వివాహమాడారు. ఆ రోజుల్లో విధవ జీవితం చాలా కష్టంగా ఉండేది. వాళ్లు నిర్లక్ష్యానికి, మోసానికి గురవుతుండే వారు. కాని ఏ భార్య కూడా ప్రవక్తﷺ మనస్సులో ఖదీజా పట్ల ఉన్నంత ప్రేమని ఆక్రమించు కోలేకపోయింది. ఖదీజా మొట్టమొదటి భార్య. ప్రవక్తను విశ్వసించిన మొట్టమొదటి వ్యక్తి. అంతేకాదు, ప్రవక్త పిల్లలకు తల్లి కూడా.

ఒక సాయంత్రం ఆ మస్జిద్‌లో తన చుట్టూ కూర్చునివున్న విశ్వాసులను ఆయన అడిగారు, "మనం ప్రజల్ని ప్రార్థనలకు రమ్మని ఎట్లా పిలుద్దాం? క్రైస్తవులు గంటలు మోగిస్తారు, యూదులు బూరలు ఊదుతారు....మనం....?"

అందరూ నిశ్శబ్దంగా ఆలోచనల్లో మునిగిపోయారు. ఎవరూ ఏమీ సూచించ లేకపోయారు. చివరికి ఒక మూల నుంచి ఒక ముసలి మనిషి నోరు తెరిచాడు, "ప్రవక్తﷺ అనుమతిస్తే, నేనొక స్వప్నం గురించి చెబుతాను".

ప్రవక్తﷺ తల ఊపగా, మిగిలిన వాళ్లంతా వినటానికి ముందుకు వంగారు.

"ఒక రాత్రి నాకు కలలో ఒకతను కనిపించాడు. అతని చేతిలో ఒక గంట ఉంది. ఆ గంటను చూడగానే నాకో ఆలోచన తట్టింది. దాని సహాయంతో ప్రజలను ప్రార్థనలకు పిలవాలని. అందుకే ఆ గంటను అమ్మమని ఆ మనిషిని అడిగాను. కాని అతను నిరాకరించి నాతో అన్నాడు: "నేను ఈ గంట కన్నా మంచి మార్గం చూపి స్తాను. అది మనిషి గొంతు. దూరం నుంచి కూడా దానిని మనం వినగలం. ఆ గొంతు ఇలా పిలుస్తుంది :

"అల్లాహ్ అందరి కన్నా గొప్పవాడు.

https://teluguislam.net

అల్లాహ్ తప్ప మరో ఆరాధ్య దేవుడు లేడు.

ముహమ్మద్ ﷺ అల్లాహ్ ప్రవక్త.

నమాజ్‌కు రండి..నమాజ్‌కు రండి.

సాఫల్యం వైపుకు రండి...సాఫల్యం వైపుకు రండి"

ప్రవక్త కాసేపు ఆలోచించి తల ఊపారు. "అది నిజంగానే అల్లాహ్ మనకు పంపిన సంకేతం. విశ్వాసులను నమాజుకు రమ్మని మనిషి గొంతుతో పిలిస్తేనే బాగుంటుంది"

అబూ బక్ర్ తల వంచుకుని కూర్చుని, ఇదంతా వింటూ జ్ఞాపకం చేసుకుంటు న్నారు. ఒకసారి ఆయన ఒక గొంతు విన్నారు. ఆ గొంతును ఆయన జీవితాంతం మరచిపోలేరు.

● ● ●

ఆ గొంతు ఎడారి వేడి గుండా ప్రయాణించి ఆయనను చేరింది. ఆ సమయంలో ఆయన మక్కా శివారు ప్రాంతంలో తీరికగా పచార్లు చేస్తూ ఉన్నారు. ఆ గొంతు శబ్దం పెద్దగా ఇలా వినిపించింది. "అహద్.. అహద్! ఒక్కడే దేవుడు.. ఒకే ఒక్కడు."

ఎంతో ఉద్వేగం, విశ్వాసం నిండి ఉన్న ఆ గొంతు, ధ్వని అబూ బక్ర్ హృదయాన్ని మెలి తిప్పాయి. ఆ అరుపు ఎక్కడి నుంచి వచ్చిందో చూడకుండా ఉండలేక పోయారు. బయటకు వచ్చి చూస్తే అక్కడ బానిస అయినటువంటి బిలాల్ ఉన్నారు. నల్లగా, భారీగా వున్న ఆయన శరీరాన్ని సాగదీసి, బంధించి, ఆ ఇసుకలో పడేసి ఉంచారు మక్కా అవిశ్వాసులు. కొరడాతో కొట్టిన దెబ్బలకు ఆయన శరీరం ఎర్రటి గాయాలతో నిండి ఉంది. ఒక పెద్ద బండరాయి ఆయన గుండెల మీద ఉంచబడింది. ఎండ వేడికి శరీరం అంతా కాలి నల్లగా మారినప్పటికీ, పెదవులు మాత్రం పగిలి రక్తాన్ని కారుస్తున్నాయి. అయినప్పటికీ, ఎంతో కష్టంతో, శక్తినంతా కూడదీసుకుని విశ్వాసం, బాధ కలగలసిన స్వరంతో పలుకుతున్నారు: "అహద్..అహద్! ఒక్కడే , దేవుడు ఒక్కడే".

అబూ బక్ర్ ఆ గుండె మీది బండరాయిని పక్కకు తప్పించి దూరంగా దొర్లిం

https://teluguislam.net

చారు. తరువాత బానిస కట్లు విప్పి అతని యజమాని దగ్గరికి వెళ్లారు.

"అతనొక తిరుగుబాటుదారుడు, మొండివాడు. కాబా దేవుళ్లను పూజించ టానికి నిరాకరించినవాడు" అంటూ ఆ యజమాని బానిస గురించి నిందారోపణలు చేశాడు.

అబూ బక్ర్ అతనితో వాదించలేదు. అతనికి మొత్తం డబ్బులు చెల్లించారు. ఆ విధంగా బిలాల్ పూర్తి స్వేచ్ఛాజీవి అయిపోయారు.

● ● ●

ప్రవక్త ﷺ పక్కన కూర్చుని అబూ బక్ర్ పరిశీలనగా బిలాల్‌ను చూస్తున్నారు. పొడుగ్గా, నల్లగా ఉన్న బిలాల్ తనలోని విశ్వాసాన్ని రుజువు చేసుకున్నారు. ఇదంతా గమనించిన ప్రవక్త ﷺ, "ఇకనుంచి ప్రార్థనలకు పిలవడానికి బిలాల్ ఉంటారు. ఆయనే మన ముఅజ్జిన్" అని అన్నారు.

"అవును బిలాలే" అందరూ అంగీకరించారు.

అబూ బక్ర్ చిరునవ్వు నవ్వారు.

ప్రజలు తనను ఇలా గౌరవించినందుకు బిలాల్ కాస్తంత ఇబ్బందిగా కదిలారు. అనంతమైన ఆకాశాన్ని, విశాలమైన ఎడారిని చూస్తూ, బిడియం లేకుండా తన అద్భుత గొంతుతో ఇలా పిలిచారు:

" అల్లాహు అక్బర్ అల్లాహు అక్బర్.... అల్లాహ్ అందరి కన్నా గొప్పవాడు. నమాజ్‌కు రండి.. నమాజ్‌కు రండి. "

అది విశ్వాసులను నమాజ్‌కు రమ్మని పిలిచే పిలుపు. అంగడిలోని వ్యాపా రస్తులు తాము చేస్తున్న పనులని ఆపి అజాన్ విన్నారు. ఇండ్లల్లో ఉన్న గృహిణు లకు, ఖర్జూర చెట్ల నీడల్లో ఆడుకుంటున్న పిల్లలకు, ఒంటరిగా ఎడారిలో దూరంగా నడుస్తున్న బాటసారులకు, మదీనా వాసులందరికీ అజాన్ పిలుపు వినిపించింది. అది ఇస్లామ్ ధర్మానికి సంబంధించిన, ప్రార్థనకు పిలిచే పిలుపు అనీ, ఇస్లామ్ అంటే ఒకే ఒక్క అల్లాహ్‌ను నమ్మటం అని అందరికీ తెలిసిపోయింది.

ఇప్పటికీ (అంటే పద్నాలుగు వందల సంవత్సరాలు గడిచిపోయినప్పటికీ) ప్రపంచంలోని ప్రతి మస్జిద్ నుంచి రోజుకు అయిదు సార్లు ఈ అజాన్ వినిపిస్తూనే

https://teluguislam.net

ఉన్నది. ప్రవక్త నిర్మించిన కొత్త ఇంటిలో ఆ రాత్రి అందరూ కలిసారు. మస్జిద్ నిర్మాణం పూర్తయిన సందర్భంగా, ప్రవక్త ﷺ ఆయిషాను పెళ్లి చేసుకున్న సందర్భంగా, అలీ ఫాతిమాల పెళ్లయిన సందర్భంగా సంబరం జరుపుకోవాలని వారనుకున్నారు.

"అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో" అని అబూ బక్ర్ ప్రారంభించారు.

దినమంతా పని చేసి ఆకలితో ఉన్న ఒక విశ్వాసి అప్పుడే లోనికి ప్రవేశించాడు. చాప మీద కూర్చున్నాడు. అక్కడున్న వాళ్లు తమ తమ మాంసం కూరను తిన్నారను కొని, తన భాగంగా అతను ఎక్కువగా తీసుకుని తినటం ప్రారంభించాడు. ప్రవక్త ﷺను చూడగానే, 'బిస్మిల్లాహ్' అనలేదని గుర్తొచ్చి నోటిలోని ముద్దను గుటుక్కున మింగి ప్రార్థించబోయాడు. ఇదంతా చూసిన ప్రవక్త ﷺ మనసారా నవ్వుకున్నారు.

"ఏమయింది ప్రవక్తా?" ఆకలితో ఉన్న విశ్వాసి అడిగాడు. నవ్వుతూ ప్రవక్త ﷺ ఇలా బదులిచ్చారు, "నువ్వు కూర్చుని తినటం మొదలు పెట్టినప్పుడు నీతో కలిసి షైతాన్ కూడా తింటూ ఉన్నాడు. ఎప్పుడైతే నువ్వు 'అల్లాహ్ పేరుతో' అనాలను కున్నావో, షైతాను తన వంతు భాగాన్ని వదిలేసి పారిపోయాడు."

https://teluguislam.net

# 16. బద్ర్ యుద్ధం

ముహమ్మద్ﷺ దైవప్రవక్త అయినప్పటికీ, తన గదిని తనే శుభ్రం చేసుకునేవారు. తన బట్టలను తనే ఉతుక్కునేవారు.

ఒకరోజు. శుక్రవారం నమాజుకు తయారు కావల్సిన సమయం ఆసన్నమౌతోంది. జిబ్రయీల్ దూత చెప్పినట్టు ప్రవక్త సాంప్రదాయబద్ధంగా స్నానం చేశారు. శ్రద్ధగా తల వెంట్రుకలను, గడ్డాన్ని దువ్వు కున్నారు. పండ్లను శుభ్రం చేసుకున్నారు. చివరగా అత్తరు పూసుకున్నారు. మస్జిద్ ప్రాంగణంలో ప్రవేశిం చాక ప్రవక్తﷺకు కనిపించిన దృశ్యం ఆయన హృద యాన్ని కలిచివేసింది. విశ్వాసుల్లో ఎక్కువ మంది మక్కా నుంచి వలస వచ్చిన వాళ్లే. సరియైన ఆహారం లేక వాళ్లంతా బక్క పలుచగా, బలహీనంగా ఉన్నారు. మస్జిద్ ప్రాంగణంలో ఇంకో వైపు 'అరుగు ప్రజలు' ఉన్నారు. వారికి ఆ పేరు పెట్టింది ప్రవక్తే. తమకు ఇళ్లు లేనం దున, రాత్రయ్యాక వారు మస్జిద్ ముంగటి అరుగులపై పడుకుంటారు. అబూ బక్ర్ లాంటి వ్యాపారస్తులకు రైతుల నగరమయిన ఈ మదీనాలో చేయటానికి పనేదీ లేదు. వాళ్ల ఆస్తిపాస్తులన్నిటినీ మక్కాలోని ఖురైషులు తీసేసుకున్నారు.

అలీ ప్రవక్తﷺతో అన్నారు, "నిన్నటి దినమంతా బకెట్ల నిండుగా నీళ్లు మోస్తూ ఒకతని దగ్గర పని చేశాను, అతను ఇటుకలు తయారు చేసేవాడు. అంత కష్టానికి అతను పదహారు ఖర్జూర పండ్లు మాత్రమే చెల్లించాడు."

ప్రవక్తﷺ తరచుగా ఆకలితో ఉండి పోవాల్సి వచ్చేది. తన దగ్గర వుండే కొద్ది పాటి ఖర్జూరాలను, తేనెను కూడా ఆయన ఏమీ లేని వాళ్లతో పంచుకుని తినేవారు.

ఆ శుక్రవారం నాడు చాలా మంది మస్జిద్‌కు రాలేదన్న విషయాన్ని ప్రవక్తﷺ గ్రహించారు. ఫాతిమా లాంటి కొంతమంది జ్వరంతో బాధ పడుతున్నారు. వలస వచ్చిన మక్కా వాళ్లకు ఆ వాతావరణంలో జ్వరం సాధారణమయిపోయింది. ప్రవక్తﷺ ఈ మక్కా వలస ప్రజలకు అక్కడి స్థానిక తెగల వాళ్లతో "అన్నదమ్ముల సంబంధం" ఏర్పరచారు.

మక్కా వర్తక సమూహాలు వస్తూపోతూ ఉండే దారుల్లో నివసించే తెగలవాళ్ళతో శాంతి చర్చలు జరపటానికి ప్రవక్తﷺ కొంతమంది అనుచరులను పంపించారు. ఖురైషియులను హెచ్చరించటానికి మరి కొంతమందిని పంపించారు. నిజంగానే ఖురైషియులను గుర్తు చేయాల్సిన అవసరం ఉన్నది. ప్రవక్తﷺ, విశ్వాసులు సర్వశక్తి మంతుడైన అల్లాహ్‌కు తప్పించి వేరే ఇంకెవరికీ భయపడరని ఖురైషియులు గ్రహిం చాల్సిన అవసరం ఉన్నది. అంతేకాదు, ముస్లింలు తమ హక్కుల కొరకు, తమ ధర్మం కొరకు స్వేచ్ఛగా, ధైర్యంగా నిలబడతారని వారికి తెలియాలి. సంవత్సరానికి ఒకసారి మక్కాలో జరిగే పుణ్యక్షేత్రాల యాత్రలో పాల్గొనే హక్కు, ఇస్లాం ధర్మంలోకి ప్రజలను ఆహ్వానించే హక్కు తమకు ఉందని వారికి తెలియాలి. ఇప్పుడు ఈ వ్యవహారాలన్ని ఓ కొలిక్కి వచ్చే సమయం ఆసన్నమైంది.

ఈ శుక్రవారం ప్రవక్తﷺ ఒక నిర్ణయం తీసుకున్నారు. జిబ్రయీల్ నుంచి తనకు చేరిన సందేశాన్ని తన అనుచరుల సమక్షంలో ప్రకటించాలని. అల్లాహ్ పేరు మీద మక్కా కుట్రదారులను ప్రతిఘటించాలన్నది ఆ ఆదేశం. ఆ రాత్రి మదీనాలో ఎవరూ ప్రశాంతంగా నిద్రపోలేదు. ఆకాశంలో నల్లటి మేఘాలు కమ్ముకున్నాయి. శబ్దం లేకుండా తెల్లటి మెరుపులు మెరిసి భూమిలోనికి చొచ్చుకుపోయాయి. ప్రవక్తﷺ రాత్రంతా ప్రార్థించటంలోనే గడిపారు. బయట మస్జిద్ ప్రాంగణంలో హమ్జా నీరసంగా ముందుకు వెనక్కి నడుస్తున్నారు. ఆయనలోని వేటాడే సహజాతం మేల్కొంది. ఆయన కండ్లల్లో శత్రువును వెతికే చూపు కనిపిస్తున్నది.

https://teluguislam.net

బాణాలను తయారు చేసే సాద్ తన చీకటి గుడారంలో మేల్కొని ఉన్నారు. తనకు తెలియకుండానే ఆయన చేతులు బాణాలను తయారు చేస్తున్నట్లు కదులు తున్నాయి. అబూ బక్ర్ కూడా నిద్రించకుండా జాగరూకతతో ఉన్నారు. తన పక్క మీద పడుకుని ఇటీవలి అల్లాహ్ సందేశాన్ని వల్లె వేసుకుంటున్నారు.

“నువ్వు యుద్ధం చేస్తుండాలి

నీతో చేస్తున్న వారితో!

అల్లాహ్ కొరకు యుద్ధం చెయ్యాలి

హింస, అణచివేత

తుడిచి పెట్టుకుపోయేంత వరకు

న్యాయం, విశ్వాసం

నెలకొనేంత వరకు”

ఈ పంక్తులను ఆయన పదేపదే ఉచ్చరించారు. భవిష్యత్తులో జరగబోయే సంఘటనలను ఈ వాక్యాలలో ముందుగానే చెప్పటాన్ని చూసి ఆశ్చర్యచకితు లయ్యారు.

ఉదయం అయింది. కాని మదీనా మీది తుఫాను మేఘాలు విచ్చుకోలేదు. వాతావరణాన్ని తేలిక పర్చేందుకు వర్షమన్నా పడలేదు. అయినప్పటికీ అక్కడంతా, ప్రతి ఒక్కరు జాగరుకతతో ఉన్నారు, ముందుగానే ఏదో తెలిసిపోయినట్లు. బిలాల్ ప్రకటన (అజాను) విన్నవెంటనే విశ్వాసులంతా మస్జిద్‌కు చేరుకున్నారు.

క్షణాల్లో ఒక వార్త మదీనా నగరమంతా వ్యాపించింది. వెయ్యి ఒంటెల వర్తక బృందం చెప్పలేనంత సంపదతో డెమాస్కస్ నుంచి మక్కాకు బయలుదేరింది. మక్కా పురప్రముఖుడైన అబూ సుఫ్యాన్ ఈ వర్తక సమూహానికి అధిపతి. కాబాలో నిషేధాన్ని విధించినది అతనే. దైవప్రవక్తﷺను హత్య చేయాలని కుట్ర పన్నిందీ అతనే.

ఇంత భారీ సమూహం తప్పకుండా రక్షణ లేకుండా బయలుదేరదు. వాళ్ల వెంట ఖచ్చితంగా సాయుధులయిన రక్షకులు ఉంటారు. ఎంతో తక్కువ వ్యవధి అయినప్పటికీ, ప్రవక్తﷺ జారీ చేసిన ఆజ్ఞలన్నీ అమలయ్యాయి. మదీనా నగర సహాయకులు (అన్సార్లు), మక్కా వలస ప్రజలు (ముహాజిర్లు) అందరూ ప్రవక్తﷺ,

https://teluguislam.net

అబూ బక్ర్‌ల నాయకత్వంలో మదీనా కొండదారి గుండా ఆ సమూహాన్ని నిలువ రించటానికి బయలుదేరారు.

ప్రవక్త(ﷺ) తన చేతిలోని జెండాను ముస్‌అబ్‌కు ఇచ్చారు. ప్రవక్త(ﷺ) ఆదేశాను సారం హమ్జా, ఉమర్, ఇంకా విల్లులు తయారుచేసే సాద్, నమ్మకస్థుడైన అనుచరుడు ఉబైదా ముందు నడుస్తున్నారు. వారి కళ్లు మెరుస్తున్నాయి. అంతా కలిసి మూడు వందల పద్నాలుగు మంది ఉన్నారు, డెబ్బై ఒంటెలు, రెండు గుర్రాలు మాత్రమే ఉన్నాయి. ఎడారిలో వాళ్లు ఎనభై మైళ్లు ప్రయాణం చేయాలి.

తమ దగ్గర తగినన్ని వాహనాలు లేకపోయినప్పటికీ వాళ్లు కొద్ది దూరం కాలి నడకన నడుస్తూ, మరి కొద్దిదూరం వాహనాలపై స్వారీ చేసుకుంటూ ముందుకు పోతు న్నారు. ఒక ఒంటెను ముగ్గురు, నలుగురు ఎంచుకుని దానిపై వంతులవారీగా, నిప్పులు చెరుగుతున్న ఎండల్లోపడి వెళ్తున్నారు. జైద్, అలీలను తనతో పాటు ఎక్కించు కొని ప్రవక్త(ﷺ) ముందుకు సాగుతున్నారు.

కాని వార్త మనిషి కన్నా వేగంగా ప్రయాణిస్తుంది. సాయుధులైన మనుషులను పంపించమని అబూ సుఫియాన్ మక్కాకు కబురంపించాడు. ఒంటెలు, గుర్రాలు కలిగిన వెయ్యి మంది సాయుధ సైన్యం అబూ జహల్ అధ్యక్షతలో మక్కా నుంచి బయలుదేరింది.

అది విన్న ప్రవక్త(ﷺ), తన ఒంటెను ఆపి తన వారి వైపు తిరిగి, “ఇప్పుడు మీ సలహా ఏమిటి?” అని అడిగారు.

మక్కా నగర అనుచరులు, “ఎటువంటి పరిస్థితులలోనైనా మీతో పాటు యుద్ధం చేయడానికి మేము సిద్ధంగా ఉన్నాం” అన్నారు. ప్రవక్త(ﷺ) వారిని దీవించి కృతజ్ఞతలు తెలుపుకున్నారు. మిగతావారి వైపు తిరిగి, “మీ సలహా ఏమిటి?” అని అడిగారు.

“మా గురించి అడుగుతున్నారు? మేము మీకు మాట ఇచ్చాము. మీరు చెప్పింది వింటామని, విధేయంగా ఉంటామని అన్నాము. మీ ఇష్టానుసారం మీరు ఎక్కడికి వెళ్లినా మీతోనే ఉంటాం. సముద్రంలో దూకమని మీరంటే, ఒకరం కూడా వెనుకంజ వేయం” అని మదీనా విశ్వాస అనుచరులు పలికారు.

ఈ మాటలు ప్రవక్త(ﷺ)కు ఎంతో సంతోషాన్ని కలిగించాయి. అమితమైన

https://teluguislam.net

ప్రోత్సాహాన్ని ఇచ్చాయి. "మంచి మనస్సుతో ముందుకు నడుద్దాం. విజయం గాని లేక యుద్ధప్రాప్తి గాని రెండిట్లో ఏదో ఒకటి తప్పకుండా ప్రసాదిస్తానని అల్లాహ్ నాతో అన్నాడు. యుద్ధంలో శత్రువులు మట్టికరుస్తున్న సన్నివేశం నా కళ్లకు కట్టినట్టుగా అగుపడుతోంది" అని ప్రవక్త ﷺ అన్నారు.

విశ్వాసులు బద్ర్ ప్రాంతానికి చేరుకున్నట్లు మక్కా గూఢచారులు తెలుసు కున్నారు. ఈ లోపు అబూ సుఫియాన్ తన సమూహానికి ఆదేశాలు జారీ చేశాడు, ముహమ్మద్ ﷺ అనుచరుల ప్రమాదం నుంచి తప్పించుకునేలా దారి మార్చమని, పశ్చిమం వైపు సముద్ర తీరానికి వేగంగా కదలండని. ఎట్టకేలకు అబూ సుఫ్యాన్ వర్తక సమూహం బద్ర్‌కు దూరంగా ప్రమాదం లేని దూర ప్రాంతానికి చేరుకుంది. ఈ వార్త తెలిసే సరికే, ఖురైష్ సైన్యం బద్ర్ ప్రాంతానికి దక్షిణాన కొన్ని మైళ్ల దూరంలో ఉంది.

"మనం తిరిగి మక్కా వెళ్లిపోదాం. వర్తక సమూహం క్షేమంగా ఉంది. మన రక్త సంబంధీకుల రక్తాన్ని చిందించటం సరికాదు" వారిలో ఒకతను సలహా ఇచ్చాడు.

అబూ జహల్ దానికి తీవ్రంగా ప్రతిస్పందించాడు. "మనం వెనక్కు వెళ్లే ప్రసక్తే లేదు. బద్ర్‌కు ఖచ్చితంగా పోవాల్సిందే. అక్కడ మూడు రోజులు గడపాల్సిందే. ఒంటెలను కోసుకొని, మద్యం సేవించి, విందు చేసుకోవాల్సిందే. కనుక పదండి" అన్నాడు.

అది రాత్రి సమయం. బద్ర్ ప్రాంతంలో తప్ప తాగి పెద్దగా మాట్లాడుకుంటున్న ఖురైషుల లొల్లి అక్కడ వున్న వారెవరికైనా వినిపిస్తుంది. కాని వారికి ఉత్తరాన కొద్ది దూరంలో ముహమ్మద్ ﷺ, ఆయన మనుషులు వేకువ జామున దాడి చేయటానికి నిరీక్షిస్తున్న సంగతి జాగ్రత్తగా గమనిస్తేనే తెలుస్తుంది.

మరి యవ్వనుడు కానటువంటి అబ్దుల్లాహ్ వేకువ కొరకు నిరీక్షిస్తూ, కాలుతున్న కట్టెల పక్కన కూర్చున్నాడు. దూరంగా తమ గుడారం వెనుక వైపు వస్తూ ఉన్న ఒకతను కనిపించాడు. అతను మక్కా నుంచి వచ్చిన యువకుడు, మసూద్. నిశ్శబ్దంగా అతన్ని చేరి అతన్ని తన కౌగిలిలో బంధించాడు. ఈ హఠాత్ సంఘటనకు ఆశ్చర్యపోయిన మసూద్ తన చేతిలోని వస్తువులను వదిలేసి తనను పట్టుకున్న అతనిని చూశాడు. అబ్దుల్లాహ్ అతనిని ఒక్క పక్కకు తీసుకువెళ్లారు. అక్కడ వారి మాటలు గుడారంలో నిద్రిస్తున్న వారికి అంతరాయం కలిగించవు.

https://teluguislam.net

సూటిగా అబ్దుల్లాహ్ కళ్లలోకి చూడలేక తల పక్కకు తిప్పుకుని మసూద్ విచార వదనంతో మాట్లాడటం ప్రారంభించారు. "నేను ఈ గుడారాన్ని వదిలి పోతున్నాను. నాకు యుద్ధం చేయాలని లేదు. నేను ఈ విశ్వాసానికి కట్టుబడినట్లు ప్రకటించి నప్పుడు, నిజంగానే చాలా నిజాయితీగా ఒప్పుకున్నాను. అల్లాహ్ ఒక్కడే అని, ముహమ్మద్ﷺ దైవప్రవక్త అని నేను నమ్ముతున్నాను. దీంతో నాకు అర్థమైంది ఏమిటంటే మనం అయిదు పూటలా నమాజు చేయాలని, ఉపవాసాలు ఉండాలని, దానాలు చేయాలని, మన సహోదరులకు సహాయం చేయాలని. కాని యుద్ధం చేయాలని అప్పుడు అనలేదు. ఇప్పుడు మనం తప్పక యుద్ధం చేయాలా? అంతేకాదు, మనం యుద్ధం చేయబోతున్నవాళ్లు కొత్త వాళ్లు కాదు. మన ఇరుగు పొరుగు వాళ్లే. ప్రవక్త కుటుంబానికి సంబంధించిన వాళ్లే. నన్ను నువ్వు పిరికివాడిగా పిలిచినా సరే. నేను మాత్రం యోధుడిని కాదు."

"మసూద్! నువ్వు అబద్ధం చెబుతున్నావు" అబ్దుల్లాహ్ అన్నారు.

"ఏమిటి?" పైకి చూస్తూ మసూద్ అడిగారు.

"నువ్వు అబద్ధం చెబుతున్నావు, మసూద్! నువ్వొక యోధుడివి. యుద్ధాలు యుద్ధరంగంలో మాత్రమే జరుగుతాయని అనుకుంటున్నావా? ప్రవక్తﷺ ముందు నిల్చుని నీ విశ్వాసాన్ని ప్రకటించిన నాటి నుంచి నువ్వు నాకు తెలుసు. నువ్వు వాటిని గెలిచావు కూడా. ప్రతిరోజు నువ్వు పోరాడుతుంటావు, గెలుస్తుంటావు. ప్రతి ఉదయం పూట నువ్వు నమాజు చేయటానికి తల వంచుతున్నావంటే, పక్క మీద నిద్రించే సుఖాన్ని వదులుతున్నావు అన్నమాట. అంటే నువ్వు ఒక యుద్ధం చేసినట్లు, గెలిచి నట్లు. నీది, నీకవసరమయినది ఏదో ఒకదానిని ఎప్పుడైతే వదిలేస్తుంటావో అప్పుడు నువ్వు యుద్ధం చేస్తున్నట్లు, అంటే గెలుస్తున్నట్లు. నీ స్వార్థానికి, సౌఖ్యానికి, ఈ ప్రపం చపు వ్యామోహాలకు వ్యతిరేకంగా నిత్యం నువ్వు యుద్ధాలు చేస్తూనే ఉన్నావు. ఇతరుల గురించి ఊసుపోని కబుర్లు మాట్లాడకుండా, నువ్వు సత్యం గురించి ఆలోచిస్తే యుద్ధం చేస్తున్నట్లే. నీ ఆహారాన్ని ఇతరులతో పంచుకొని నువ్వు ఆకలితో ఉండడం (నేను చూసిన విషయమే ఇది) అంటే యుద్ధం చేస్తున్నట్లే.

నువ్వు సరిగ్గా ఉన్నప్పటికీ, నీ మీద ఏవో ఆరోపణలు వస్తున్నట్లయితే నువ్వు యుద్ధం చేస్తున్నట్లే. నీ దగ్గరి నుంచి ఏమన్నా తీసుకున్నప్పుడు, నువ్వు ఫిర్యాదు

https://teluguislam.net

చేయకపోవడం అంటే యుద్ధం చేస్తున్నట్లే. కనుక,... మసూద్! నువ్వు యోధుడివివే.... కావని మాత్రం చెప్పొద్దు".

దూరంగా ఎడారి ఇసుక తిన్నెల మీద మసకమసకగా పడుతున్న వెన్నెలను ఒకసారి చూసి, అబ్దుల్లాహ్ తిరిగి మాట్లాడసాగారు,

" రేపు ప్రవక్త తన రక్త సంబంధీకులతో తప్పక యుద్ధం చేస్తారు, నీతో నువ్వు మామూలుగా యుద్ధం చేసినట్లు. నీలోని ఏ అంశం మంచి పనిని వినదో దానికి వ్యతిరేకంగా పోరాటం చేసి అధిగమించాలి. మసూద్! మనం రేపు అదే చేయ బోతున్నాం. బద్ర్ బావుల దగ్గర రేపు జరగబోయే యుద్ధం చిరకాలం ఒక ప్రతీకగా నిలిచి పోతుంది. అదేమంటే తన లోపటి శక్తులతో మనిషి పోరాటం. మన ఇస్లాం ధర్మంలో యుద్ధం అంటే అర్థం అదే. ప్రవక్త స్వయంగా నాకు ఇలా బోధించారు".

ఇద్దరూ కలిసి గుడారపు వెనుక ప్రాంతానికి వెళ్లారు.

బద్ర్ ఆకాశపు నక్షత్రాల కింద నిలబడి అబ్దుల్లాహ్ తిరిగి చెప్పడం కొనసా గించారు.

"మనం ఇంకా యువకులమే. మనకు ముందు ఇంకా ఎంతో జీవితం ఉంది. కాని మనం చనిపోయిన తర్వాత ఉండే శాశ్వత జీవితంతో పోల్చినప్పుడు, భూమ్మీది ఈ జీవితం ఇక స్వప్నం లాంటిదే అని ప్రవక్తﷺ చెప్పారు."

"అబ్దుల్లాహ్! అల్లాహ్ నిన్ను అనుగ్రహించుగాక!" కొద్దిసేపటి తరువాత గుడారానికి తిరిగి వచ్చేసి మసూద్ అన్నారు, "ఇక నేను కాసేపు విశ్రాంతి తీసుకుం టాను. మనం రేపు ఉదయం వెయ్యి మంది ఖురైష్‌లను ఎదుర్కొవలసి ఉంది".

వేకువ జామున ప్రవక్త వెలుపలికి వచ్చి విశ్వాసులతో కలసి ఉషోదయ నమాజు చేశారు. బద్ర్ బావులకు దగ్గరగా ఖర్జూర ఆకులతో ప్రవక్తﷺ కొరకు ఒక పొదరిల్లు ఏర్పాటు చేయటం జరిగింది.

సూర్యుడు ఉదయించిన వెంటనే అబూ జహల్ నేతృత్వంలో మక్కా సైన్యం బావులకు దక్షిణం వైపు దూసుకొని వచ్చింది. ముహమ్మద్ﷺ మొదటి సారి శత్రు సైన్యాన్ని, వారి అసంఖ్యాక బలగాన్ని చూశారు.


"అల్లాహ్!..ఓ అల్లాహ్! ఖురైష్‌లు గర్వంతో, అజ్ఞానంతో నీ ప్రవక్తﷺను

https://teluguislam.net

అబద్ధాలాడేవాడు అంటున్నారు. నీ మార్గంలో నడిచినందుకు వీరు నా అనుచరులపై యుద్ధం ప్రకటించారు. ఓ అల్లాహ్! నిన్ను ఆరాధించే ఈ కొద్ది మంది నాశనం అయి పోతే, నిన్ను ప్రార్థించటానికి ఏ ఒక్కడూ మిగలడు."

తన జీవితం మొత్తంలో ఇతర ఏ మనిషి మీద ఒక్కసారి కూడా చేయి ఎత్తని ముహమ్మద్ﷺ ఆ రోజు అల్లాహ్ సమక్షంలో కడు దీనంగా ప్రార్థించారు.

రెండు సైన్యాలు వరుసలో యుద్ధం చేసుకోవడానికి తయారయి ఎదురెదురుగా నిల్చుని ఉన్నాయి. ఖురైషీ దళపతులు ఆడంబరంగా కనిపించే కవచాలతో, డాలులతో అబూ జహల్ నాయకత్వంలో, ఎదురుగా ఉన్న చిన్న సైన్యాన్ని చూసి అవమానించే రీతిలో అరుస్తున్నారు.



"హుబల్ దేవుని సాక్షిగా! మేము మధ్యాహ్నానికి మిమ్మల్నందరినీ చంపేస్తాం" అని ఒకడు అరిచాడు.

"మీకు ధైర్యం అనేది ఏమన్నా ఉంటే చూపించుకోండి. లేదంటే మేము మిమ్మల్ని గద్దలకు ఎరగా వేస్తాం" ఇంకొకడు ప్రేలాడు.

ముగ్గురు ఖురైషీ అధిపతులు తల్వార్లను ఝుళిపిస్తూ, పెద్దగా అరుస్తూ

https://teluguislam.net

ముందుకు వచ్చి, " మీ ముఖాలను చూడనివ్వండి, ఎందుకంటే వాటిని మీ రక్తంతోనే మేము అలంకరిస్తాం" అని సవాలు విసిరారు.

వాళ్లకు ప్రతి చర్యగా ముగ్గురు మదీనా యువకులు ముందుకు దుమికి, వారి సవాలుకు ప్రతి సవాలును విసిరారు. "ఒక దేవుడు ఒక ధర్మం లేని వాళ్లు మీరు. మిమ్మల్ని నరకంలో నిప్పుల్లో కాలుస్తారు."

"ఎవరీ పసికూనలు? మేము అంత దూరం నుంచి వచ్చింది తల్వార్లు ఎండ బెట్టటానికో, మీ కథలు వినటానికో కాదు. మక్కా సైనికుల్లారా! అడుగు ముందుకు వేయండి" అబూ జహల్ కోపంగా అరిచాడు.

ప్రవక్త ﷺ సంజ్ఞతో అలీ తమ సైన్యం ముందుకు వచ్చి నిలబడ్డారు. ధైర్యస్తుడు, యోధుడు అయిన హమ్జా కూడా ఆయన వెంట ఉన్నారు. ముసలి వాడయినప్పటికీ ధైర్య సాహసములు కలిగిన ఉబైదా వారిని అనుసరించారు. ఆయన ప్రవక్త ﷺకు సమీప బంధువు.

వీరి వీరోచిత పోరాటం వలన క్షణాల వ్యవధిలోనే ముగ్గురు ఖురైషీ దళపతులు నేలకొరిగారు. కాని ఉబైదాకు కూడా గాయాలైనందున ఆయన్ని యుద్ధక్షేత్రం నుంచి వెలుపలికి తీసుకు వచ్చారు.

"నాకు ఇప్పుడు స్వర్గం సిద్ధిస్తుందా?" ఉబైదా ప్రవక్త ﷺను అడిగారు.

"తప్పకుండా ఉబైదా! మీరు ఖచ్చితంగా స్వర్గానికి వెళతారు" కళ్లనిండా నీళ్లతో, ఆయన్ని కౌగిలించుకుని ముహమ్మద్ ﷺ చెప్పారు.

అబూ జహల్ కోపంతో ఊగిపోయాడు. అతని ఆదేశాల మేరకు చనిపోయిన వారి స్థానాలలో మరో ముగ్గురు ముందుకు వచ్చారు. అలీ ముందుకు దుమికి తక్కువ సమయంలోనే ఇద్దరిని తుదముట్టించారు. దాహంతో ఉన్న తన కరవాలానికి మూడో అతనిని బలి తీసుకుని హమ్జా పెద్దగా అరిచారు, "నరకాగ్నిలో మీ సహచరులను కలవండి...పోండి."

'అందరం కలిసి యుద్ధం చేద్దాం' అనే ముహమ్మద్ ﷺ ఆజ్ఞ విని అబూ జహల్ నిశ్చేష్టుడై పోయాడు. ఇరువైపుల నుంచి యోధులు రణక్షేత్రంలోనికి దుమికారు. సూర్యుని వేడిమి శత్రువును దయారహితంగా కాల్చి వేస్తున్నది. దాహంతో ఖురైష్

https://teluguislam.net

సైనికులు ఎప్పుడు బద్ర్ బావుల వైపు రావడానికి ప్రయత్నించినా, అక్కడ రక్షణగా ఉన్న ముహమ్మద్ﷺ విలుకాళ్ల చేతిలో చనిపోయారు. ఖురైష్ సైన్యం మొత్తంగా దాడి చేసినప్పుడు, ముహమ్మద్ﷺ గుప్పెట నిండా మట్టి తీసుకుని వారి మార్గంలో విసిరారు. వాళ్ళంతా విస్తుపోయారు. ప్రవక్తﷺ పెద్దగా అరుస్తూ గుర్రాన్ని అధిరోహించి యుద్ధ రంగం మధ్యలోకి దూసుకుపోయారు.

ప్రవక్త తన సైన్యంతో, "జిబ్రయీల్... జిబ్రయీల్ దూత వెయ్యి మంది దైవ



దూతలతో శత్రు సైన్యం మీదకి వస్తున్నారు!" అని అన్నారు. అదే సమయాన ప్రవక్తﷺ వెనక నుంచి మండుతున్న పవనాలు లేచి ఇసుక మేఘాలుగా మారి ఖురైషుల ముఖాలను తాకాయి. ఆశ్చర్యంతో కళ్లు బైర్లు కమ్మిన శత్రువులు వెనక్కు వెనక్కు వెళ్లారు.

విశ్వాసులు విజయోత్సాహంతో, "అల్లాహు అక్బర్ (అల్లాహ్ అందరికంటే గొప్పవాడు!)" అన్నారు. స్వారీ చేసుకుంటూ యుద్ధక్షేత్ర ప్రధాన భాగానికి ప్రవక్త ﷺ చేరుకున్నారు. ప్రవక్త ముందు అబూ జహల్ గుడ్డిగా తన కరవాలాన్ని కోపంగా, కుడి వైపుకు ఎడమ వైపుకు ఝుళిపిస్తున్నాడు. ప్రవక్తﷺ అనుచరులు అతనిని గుర్రం మీద నుంచి కిందకు పడేసి చంపివేస్తున్న సమయంలో కూడా అతను ప్రవక్తﷺను

https://teluguislam.net

తిడుతూనే ఉన్నాడు.

"అబూ జహల్ చనిపోయాడు!"

ఈ వార్త వినగానే నిస్పృహతో, భయంతో, తమ ప్రాణాలు అరచేత పట్టుకొని మక్కావాసులు పారిపోయారు. బద్ర్ యుద్ధం ముగిసింది.

ప్రవక్త ﷺ ఒక పర్వతానికి చేరుకుని తల నేలకు ఆనించి ప్రార్థించారు, "అల్లాహ్ ఒక్కడే".

సూర్యుడు పశ్చిమాన అస్తమిస్తుండగా, యుద్ధంలో అమరులైన సహచరులను పూడ్చి ప్రవక్త ﷺ, విశ్వాసులు వారి కొరకు ప్రార్థనలు చేశారు. యుద్ధంలో చేజిక్కిన సొమ్మును అనుచరులు ప్రవక్త ﷺ వద్దకు తీసుకువచ్చారు. షరీయత్ చట్టాల ప్రకారంగా ఆ సొమ్మును సమానంగా పంచటం జరిగింది. చాలా మంది యుద్ధ ఖైదీలను తీసుకుని వచ్చారు. వారిని గౌరవంగా చూడాలని, విశ్వాసుల గుడారాలలో వసతి కల్పించాలని ముహమ్మద్ ﷺ ఆదేశించారు. ఖురైషుల ఒత్తిడి మూలంగా యుద్ధం చేసిన నిరుపేద ఖైదీలను తిరిగి మక్కాకు పంపించారు. ధనిక ఖైదీలను కూడా ఇస్లాంలోనికి ఆహ్వానించారు. కాని వారు అందుకు సమ్మతించలేదు. అప్పుడు వారిని తాము కలిగి ఉన్న ఆస్తుల విలువ ప్రకారం మూల్యం చెల్లించి తమను విడిపించుకోమని చెప్పారు.

ఒక్కొక్క ఖైదీని ప్రవక్త ﷺ ముందుకు వారి వారి అభిమతాన్ని ప్రకటించేందుకు వరుసగా తీసుకువస్తున్నారు.

" చూశారా...వీరి ప్రవర్తన?" కోపంగా ప్రతిఘటిస్తున్న ఒక ఖైదీని ముందుకు తోస్తూ హమ్జా పెద్దగా అరిచారు.

"ఇతను అబ్బాసే కదూ?! సొంత తమ్ముని కుమారునికే ద్రోహం చేశాడితను" అన్నారు హమ్జా ఆ ఖైదీని పట్టుకొని.

"హమ్జా! నన్ను పోనివ్వు. మంచి మనిషినైన నా పట్ల ప్రవర్తించే తీరు ఇదేనా? ఎక్కడో భయంకరమైన తప్పు జరిగింది. ఏమిటీ రాద్ధాంతం? నేనిక్కడకు మీ పరిస్థితులు తెలుసుకోవటానికి వచ్చాను గాని యుద్ధం చేయడానికి కాదు. నాకు తెలుసు, వాళ్లలో నేను చేరానని నువ్వు ఖచ్చితంగా నమ్మావు. కాని నిజానికి నేను విశ్వాసిని. నేను మరణించే వరకు నా తమ్ముని కుమారునికి విశ్వాసపాత్రునిగా ఉంటాను."

https://teluguislam.net

హమ్జా బిగిపిడికిలి నుంచి తప్పించుకోవడానికి పెనుగులాడుతూ, ప్రవక్త వైపు తిరగడానికి ప్రయత్నిస్తూ, బలవంతంగా కన్నీళ్లు పెట్టుకుంటూ పై విధంగా మాట్లాడారు అబ్బాస్.

"మీరు శత్రుపక్షంలో చేరారు" ప్రవక్తﷺ తలను పరికించి, వస్తున్న నవ్వును ఆపే ప్రయత్నం చేస్తూ ఆదేశాలను జారీ చేశారు, "తగిన మూల్యం చెల్లించాకనే ఈయన్ని వదిలిపెట్టండి."

"మూల్యమా! నీకు తెలుసు నేను పేదవాడినని, నిస్సహాయుడినని. కనుక ఈ మూల్యాన్ని గురించిన ప్రస్తావన మరిచిపోదాం. సొమ్ములు లేని నీ పెదనాన్నను విడిచిపెట్టు" అని అబ్బాస్ ఆశ్చర్యంగా, ఆందోళనగా అన్నారు.

"అది నిజమయినా కూడా, మాకు తెలుసు, మీరు మీ భార్య పేర ఎంతో ఆస్తిని జమ చేసి ఉంచారు" ముహమ్మద్ﷺ సమాధానంగా చెప్పారు.

"నా భార్య పేరు మీదనా..." ప్రవక్తﷺ కళ్లలోకి చూసే ధైర్యం లేక అబ్బాస్ ఏదో అన్నారు. హమ్జా ఇక సహించలేకపోయారు. అబ్బాస్‌ను లాక్కుంటూ దూరంగా తీసుకెళ్లిపోయారు. చివరికి అందరి లాగానే అబ్బాస్ కూడా తన పరిహారాన్ని ప్రకటించారు.

https://teluguislam.net

# 17. ఉహుద్ యుద్ధం

బద్ర్ యుద్ధం ముగిసి ఒక సంవత్సరం గడిచింది. ప్రవక్త(స)పై ఎంతో కోపం ఉన్న సమయంలో, ఆయనకు శత్రువు అయిన అబూ లహబ్, ఇటీవల మక్కాలో చనిపోయాడు. ప్రధానమైన మక్కా దళాధిపతులు, అబూ జహల్ లాంటి ముఖ్యులెందరో బద్ర్ యుద్ధంలో మరణించారు. అశ్విక దళానికి గొప్ప నాయకుడైన ఖాలిద్ మాత్రమే మిగిలారు. ఇదంతా జరిగి ఒక సంవత్సరం గడిచాక పగ ప్రతీకారాలు పెరిగి మక్కా ఖురైషులు ఇంకొక యుద్ధం కొరకు ఎదురు చూడసాగారు. ఎక్కువ మొత్తంలో సొమ్ములు సేకరించి, ఇంతకు ముందు కన్నా మూడురెట్లు శక్తివంతమైన సైన్యాన్ని తయారు చేయటం మక్కా నాయకుడు అబూ సుఫియాన్‌కు కష్టమైన పని కాదు.

మూడువేల మంది సాయుధ సైనికులు, ఖాలిద్ నాయకత్వంలో రెండువందల అశ్వికదళం, రక్త దాహంతో ఉన్న ఒక మహిళా సమూహం, కంజిర వాయిద్యాన్ని మోగిస్తూ, యుద్ధ గీతాలను ఆలపిస్తూ మక్కా నుంచి బయలుదేరటానికి సిద్ధమయ్యారు.

బయలుదేరే ముందు ఖాలిద్ ఒక కలగన్నారు. ఆ కలలో తన దళాన్ని ఒకసారి సమీక్షించుకున్నారు.

https://teluguislam.net

గుర్రాలను, యుద్ధ సామగ్రిని పరిశీలనగా చూసుకున్నారు. అద్భుతమైన కవచాన్ని తన కొరకు ఎంపిక చేసుకున్నారు. ఆ తరువాత విందులో పాల్గొనటానికి ఇతరులతో కలిసి కాబా గృహానికి వెళ్ళారు.

ఆ కార్యక్రమం నుంచి వెళ్ళిపోతున్న సమయంలో ముఖ ద్వారానికి పక్కనున్న దూలానికి ఆనుకొని, ఆయన దారికి అడ్డంగా ఒక కొత్త మనిషి నిలబడి ఉన్నాడు.

"నువ్వు రేపటి యుద్ధ ఫలితాలు తెలుసుకోవాలనుకుంటే ఇప్పుడు నేను చెప్పేది విను" అని కొత్త మనిషి అన్నాడు. ఆ కొత్త మనిషి ప్రవర్తన ఖాలిద్‌కు నచ్చింది. కాబా గృహంలో ఉంటున్నాడు కనుక భవిష్యత్తును గురించి అతనికి తెలిసివుంటుందని అనుకున్నారు. అతనిని చెప్పటం కొనసాగించమని సంజ్ఞ చేసారు.

"ఓ ఖాలిద్! రేపటి విజయం ఖురైషులదే. శత్రుసైన్యం వెనక్కు తిరిగి వెళ్ళిపోతుంది. ఇసుకరేణువులా నీ ముందు చెల్లాచెదురు అయిపోతుంది. కాని భవిష్యత్తులో నువ్వు దైవప్రవక్త ముహమ్మద్ﷺ పక్షాన పోరాడతావు. నీ కీర్తి అరేబియాలోనే కాదు దాన్ని దాటి సిరియా, పర్షియాలతో పాటు ఇంకా చాలా దేశాలలో మారుమోగుతుంది. అల్లాహ్ పక్షాన నిలబడ్డ గొప్ప యోధుడివిగా నువ్వు యావత్ ప్రపంచంలో కొనియాడబడతావు."

ఖాలిద్ ఇలా ప్రతిస్పందించారు, "నీకేమైనా పిచ్చి పట్టిందా! మన దేవుళ్ళ కొరకు నేను ముహమ్మద్ﷺకు, అతని మతానికి వ్యతిరేకంగా యుద్ధం చేస్తున్నాను. అంతేకాని ముహమ్మద్ కొరకు కాదు. ఇస్లాం నా శత్రువు."

ఆ కొత్తమనిషి ఖాలిద్ మాటలకు అంతరాయం కలిగిస్తూ, "ఇది నీకో సూచన లాంటిది. ముహమ్మద్ﷺ చనిపోయినట్లుగా ప్రకటన వస్తుంది. కాని అతను మరణించడు. అప్పుడు నీకు సత్యమేంటో బోధపడుతుంది. ఓ ఖాలిద్.... గొప్ప యోధుడా!" అని పిలిచాడు.

అతని మాటలతో ఖాలిద్ విస్తుపోయారు. అతనితో ఇంకా మాట్లాడాలని అనుకున్నారు. కాని ఆ కొత్తమనిషి రూపం ముఖద్వారం గుండా కాబావైపు నడుచుకుంటూ అదృశ్యమైపోయింది. అప్పుడు ఖాలిద్‌కు మెలకువ వచ్చింది.

ఖుబాలోని తోటలను, మొట్టమొదటి మసీదును ముహమ్మద్ﷺ సందర్శిస్తున్నారు. అబూ బక్ర్‌తో కలసి ఎడారి గుండా సుదీర్ఘ ప్రయాణం చేసిన తరువాత ఎంతో ప్రేమగా అక్కడ మొదటి మసీదు కొరకు ప్రవక్తﷺ పునాదిరాయిని వేసారు. అక్కడ

https://teluguislam.net

నమాజ్‌లు చేయించటం పూర్తయ్యాక, ముహమ్మద్ﷺ ఖుర్ఆన్ వాక్యాలతో విశ్వాసులను సంబోధించారు.

"పూర్వం ఇస్రాయీల్ జాతివారు గోలియత్ పైకి, అతని సైన్యం మీదికి దండెత్తి పోబోయే ముందు చేసుకున్న ప్రార్థన:

ఓ అల్లాహ్! మాలో విశ్వాసం తగ్గకుండా చూడు. యుద్ధంలో మా అడుగులు దృఢంగా ఉండేటట్లు చేయి. విశ్వాసాన్ని నిరాకరించే వాళ్ళ నుంచి మమ్మల్ని కాపాడు."

అల్లాహ్ దయ వలన అతి కొద్దిమంది ఇస్రాయీలీలు వాళ్ళను తుదముట్టిం చారు. దావూద్ గోలియత్ దుర్మార్గుణ్ణి వధించారు.... అల్లాహ్ గనక విశ్వాసం కలిగిన మనుషులతో ఇతర మనుషులను నియంత్రించకపోతే ఈ ప్రపంచమంతా ఖచ్చితంగా హానికరమై పోయేది.

ప్రవక్తﷺ ప్రసంగం ముగిసాక విశ్వాసులంతా గుండ్రంగా కూర్చుని ఆయనతో పాటు పాలు, ఖర్జూరపండ్లను పంచుకొని తిన్నారు.

ప్రవక్తﷺ ఖుబాను వదిలి పోవడానికి సిద్ధమవుతుండగా ఒక సందేశదూత హడావిడిగా ఆయన్ను చేరి ఒక లేఖను అందించాడు. తెరిచి ఉన్న ఆ లేఖను ప్రవక్తﷺకు వినిపించాడు. అందులో ఇలా ఉంది:

" నా ప్రియ కుమారా!

నువ్వు ఇప్పటికన్నా తెలుసుకుంటావు. నీ ముసలి పెదనాన్న మోసగాడు కాడని. ఇది చాలా ముఖ్యమైన విషయం. నేను ఆషామాషిగా రాయటం లేదు. మక్కా వాసులు మూడు వేల మంది సైన్యంతో మీతో యుద్ధం చేయడానికి సిద్ధమయ్యారు. మిమ్మల్ని ముందుగా హెచ్చరించడానికే ఈ విషయాన్ని మీ దృష్టికి తీసుకుని వస్తున్నాను. విజయం మిమ్మల్ని వరించుగాక!

ఇట్లు

**మీ బాబాయి, అబ్బాస్"**

ఖస్వా మీద ప్రవక్తﷺ తిరిగి మదీనాకు బయలుదేరారు. స్వారీ మూలంగా ఏర్పడిన దుమ్ముల మేఘాలను చీల్చుకుంటూ ఆయన వెళ్ళిపోయారు.

https://teluguislam.net

మరుసటి రోజు ఉదయాన్నే, మదీనా విశ్వాసుల్లోని పెద్దలకు, యువకులకు మధ్య గొప్ప చర్చ జరిగింది. ప్రవక్త ﷺ ఇలా సూచన చేసారు, 'మనం నగరంలోనే ఉందాం. ఇంటి కప్పుల మీద నుంచి బాణాలతో, రాళ్ళతో దాడి చేద్దాం. మీరేమంటారు?"

పెద్దలంతా అంగీకరించారు.

"మనం నగరంలోనే ఉంటే, ఖురైషులు యుద్ధం వదిలేసి పారిపోతారు" అంటూ అబూ బక్ర్ హేతుబద్ధంగా వాదించారు.

అల్లాహ్ ఎల్లప్పుడు తమ వెంట ఉంటాడని అలీ, హమ్జా, ఉమర్‌లు, బద్ర్ యుద్ధం తరువాత గట్టిగా నమ్ముతున్నారు. ఈ యుద్ధంలో ప్రవక్త ﷺ వైపు ఉండే ఏడువందల మంది యుద్ధ విద్యల్లో ఆరితేరిన మూడువేల మంది ఖురైష సైన్యాన్ని సైతం నిలువరించగలరని వారి విశ్వాసం.

"మనం కనుక పిరికి ఆడవాళ్ళ మాదిరి నగరంలోనే ఉండి శత్రువును ఎదుర్కొంటే, మనల్ని చూసి నవ్వుకోవటానికి, అరేబియాకు మంచి హాస్యం దొరికినట్లే. నన్ను చూశారా?! రుమాలు నిండా ఖర్జూరపు విత్తనాలు కట్టుకుని వంటగదిలో దాక్కుని శత్రువుల మీదకు విసిరి కొట్టడానికి సిద్ధంగా ఉన్నాను కదా!" హమ్జా అన్న ఆ మాటల వెటకారానికి యువకులంతా పగలబడి నవ్వారు.

కొద్ది సేపటి తరువాత యుద్ధ వేషధారణలో ప్రవక్త ﷺ తన నివాసం నుంచి వెలుపలికి వచ్చారు. ఆయన వక్షం, వీపు మెరుస్తున్న కవచాలతో నిండివుంది. భుజానికి తగిలించిన డాలుతో, ఒక పక్క కరవాలంతో ఉన్నారు. ఆయన చేతిలో విల్లు, తలకు నల్లని వస్త్రంతో చుట్టిన పగడీ ఉంది.

హమ్జా చిన్నగా దగ్గి, ఎంతో వినయంగా చూపును కిందకు దించి, "ఓ దైవప్రవక్తా ﷺ ! విగ్రహారాధకులకు వ్యతిరేకంగా యుద్ధానికి పోవటంలో మనం చాలా త్వరపడుతున్నామేమో, బహుశా మనం ఇంకోసారి ఆలోచించాలేమో!

"అవసరం లేదు. వేసుకున్న కవచాలను తిరిగి తొలగించడం దైవప్రవక్త ﷺ కు తగదు" అని చెబుతూ తెల్లటి ఇస్లాం జెండాను ముస్‌అబ్ చేతికిచ్చి, తన అశ్వాన్ని అధిరోహించి అనుచరులకు నాయకత్వం వహిస్తూ నగరం నుంచి ప్రవక్త ﷺ బయలుదేరారు.

ఉహుద్ పర్వతం గంభీరంగా నిలబడి ఉంది. దాని దిగువ మైదానాలకు అభిముఖంగా ప్రవక్త ﷺ సహచరులు నిలబడి ఉన్నారు. వారి వెనుక ఆ పర్వతం ఉన్నది.

https://teluguislam.net

సైన్యానికి వెనుక ఒక కనుమ దగ్గర విలుకాళ్ళను మోహరించి, "ఏమి జరిగినా సరే మీరు ఈ గుట్ట నుంచి కదలొద్దు. ఈ వెనుక ప్రాంతాన్ని మీరే సంరక్షించాలి" అంటూ ప్రవక్త(స) ఆదేశం జారీ చేసారు.

కొంతమందికి సంశయం ఉన్నప్పటికీ, విలుకాళ్ళంతా ఆ పర్వతగుట్ట వెనక్కి వెళ్ళారు. "మనల్ని ఇక్కడ నియమించడం బాగానే ఉంది. కాని శత్రువుల సొత్తు ఏదన్నా చేజిక్కించుకోవడంలో మాత్రం మనమే చివరి వాళ్ళం అవుతాం" అని వాళ్ళలో ఒకతను గొనుక్కుంటున్నట్లు అన్నాడు.

"నువ్వేం మాట్లాడుతున్నావో ఒకసారి ఆలోచించు. దండయాత్రలు చేసి సొమ్ములు లాక్కోవడం మన లక్ష్యం కాదు. అల్లాహ్ కొరకు అవిశ్వాసులకు వ్యతిరేకంగా పోరాడటమే మన లక్ష్యమని గుర్తుంచుకో" అని అతని సహచరుడొకడు అన్నాడు.

ఈ లోపు ఖురైషు స్త్రీలు ఆలాపిస్తున్న యుద్ధగీతాలతో, వాయిద్య సంగీతాలతో ఆ మైదానమంతా ప్రతిధ్వనించింది. ఒక ఎత్తైన ఒంటె మీద వికృత ఆకారంలో ఉన్న హుబల్ విగ్రహాన్ని అనుసరిస్తూ మక్కా సైన్యపు కవాతు చేస్తున్నది. అది రంగు రంగుల్లో, అద్భుతంగా ఉవ్వెత్తున లేచే కెరటంలా ఉంది. ఖురైషు సైన్యములోని బలమైన దళం మక్కా సైనికులకు ముందుండి నడుస్తున్నది.

అలీ కరవాలం ఎండ కాంతిలో ఒకసారి మెరిసింది. వెంటనే తెగిన ఒక తల ఇసుకలో దొర్లింది. ఇంకో ముగ్గురు మక్కావాసులు యుద్ధక్షేత్రంలో ముందుకు ఉరికారు. తమ విశ్వాసాన్ని, సంకల్ప బలాన్ని పూర్తిగా ఉపయోగిస్తూ శత్రువు మీదకి దాడి చేస్తున్నారు. సింహాల మాదిరి శక్తిని, ధైర్యసాహసాలను ప్రదర్శిస్తూ యుద్ధ క్షేత్రంలో వీరోచితంగా ముందుకు నడుస్తున్నారు. 'అల్లాహు అక్బర్' అనే నినాదాలు, కరవాలాల ఉక్కు శబ్దాలతో ఆ ప్రాంతమంతా ప్రతిధ్వనించింది. వారి శక్తి ముందు నిలువలేక ఖురైషులు వెనక్కు తగ్గారు.

వేగంగా పరిగెత్తగల తన గుర్రం మీదకు ఖాలిద్ ఎక్కి కూర్చుని మొత్తమంతా పరిశీలిస్తూ, నిరీక్షిస్తున్నాడిరి. విశ్వాసులు యుద్ధం చేసుకుంటూ మక్కా స్థావరాల వరకు చేరుకున్నారు. ఖురైషులు ఇంకా వెనక్కు వెళ్ళిపోయారు. విశ్వాసుల్లో విజయోత్సవ కేకలు మార్మోగాయి.

https://teluguislam.net

విలుకాళ్ళు ఇంకా, ఎత్తైన ఆ పర్వత గుట్ట వెనుకే ఉన్నారు. వారి ధ్యాసంతా ఖురైషు సైన్యపు సంపద మీదే ఉన్నది.

"ఇంకెందుకు ఆలస్యం? విజయం మనదే, శత్రు సంపద మనదే" ఎవరో అన్నారు. అనగానే అందరూ కిందికి దిగి తమ వాటాను చేజిక్కించుకోవటానికి ఖురైషు స్థావరాలకు చేరుకున్నారు.

వీరి కదలిక అప్రమత్తంగా పరిశీలిస్తున్న ఖాలిద్ దృష్టిలో పడింది. వెంటనే ఆయన తన దళాన్ని ఉద్దేశించి, "పదండి, దాడి చేయండి " అని పెద్దగా అరిచారు. వాళ్ళంతా గుండ్రంగా తిరిగి విలుకాళ్ళు వదిలి వెళ్ళిన గుట్ట స్థావరాన్ని ఆక్రమించుకుని ప్రవక్త సైన్యం వెనుక భాగానికి చేరారు. అంతే; విశ్వాసులంతా ఎడాపెడా ఖాలిద్ మనుషుల ఈటెలకు, జంతువుల కాళ్ళకు బలయ్యారు. ఈ ఆకస్మిక పరిణామానికి భయకంపితులై, తమ ప్రాణాలు కాపాడుకోవటానికి విశ్వాసులు పరుగులెత్తారు. మారిపోయిన పరిస్థితులను చూసి ఖురైషులు రెట్టించిన ఉత్సాహంతో దాడులు చేస్తూ ముందుకు సాగారు. వారిలో ఒకడు ముస్అబ్‌ను నరికేశాడు. ముస్అబ్ వీరమరణం పొందారు. ఆ ఖురైషీయుడు ముస్అబ్‌ను ప్రవక్తగా భావించి పెద్దగా అరిచాడు.

"నేను ముహమ్మద్ﷺను చంపేశాను! ముహమ్మద్ﷺ చనిపోయారు!"

ఈ మాట విని చాలా మంది విశ్వాసులు భవిష్యత్తుపై ఆశలు వదులుకుని యుద్ధరంగం నుంచి పారిపోవటం ప్రారంభించారు.

"మీరంతా ఎక్కడికెళ్తున్నారు? నేను దైవప్రవక్తﷺను. బ్రతికే ఉన్నాను. వెనక్కి రండి" పెద్దగా పిలిచారు ప్రవక్తﷺ. కాని వాళ్ళు అప్పటికే వినపడనంత దూరం వెళ్ళి పోయారు.

ఈ అవకాశాన్ని ఖురైష్ యోధులు వదిలి పెట్టలేదు. దాడి చేశారు. అలీ, ఉమర్‌లు అడ్డుపడినప్పటికీ ప్రవక్తﷺ కిందపడ్డారు. తలకు, ముఖానికి గాయాలైనాయి. అలీ, అబూ బక్ర్, ఉమర్‌లు ప్రవక్తﷺను ఒక రహస్య స్థావరానికి మోసుకుని తీసుకెళ్లారు. ఖురైషియులు విజయాన్ని వరించిన భావనలో స్వారీ చేసుకుంటూ వారి స్థావరాలకు చేరారు. అబూ సుఫియాన్ ఒక్కడే ఉండి పోయాడు. అతను యుద్ధ క్షేత్ర మంతా కలియ చూశాడు. "ముహమ్మద్ﷺ ఎక్కడ? అలీ, ఇతరులు ఎక్కడ? ఓ హుబల్! నీ శక్తిని చూపించావు. ఈ రోజు బద్ర్‌కు ప్రతీకారం జరిగింది" అతను శూన్యంలో అరిచాడు.

https://teluguislam.net

రాళ్ల గుట్ట వెనక నుంచి ప్రతిధ్వనిలా ఉమర్ అన్నారు.

"చనిపోయిన మా వాళ్లు స్వర్గంలో ఉన్నారు. మీ వాళ్లు నరకంలోని నిప్పుల్లో ఉన్నారు".

"మేము ముహమ్మద్ﷺను చంపేశామా?" అబూ సుఫియాన్ అరిచాడు.

"అల్లాహ్ దయ వలన లేదు. నీ అరుపుల్ని ఆయన వింటున్నారు" ఉమర్ ప్రతిస్పందించారు.

"వచ్చే సంవత్సరం మేము నిన్ను బద్ర్‌లో కలుస్తాం" అబూ సుఫియాన్ తిరిగి చెప్పాడు. నిదానంగా స్థావరానికి చేరుకుని ఖాలిద్‌ను కలిసి ఆయనతో అన్నాడు, "నువ్వు, నీ శక్తిమంతమైన దళం కలిసి మనకు ఈ రోజు విజయాన్ని చేకూర్చి పెట్టారు".

"ముహమ్మద్ﷺ చనిపోయినట్లు వాళ్ళు ప్రకటించారు. కాని అతను చనిపోలేదు. నువ్వు అతనిని ఎందుకు చంపలేదు?" అని ఖాలిద్ అడిగారు.

చాలాసేపటి వరకు అబూ సుఫియాన్ మౌనంగా ఉండిపోయాడు. చివరికి "నాకు తెలియదు" అని చెప్పాడు. "కాని వచ్చే సంవత్సరం బద్ర్‌లో నీ ఖడ్గం అతనిని ఖచ్చితంగా హతమారుస్తుంది" అని అన్నాడు.

ఖాలిద్ మౌనంలోకి వెళ్ళిపోయారు. "ఖాలిద్ బిన్ వలీద్ 'అల్లాహ్ ఖడ్గం" అన్న ఆ అపరిచితుని గొంతు ఆయన తిరిగి విన్నారో లేక దాని గురించి ఊహించుకున్నారో.

మంచి వేటగాడయిన హమ్జాను, మదీనాలో ప్రప్రథమ ఇస్లాం బోధకులైన ముస్‌అబ్‌ను ఉహుద్ ప్రాంతంలోని మైదానంలో సమాధి చేశారు.

"మీరు అల్లాహ్ వద్ద నుండే వచ్చారు, తిరిగి అక్కడికే చేరుకుంటారు. ఇంత కాలం కష్టమును సహించి ఓర్పు వహించినందుకు మీకు శాంతి చేకూరు గాక! ఇకపై కూడా అల్లాహ్ అనుగ్రహం మీపై ఉండుగాక!" అని ప్రవక్తﷺ ప్రార్థించారు.

ప్రవక్తﷺను ఆయన కూతురు ఫాతిమా సమాధుల నుంచి అనునయంగా దూరంగా తీసుకెళ్ళారు. వారితో పాటు అనుచరులు కూడా తరలి వచ్చారు. తండ్రి గాయాలకు సపర్యలు చేయడానికి, చనిపోయిన వారిని సమాధి చేసే పనులు చూడటానికి ఫాతిమా అక్కడికి వచ్చారు.

https://teluguislam.net

అలసిపోయిన యోధులంతా మదీనాలో ప్రవేశించేసరికి వాళ్ళకు స్త్రీల ఏడుపులు, రోదనలు వినిపించాయి. యుద్ధంలో చనిపోయిన విశ్వాసుల గురించి వాళ్ళు దుఃఖిస్తున్నారు.

"హమ్జా... పాపం హమ్జా! ఆయనపై దుఃఖించటానికి ఎవరున్నారు?" ముహమ్మద్ﷺ బాధగా అన్నారు.

ఆ రాత్రి ప్రవక్తﷺ పడుకుని ఉన్న సమయంలో ఆయనకు ఒక స్త్రీ మసీదు ప్రాంతంలో బిగ్గరగా రోదిస్తున్నట్లు వినిపించింది. పక్క మీద నుంచి లేచి మసక వెలుతురులో హమ్జా మరణం గురించి రోదిస్తున్న ఒక మదీనా స్త్రీను ఆయన చూశారు.

ఆ ఉదయాన్నే ప్రవక్తﷺ, ఆయుధాలు తీసుకొని తనతో బయలు దేరమని అనుచరులకు ఆదేశించారు. విశ్వాసులు ఖురైషులను వెంబడించటానికి బయలు దేరారు. శత్రుస్థావరానికి చేరుకునే సరికి చీకటి పడింది. శత్రువులకు కనిపించేటట్లు అయిదు వందల కాగడాలను వెలిగించమని ప్రవక్తﷺ తన అనుచరులకు చెప్పారు.

'హుబల్ దేవుడా! మమ్మల్ని రక్షించు. ముహమ్మద్ﷺ ఒక పెద్ద సైన్యంతో మళ్ళీ తిరిగి వచ్చాడు' అని అబూ సుఫియాన్ అరుస్తూ అన్నాడు, కాగడాల జ్వాలలతో ఒక పెద్ద కొండే మండుతున్నట్లు అతనికి అనిపించింది.

ప్రవక్తﷺ అనుకున్న విధంగానే జరిగింది. చాలా తక్కువ సమయంలోనే అబూ సుఫియాన్ దళం మోకరిల్లింది.

తిరిగి మదీనా చేరి ప్రవక్తﷺ, విశ్వాసుల సమావేశంలో ఈ విధంగా ప్రసంగించారు:

"అల్లాహ్ పరీక్ష లేకుండానే స్వర్గం ప్రాప్తిస్తుందని మీరు భావిస్తున్నారా! అల్లాహ్ కొరకు ఇప్పటిదాకా భయంకరమైన యుద్ధం చేశారు. మీరు ఇంకా దృఢంగానే ఉన్నారు కదా! ముహమ్మద్ﷺ ఒక దైవప్రవక్త తప్పించి మరేమి కాదు. తనకు ముందు ఎంతో మంది ప్రవక్తలు గతించారు. ఒకవేళ తను చనిపోతే లేదా చంపివేయబడితే, మీరంతా వెనుకంజ వేస్తారా...? అల్లాహ్ అనుజ్ఞ లేకుండా ఏ జీవీ చనిపోజాలదు."

ఆ రాత్రి మసీదు ప్రాంగణంలో ఉమర్ ఎంతో కోపంతో, దుఃఖంతో ఉన్నారు.

"మనం విజయానికి చేరువలో ఉండగా మీరు ప్రవక్తﷺ ఆదేశాలను ఉల్లంఘించారు. విగ్రహారాధకులకు వ్యతిరేకంగా అల్లాహ్ ప్రసన్నత కోసం యుద్ధం

https://teluguislam.net

చేస్తున్నారన్న విషయం కూడా మీరు మర్చిపోయారు. స్వార్థంతో, సంపద కోసం నిర్లక్ష్యంగా ప్రవర్తించారు. గుడ్డివాళ్ళయిపోయి ప్రవక్త్ ఆదేశాలను పెడచెవిన పెట్టారు. మీకు సహాయం చేద్దామని వచ్చిన దైవదూతలు సైతం విసుక్కుని వెళ్ళి పోవటంలో ఆశ్చర్యమేమి లేదు. దీన్ని ఒక గుణపాఠంగా తీసుకుంటే: అల్లాహ్ ఆజ్ఞను ఉల్లంఘించి స్వార్థ ప్రయోజనాన్ని ఎవరైతే ప్రధానంగా భావిస్తారో వాళ్ళు విగ్రహా రాధకుల లాంటి వాళ్ళే. వాళ్ళకు నాశనం తప్పదు".

వీరోచితమైన, నమ్మకమైన విశ్వాసుల ఆలోచనలను ఉమర్ మాటలు ప్రతిబిం బించాయి. ఆ మాటలన్నాక ఉమర్ చీకటిలోకి నడుచుకుంటూ వెళ్ళిపోయారు.



https://teluguislam.net

# 18. కందక యుద్ధం

ఉహుద్ యుద్ధం తరువాత ప్రవక్త ﷺకు, విశ్వాసులకు కొన్ని నెలల పాటు కష్టకాలం నడిచింది. "అల్లాహ్ ఒక్కడే" అన్న సందేశాన్ని ప్రచారం చేస్తున్న సమూహం మీద రెండుసార్లు ఆకస్మిక దాడులు జరిగాయి. ప్రవక్త ﷺ హత్యకూ కుట్రలు జరిగాయి. ఇస్లాంను వ్యతిరేకించే మక్కాలోని ఇతర తెగలకు – ఖురైషులకు మధ్య రహస్య సంబంధాలు, ఒప్పందాలు నెలకొన్నాయి. అయినా ఇస్లాంలోనికి నిత్యం కొత్తగా చేరే వాళ్ళు చేరుతూనే ఉన్నారు.

ఒక సంవత్సరం గడిచింది. బద్ర్‌లో కలవాల్సిన సమయం వచ్చేసింది. కాని అబూ సుఫియాన్ అక్కడికి చేరుకోలేదు. కరువు వలన గుర్రాలు, ఒంటెలు రావడం అసాధ్యమైపోయింది. ప్రవక్త ﷺ మాత్రం తన మనుషులు పదిహేను వందల మందితో మదీనాకు చేరుకున్నారు. అటు అబూ సుఫియాన్ కూడా ముస్లింలపై దాడులకు వ్యూహాలు రచిస్తూ ఉన్నాడు.

గడిచిన సంవత్సరమంతా అబూ సుఫియాన్ బలమైన తెగలతో సంబంధాలు నెలకొల్పుకొని పదివేల మంది సైన్యాన్ని తయారు చేసాడు. అతను మదీనా యూదులతో కూడా రహస్య అవగాహన చేసుకున్నాడు. ప్రవక్త ﷺకు మూడు వేల మంది సైనికులు, ఒక చిన్న దళం మాత్రమే ఉన్నాయి. ఈ సారి మదీనా రక్షణ

https://teluguislam.net

బాధ్యత తాము తీసుకుంటామని ప్రవక్త ప్రకటించారు.

అబూ సుఫియాన్ సైనికులు బయలుదేరి వస్తున్న సమయానికి ప్రవక్త ﷺ తన సహచరులను సమావేశపర్చారు. అబూ బక్ర్, ఉమర్, అలీ, జైద్‌లు మస్జిదు ఆవరణలో ప్రవక్త ﷺ కు సమీపంగా ఉన్నారు. యువకులు మర్యాదపూర్వకంగా కొద్ది దూరంలో ఉన్నారు.

ప్రవక్త ﷺ సంజ్ఞ చేయగా ఉమర్ వారి పరిస్థితిని వివరించారు. నగరానికి ఉత్తరం దిక్కున పొడువాటి కొండలు రక్షణగా ఉన్నాయి. తూర్పు దిక్కున ఇండ్లతోనే నిర్మించిన ఒక పటిష్టమైన కోట గోడ రక్షణగా ఉంది. దక్షిణం, ఆగ్నేయ మూల మాత్రం దాడి చేయడానికి వీలుగా ఖాళీగా ఉంది. తోటలకు, ఒయాసిస్సులకు వెళ్ళే అక్కడి రోడ్లు శత్రు దాడులకు బార్లా తెరచుకుని ఉంటాయి. కనుక సమస్యల్లా నగరాన్ని ఈ వైపు నుంచి ఎట్లా రక్షించుకోవాలన్నదే.

అబూ బక్ర్, అలీ, జైద్‌లు ఈ విషయం గురించి చర్చించారు. కాని కొద్ది సేపటికే నిశ్శబ్దమైపోయారు. ఎవరికీ ఏ పరిష్కారమూ తట్టలేదు.

"ఓ దైవప్రవక్తా ﷺ ! మీ ముందు నిలబడి మాట్లాడే సాహసం చేస్తున్నందుకు నన్ను క్షమించాలి. కాని మీ సమస్యను నేను పరిష్కరించగలను" అని ఒక యువకుడు అన్నాడు.

ప్రవక్త ﷺ తల పైకెత్తి ఆ మాట్లాడిన అతని వైపు చూసారు. అతని పేరు సల్మాన్, పర్షియా దేశస్తుడు. ఇటీవలే అతనికి బానిసత్వం నుంచి స్వేచ్ఛ లభించింది, ఇస్లాం స్వీకరించినప్పుడు.

"మరైతే చెప్పు సల్మాన్; సిగ్గు పడమాకు. మాకు సలహా అవసరం ఉంది"– ప్రవక్త ﷺ ప్రతిస్పందించారు.

"నాకు బాగా గుర్తు. నా చిన్నప్పుడు మా దేశంలో మా నగరం మీద తరచూ ముట్టడులు జరిగేవి. మేము అవసరం ఉన్నంత మేరకు పొడవాటి గుంటను తవ్వి, శత్రువులు ప్రవేశించకుండా నిరోధించేవాళ్ళం. అదే పని మనం మదీనాకు దక్షిణాన, ఆగ్నేయాన చేయటం అసాధ్యమేమీ కాదు."

"అద్భుతమైన ఆలోచన! మేము, అరబ్బులము. ఎప్పుడూ శత్రువులతో ముఖాముఖి యుద్ధం చేస్తుంటాం. మేమెప్పుడూ ఆటువంటి నైపుణ్యాన్ని ప్రదర్శించలేదు." ఇంతకుముందు ఎన్నడూ వినని ఈ విషయాన్ని విని అబూ బక్ర్ నిర్ఘాంతపోయి అన్నారు.

https://teluguislam.net

"నైపుణ్యమో కాదో కాని ఆలోచన మాత్రం బ్రహ్మాండం;" ఉమర్ అన్నారు.

"అల్లాహ్ కృప నీ మీద ఉండుగాక సల్మాన్! మంచి సలహా ఇచ్చావు. ఆ గుంటను తయారు చేసే బాధ్యతను నీకే అప్పగిస్తున్నాను" అంటూ ప్రవక్త ﷺ ముగించారు.

ఆ పని వెనువెంటనే ప్రారంభమయింది. ప్రవక్త ﷺ గడ్డపార పట్టుకుని, ఎటువంటి సంశయం లేకుండా కందకానికి మొట్టమెదటి తవ్వకాన్ని ప్రారంభించారు. కందకం తవ్వకంలో మనుషులను ఏర్పాటు చేయడంలో సల్మాన్ నిర్వాహణ బాధ్యతను తీసుకున్నారు. ఎండ వేడి తమ శరీరాలను కాలుస్తున్నా అబూ బక్ర్, ఉమర్, అలీ, జైద్‌లు కందకాన్ని తవ్వుతూ, మట్టిని మోస్తూ విపరీతమైన శ్రమ చేసారు. పగటిపూట ఒక్క క్షణం కూడా వృథా కానివ్వలేదు. గునపాలు, గడ్డపారల శబ్దాలతో పాటు ప్రవక్త పాట వారిని శ్రమలో మైమరచేటట్లు చేసింది.

విశ్వాసులం, వలసవాసులం
సహాయం కోసం ఓ అల్లాహ్!
నీ వైపుకే మరలాం
మాకు బహుమతి నీ స్వర్గం....

విశ్వాసులంతా వంత పాడారు-

ప్రవక్త వెంటే మేముంటాం
విశ్వాసాన్ని, వినమ్రతను చాటుతాం
ఆయన శత్రువుతో పోరాడుతాం
అల్లాహ్! చావుకు మేమెన్నడూ
వెనుకంజ వేయం....

మదీనా ప్రజల్లో కొంత మందిని 'కపటులు' అని ప్రవక్త ﷺ పిలిచేవారు. వాళ్ళు అల్లాహ్ పట్ల, ప్రవక్త ﷺ కార్యక్రమాల పట్ల పైకి విశ్వాసాన్ని ప్రకటించే వాళ్ళు. కాని వాళ్ళలో వాళ్ళు చాటుగా ప్రవక్త ﷺను అపహాస్యం చేయటం, విమర్శించటం చేసే వాళ్ళు.

"అటువంటి ఒకతను ఇప్పుడు పోతున్నాడు చూడు" అని అలీ జైద్‌తో అన్నారు.

https://teluguislam.net

"నీకెట్లా తెలుసు?" జైద్ అలీని అడిగారు.

"అతను గడ్డపారను కింద పడేసి ప్రవక్త ﷺ అనుమతి తీసుకోకుండానే వెళ్ళిపోయాడు, చూశావా?" అలీ సమాధానం చెప్పారు.

కందకం పని దాదాపుగా పూర్తవుతున్న సమయానికి ఖురైషి సైన్యం మదీనా మైదానంలో ప్రత్యక్షమైంది.

ప్రవక్త మనుషులు వెంటనే అప్రమత్తమైపోయి వారి వారి స్థానాల్లో నిలబడ్డారు. కందకం వెనుక భాగం నుంచి విలుకాళ్ళు తమ తమ స్థానాలను తీసుకున్నారు.

"దాడి చేయండి" అని అబూ సుఫియాన్ అరిచాడు. మక్కా దళం దాడి చేసింది. ఒక చోట ఆగిపోయింది.

"దాడి చేయండి" అని అతను మళ్ళీ పురమాయించాడు. అప్పుడు అక్కడ ఉన్న కందకాన్ని చూసి అతను ఆశ్చర్యంతో మూగబోయాడు. "ఇదేమి యుద్ధ రీతి?" ఖాళీగా ఉన్న కందకాన్ని చూసి అరిచాడు. అతని అరుపుకు సమాధానంగా బాణాలు గుంపుగా బయటకు వచ్చాయి.

"మేము ఆటలాడుకోవడానికి ఇక్కడికి రాలేదు, ముహమ్మద్ ﷺ! బయటికి వచ్చి యుద్ధం చేయి."

ఇంకో బాణాల సముదాయం అతని సవాలును పరామర్శించింది. ప్రతి రోజు అదే పద్ధతిలో యుద్ధం జరిగింది, ఖురైషులు అవమానించే మాటలు అనడం, విశ్వాసులు వాటికి బాణాలతో జవాబులివ్వడం.

ఈలోపు ప్రవక్త ﷺ ఆలోచనల్లో పడ్డారు. మదీనా నగరానికి చెందిన ఒక యూద తెగ ఖురైషుల నుంచి లంచాలు పుచ్చుకునే ఆలోచన చేస్తున్నట్లు ఆయనకు తెలిసింది.

ఆ తెగ మదీనా వెనుక ప్రాంతాన్ని రక్షించే బాధ్యతలో ఉన్నది. తన అనుచరులు మరీ ముఖ్యంగా మదీనా సహాయకులు (అన్సార్లు) ఈ తీవ్రమైన దాడిని ఎక్కువ కాలం ఎదుర్కోలేరని ముహమ్మద్ ﷺ భావించారు. దానికి సంబంధించి తనకు కలిగిన ఒక ఆలోచనను ఆయన అనుచరులతో పంచుకున్నారు. "మన ఖర్జూర పంటలో మూడింట ఒక వంతు పంటను అబూ సుఫియాన్ తెగలోని ఒక తెగకు ఇస్తే వాళ్ళు ఇళ్ళకు వెళ్ళిపోతారా?"


ఇది విని అంకితభావం గల ఒక అనుచరుడు అడిగాడు, "దీన్ని మీరు అల్లాహ్ ఆజ్ఞ మాదిరి ప్రతిపాదిస్తున్నారా... లేక ఇది మీ సొంత వ్యక్తిగత ఆలోచనా..?"

https://teluguislam.net

ప్రవక్త చిరు నవ్వు నవ్వి అన్నారు, "ఇది అల్లాహ్ ఆదేశమైతే నేను మీ సలహా అడిగి ఉండేవాడిని కాదు. ఈ విపత్కర పరిస్థితి నుంచి బయటపడటానికి నా వరకు నేను చేసిన ఆలోచన ఇది."

'ఓ దైవప్రవక్తా ﷺ! మేము విగ్రహారాధకులుగా ఉన్నప్పుడు కూడా మా ఖర్జూర పంటను దేనికోసమూ వారికి ఇవ్వలేదు. ఇప్పుడు మనల్ని నిజమైన విశ్వాసం నడిపిస్తుండగా మన పంటను వాళ్ళ చేతుల్లో వేయాలా? వాళ్ళకు ఖర్జూరం కావాలనుకుంటే వాటి కొరకు వాళ్ళను యుద్ధం చేసుకోనిద్దాం". తన ప్రతిపాదనకు స్పందనగా ఒకతను చెప్పిన మాటలు విని మెరుస్తున్న ముఖంతో ప్రవక్త ﷺ తన ఆమోదాన్ని తెలియజేశారు.

చివరికి ఒక రోజున అబూ సుఫియాన్‌కు ఇక చాలనిపించింది. "హుబల్ సాక్షిగా! మనం ఈ కందకాన్ని దాటగలం. ఆమిర్! అత్యంత వేగవంతమైన, చురుకైన



నీ గుర్రాన్ని తీసుకొని దాని మీద గాలిలో పక్షి మాదిరి కందకానికి అటువైపు ఎగురు." గుర్రపు స్వారీలో మహా యోధుడయిన ఆమిర్‌ను పిలిచి అబూ సుఫియాన్ అన్నాడు.

https://teluguislam.net

కొన్ని ప్రయత్నాల తరువాత ఆమిర్ గుర్రం ఆ పని చేయగలిగింది. అది విశ్వాసులు ఊహించనిది. ఒక్క గెంతుతో కందకాన్ని దాటి ప్రవక్త మనుషుల ముందు ఆ గుర్రం విజయ గర్వంతో నిలబడి ఉంది. యోధుడయిన అలీ అది చూసి భయ పడలేదు. కాని ఆయన ఆమిర్‌కు సరితూగడు. అయినా ప్రవక్త ﷺ ప్రార్థనలు ఆయనలోని ధైర్యాన్ని ద్విగుణీకృతం చేశాయి. ప్రారంభంలో కంగారుగా, కరవాలాన్ని గాలిలో ఝుళిపించారు. ఆమిర్ అహంకారంతో నవ్వాడు. అంతలో అలీ తన కరవాలాన్ని అతని భారీ శరీరంలో దిగేశారు.

ఖురైషి సైన్యం రోజు రోజుకూ కందకం దాటే ప్రయత్నం చేస్తూనే ఉంది. ముహమ్మద్ ﷺ మనుషులు వారిని చంపుతూనే ఉన్నారు. స్త్రీలు యుద్ధ ప్రాంతానికి దూరంగా ఉన్నప్పటికీ ఏ మాత్రం తటపటాయింపు లేకుండా అక్కడకు వచ్చేవాళ్ళు. యుద్ధంలో గాయమైన వాళ్ళకు సేవలు చేసేవాళ్ళు, విశ్వాసులకు నీళ్ళు అందించే వాళ్ళు.

చివరికి ప్రవక్త ﷺ ప్రార్థనల ఫలితమా అన్నట్లు వాతావరణం ఎంతో చల్లగా అయిపోయింది. ఎముకలు కొరికే చలి గాలులకు అబూ సుఫియాన్ సైనికులు గజగజ వణికిపోయారు. గుడారాలు లేచిపోయాయి. పచ్చగడ్డి లేక వారి గుర్రాలు ఆకలికి మలమల మాడిపోయాయి.

దానికి తోడు మంచు వర్షం కురిసి వాళ్ళ ధైర్యాన్ని ఇంకా దెబ్బతీసింది. జలుబుతో, అలసటతో అబూ సుఫియాన్ చేతులెత్తేశాడు. ముట్టడిని ఆపేస్తున్నట్లు ఆజ్ఞలను జారి చేసి తన సైన్యంతో మక్కా చేరుకున్నాడు.

మక్కా సైన్యం అటు వెళ్ళిందో లేదో ఎండ వేడిమి, మామూలు వాతావరణం తిరిగి మదీనాలో ఏర్పడ్డాయి.

ఖాళీ అయిపోయిన మైదానాలను చూసి ప్రవక్త ﷺ అనుచరులు కృతజ్ఞతా భావం నిండిన గొంతుతో, "అల్లాహు అక్బర్ – అల్లాహ్ అందరి కంటే గొప్పవాడు" అన్నారు. ఆ రోజు తెల్లవారు జామున వాళ్ళు తమ కరవాలాలను, కవచాలను కింద పెట్టి ప్రవక్త ﷺ వెనుక వరుసగా నిల్చున్నారు. ప్రవక్త ﷺ ఉషోదయపు ప్రార్థన మొదలుపెట్టారు.

"ఓ అల్లాహ్! నీ కీర్తిని కొనియాడుతున్నాము. నీకు స్తోత్రములు చెల్లిస్తున్నాము. నువ్వు కరుణామయుడివి. అత్యంత శక్తిమంతుడివి. నిన్ను గాక పూజించడానికి నీ సరసన ఇంకెవరూ లేరు."

https://teluguislam.net

# 19. తిరిగి రాక

ఒక రాత్రి ప్రవక్త కలగన్నారు, తను ఉమ్రా యాత్రలో భాగంగా ప్రశాంతంగా తిరిగి మక్కా చేరుకున్నట్లు. అక్కడ ఏ యుద్ధాలూ జరగలేదు, మక్కావారి నుంచి ఎలాంటి వ్యతిరేకతా కనబడలేదు.

ప్రవక్త మదీనాకు వచ్చినప్పటి నుంచే, పవిత్రమైన మక్కా నగరానికి యాత్ర చేసి మరొకసారి అల్లాహ్ గృహం కాబా వద్ద ప్రార్థన చేయాలనే ప్రగాఢమైన కాంక్ష ఆయనలో ఉన్నది. మక్కాకు దూరమై ఆరు సంవత్సరాలు అయ్యాయి. మక్కా వలసవాసులకు (ముహాజిర్లకు) ఇంటి దిగులు పట్టింది. ఈ ఆరు సంవత్సరాల్లో వారు అనుభవించిన పేదరికం, చేసిన యుద్ధాల వలన కూడా వారికి ఒకసారి తమ పుణ్యక్షేత్రాన్ని సందర్శించాలన్న తలంపు కలిగింది. తనకు వచ్చిన కల తనకు అల్లాహ్ అనుమతి అని ప్రవక్తకు తెలుసు.

తదనుగుణంగా ఒక సరియైన నెలలో ఒకరోజు ఉదయాన అందుకు ఏర్పాట్లన్నీ జరిగిపోయాయి. ప్రవక్త నాయకత్వంలో ఒంటెల మీద పదిహేను వందల మంది యాత్రికులు బయలుదేరారు. తెల్లగా, గర్వంగా, అందంగా దువ్వి అలంకరించిన మెత్తని పరుపులతో ఖస్వా పవిత్ర నగరం దిశగా బయలుదేరింది.

https://teluguislam.net

కాని ఈ విషయం విన్న మక్కాలోని ఖురైషులు భరించలేకపోయారు. తమ బద్ధ శత్రువులు విజయ గర్వంతో మక్కాలో పర్యటించటాన్ని వాళ్ళు సహించలేక పోయారు. అందుకని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇది జరగకూడదని వాళ్ళు తీర్మానించు కున్నారు.

మక్కాకు ఎనిమిది మైళ్ళ దూరంలో వున్న హుదైబియాకు యాత్రికులు చేరుకున్నారు. ఖురైషుల నుంచి ఒక వార్తాహరుడు వీరి ఉద్దేశం తెలుసుకోవటానికి వచ్చాడు. తమ సహజ హక్కు అయిన పవిత్ర కాబాయాత్రను ప్రశాంతంగా ముగించు కొని మదీనాకు వెళ్ళిపోవటమే తమ ఉద్దేశమని ప్రవక్త ﷺ చెప్పారు. వారికి నమ్మకం కలిగించడానికి ఉస్మాన్‌ను మధ్యవర్తిగా పంపించారు.

కాని అనుకున్న సమయానికి ఉస్మాన్ తిరిగి రానందున విశ్వాసుల్లో ఆందోళన మొదలయ్యింది. అతన్ని చంపేశారా? ఖురైషులు సాయుధ దాడికి సిద్ధమవుతున్నారా? విశ్వాసులు ఆయుధాలతో రాలేదు. మరి వాళ్ళు మక్కావాళ్ళ నుంచి తమను ఎట్లా రక్షించుకుంటారు?

తాము సిద్ధంగా లేనప్పటికీ యుద్ధం చేయాల్సి రావచ్చునని ప్రవక్త ﷺకు అనిపించింది. అల్లాహ్ పట్ల విశ్వాసంతో చేసిన ప్రమాణాలను మరొక్కసారి పునశ్చరణ చేసుకోమని ప్రవక్త ﷺ విశ్వాసులకు చెప్పారు. ఏడు సంవత్సరాల క్రితం ఒకానొక రాత్రి అఖబా లోయలో అనుచరులు తనకు ఇదే ప్రమాణం చేసారు.

హుదైబియా ప్రాంతం చెట్లతో, రాళ్ళతో నిండి ఉన్న ఒక మైదాన ప్రదేశం. ఆ ప్రాంతంలోని ఒక అకాసియా (తుమ్మ) చెట్టు కింద ప్రవక్త ﷺ నిల్చుని ఉన్నారు. తన మీద నమ్మకంతో తనకు ప్రతిజ్ఞ చేయడానికి అడుగులు ముందుకు వేస్తున్న వారితో ఆయన ﷺ చేతులు కలుపుతున్నారు.

సమయం మించిపోతున్నది. మక్కా నుంచి ఏ వార్తా రాలేదు. ఆదుర్దాగా కనుచూపు మేర చూస్తూ నిలబడ్డారు. చివరికి అల్లంత దూరంలో ఓ ఒంటె వస్తూ కనిపించింది. మక్కా నుంచి ఒక వార్తాహరుడు వీరి వద్దకు వచ్చాడు. ప్రశాంతంగా ఉమ్రా యాత్రను చేసుకోనివ్వటం ఖురైషులకు ఇష్టం లేదు. ఆ విషయాన్ని సూటిగా చెప్పకుండా, ముహమ్మద్ ﷺను ఈ యాత్రను చేయాలనే తన ఆకాంక్షను వచ్చే సంవత్సరం నెరవేర్చుకోమని వారు కబురు పంపించారు. అంతేకాదు, మక్కావాళ్ళు తాత్కాలికంగా యుద్ధ విరమణనూ కోరుకుంటున్నారు. ఇరువురూ దాని గురించి చర్చించుకున్నారు. శాంతి ఒప్పందాన్ని అలీ చేతుల మీదుగా రాయించటం జరిగింది. అలీ వాటిని విశ్వాసులకు చదివి వినిపించారు.

https://teluguislam.net

1. ఇరువర్గాల మధ్య రెండు సంవత్సరాల వరకు యుద్ధం ఉండదు, అందరూ శాంతియుతంగా జీవించాలి.
2. ముస్లింలు ఈ సంవత్సరం తిరిగి వెళ్ళిపోవాలి. కాబా యాత్రకు వచ్చే సంవత్సరం రావాలి. తమ కరవాలాలు ఒరల్లోనే ఉంచుకొని ఒక్క మూడు రోజులు మాత్రమే మక్కాలో ఉండాలి.
3. ఇరువర్గాల్లో ఎవరితోనైనా మైత్రీసంబంధాలను ఏర్పరచుకునే స్వేచ్ఛ ఇతర అరబ్బు తెగల వారికి ఉండాలి.
4. మదీనా గుండా పోయే ఖురైషుల వర్తక సమూహాలకు ఆటంకం కలిగించరాదు.
5. సంఘం అనుమతి లేకుండా ఏ ఖురైషు వ్యక్తి అయినా మదీనాకు పోతే అతనిని తిరిగి వెనక్కి పంపించేయాలి. కాని అదే మదీనా నుంచి ఒక ముస్లిం మక్కాకు వస్తే మాత్రం అతను తిరిగి వెళ్ళిపోవటానికి వీలులేదు.

ఆ ఒప్పందం మీద ప్రవక్త ﷺ సంతకం చేయటాన్ని చూసిన విశ్వాసులు ఎంతో ఆశ్చర్యానికి, అసంతృప్తికి లోనయ్యారు. పక్కనే ఉన్న ఉమర్ అయితే వెంటనే అబూ బక్ర్ దగ్గరకు వెళ్ళి పెద్దగా అరుస్తూ.....

"ఏమిటిది, ముహమ్మద్ ﷺ దైవ ప్రవక్త కాదా? మనం విశ్వాసులం కామా? అల్లాహ్‌పై, ధర్మంపై నమ్మకం లేనోళ్ళే కదా మక్కావాళ్ళు? అటువంటప్పుడు మనం ఎందుకు ఈ అవమానాల్ని సహిస్తున్నాము? ప్రతి సంవత్సరం కాబా యాత్ర చేయటం ప్రతి అరబ్బుకు వున్న హక్కు. అసలు వీటన్నింటిని పక్కన పెడదాం. ఇస్లాం స్వీకరించి మదీనాకు వచ్చే వాళ్ళను తిరిగి వెనక్కి పంపాలా? మదీనా నుంచి మక్కా పోయిన వాళ్ళ విషయంలో మనం ఏమి మాట్లాడకూడదా? అన్నింటిని అతిక్రమిస్తున్న ఈ ఒప్పందాలను మనం ఎందుకు ఆమోదించాలి?"

నెమ్మదిగానే, కాని బలంగా అబూ బక్ర్ సమాధానం చెప్పారు.

"యుద్ధం కొరకు యుద్ధం అనే దాన్ని దైవప్రవక్త ﷺ ఇష్టపడరు. ఆయన అల్లాహ్ ప్రవక్త ﷺ కనుక ఈ చర్యల పర్యవసానాలు ఆయనకు తెలుసు, వాటిని ఆయన ఊహించగలుగుతారు. అదే నువ్వో, నేనో అయితే ముందుగానే చెప్పడం మనకు సాధ్యపడని విషయం. కనుక నువ్వు సాధ్యమైనంత ఓపికతో ఈ ఒప్పందం ఫలితం కొరకు నిరీక్షణ చేయి."

ఆ ఒప్పందం మీద సంతకం అయిన తరువాత ఎక్కువ మంది స్థానిక తెగల

https://teluguislam.net

వాళ్ళు ఇస్లామ్ వైపే ఎక్కువ శక్తి ఉన్నదని గ్రహించారు. అందువలన వాళ్ళంతా ఇస్లాంకు, ముస్లింలకు స్నేహ హస్తం అందివ్వటానికి ముందుకు రావటం ప్రారంభించారు.

ప్రవక్త(స)కు చెందిన వెండి ముద్రతో సీల్ చేయబడిన ఉత్తరాలను తీసుకొని సమీప రాజ్యాలకు రాయబారులు పంపబడ్డారు. హిరాక్లియస్ రాజుకు సత్యం తెలుసు. కాని ఇస్లాంను స్వీకరించేంత ధైర్యం లేదు. అబిసీనియా రాజు నెగస్ ప్రతిస్పందనగా ప్రవక్త(స)కు తన అభినందనలు, గౌరవం తెలియపరిచాడు. ఇస్లాంను స్వీకరించాడు. మక్కా హయాంలో ముస్లింలు అష్టకష్టాలు పడుతున్న కాలంలో అబిసీనియాకు వలస వెళ్లిన ఎంతోమంది విశ్వాసులకు అతను బాసటగా నిలిచాడు. ఈజిప్ట్ దేశపు రోమన్ గవర్నర్ ప్రవక్త(స)కు ఎన్నో బహుమతులు పంపించాడు. చివరికి పర్షియన్ మహా రాజుకు కూడా లేఖను పంపించటం జరిగింది. అతను దానిని చించివేశాడు. అతను ఎంత మామూలుగా లేఖను చించివేశాడో, అంతే మామూలుగా అల్లాహ్ అతని సామ్రాజ్యాన్ని చీలుస్తాడని ప్రవక్త(స) ప్రకటించారు. తర్వాతి సంవత్సరాలలో ఆయన అన్నది నిజమయింది. పర్షియా అంతా కలసికట్టుగా ప్రవక్త జెండా కింద నిలబడింది.

ఒక సంవత్సరం గడిచిపోయింది.

ఖాలిద్ బిన్ వలీద్ ఒంటరిగా చీకటిలో తన గుడారానికి బయట నిలబడి కింద కనిపిస్తున్న మక్కాను చూస్తున్నారు. అబూ సుఫియాన్‌కు, ఇతరులకు కొంచెం దూరంలో ఆయన తన గుడారాన్ని ఏర్పాటు చేసుకున్నారు. ఆ సమయంలో ఆయనకు ఒంటరిగా ఉండాలనిపించింది. ఆయన నిజాయితీ గల యోధుడు. నగర వ్యాపారులతో అంతంత మాత్రమే సంబంధం కలిగి ఉన్నవారు. అంతేగాకుండా ఆ రోజు తను చూసిన, విన్న విషయాలను అర్థం చేసుకోవడానికి కొంత సమయం అవసరమని ఆయన భావించారు. దాని గురించే ఆలోచిస్తూ చీకటిలో పర్వత శ్రేణుల పైకి నడచుకుంటూ వెళ్తున్నారు.

ఉదయం అబూ సుఫియాన్ మక్కావాసులను నగరం వెలుపలి పర్వతాల మీదికి తీసుకెళ్ళారు. పోయిన సంవత్సరం ప్రవక్త(స)తో చేసుకున్న ఒప్పందం ప్రకారం ప్రవక్తకు, ఆయన అనుచరులకు ఆ పవిత్రమైన కాబా యాత్రను చేసుకునే వీలును కల్పించారు.

ఉదయాన్నే రెండు వేల మంది యాత్రికులు ప్రవక్త(స) నాయకత్వంలో మక్కా చేరుకున్నారు. శుభ్రమైన, కుట్టనటువంటి తెల్లని వస్త్రములు ధరించిన వాళ్ళు ఆ లోయలో ఒక పెద్ద తెల్లని మేఘంలా ఉన్నారు.

https://teluguislam.net

ఖాలిద్ కొండ పైన నిలబడి పరిశీలనగా ముహమ్మద్ﷺ ను చూశారు. ఆయన పరిశీలనలో ముహమ్మద్ﷺ గొప్ప యోధులు. తనని తాను ప్రవక్తగా ప్రకటించుకున్నవారు. మక్కా నగరపు ఖాళీ వీధుల్లో ఊరేగింపుకు నాయకత్వం వహిస్తున్నారు. "లబ్బైక్ అల్లాహుమ్మ లబ్బైక్ (హాజరయ్యాము ఓ అల్లాహ్! హాజరయ్యాము" అని విజయవంతంగా అంటున్న నినాదాలను ఖాలిద్ విన్నారు.

తరువాత ఊరేగింపు నిశ్శబ్దంగా ఉండిపోయింది. ముహమ్మద్ﷺ ముందుకు వచ్చి కాబా గోడలో ప్రతిష్టించివున్న నల్ల రాతిని ఎంతో ప్రేమగా స్పర్శించారు. తరువాత ఏడు సార్లు దాని చుట్టూ ప్రదక్షిణలు చేశారు. యాత్రికులంతా ఒక పెద్ద దైవదూతల సైన్యం మాదిరి ప్రవక్తను అనుసరించారు. "అల్లాహ్ ఒకే ఒక్కడు. ఆయన తన దాసుణ్ణి ఎన్నుకున్నాడు. తన విశ్వాసులకు గౌరవం ప్రసాదించాడు. విగ్రహారాధకుల పీడ వదిలించాడు" అని ఉచ్చరిస్తూ ముందుకు కదిలారు.

ఖాలిద్ ప్రవక్తను గమనిస్తూనే ఉన్నారు. ముహమ్మద్ﷺ తన అనుచరులతో కలసి సఫా నుంచి మర్వా వరకు ఏడు సార్లు తిరిగారు. పూర్వం తల్లి హాజిరా అలాగే చేసింది. తన పసికందు ఇస్మాయీల్‌కు త్రాపించేందుకు నీళ్ళు వెతకటానికి వెళ్ళినప్పుడు ఇలా జరిగింది.

ఆ తరువాత ప్రవక్తﷺ ఇంకొన్ని సంప్రదాయాలు ఆచరించారు. తల వెంట్రుకలను గొరిగించుకున్నారు. ఒంటెలను బలి ఇచ్చారు. ఆ రాత్రి యాత్రికులంతా మక్కాలోనే మకాం చేసారు. ప్రవక్తﷺ ఒక్కరు మాత్రం కాబా లోపలి గదిలోనే ఉండిపోయారు.

వేకువ జామును ముందు ఆ నిశ్శబ్ద వాతావరణంలో బిలాల్ ఉషోదయపు ప్రార్థనా పిలుపు కొరకు కాబా పైకి ఎక్కారు. మక్కా నగరంలో ప్రార్థన కొరకు ఇదే మొట్టమొదటి ఇస్లామీయ పిలుపు.

ఆ పిలుపు నగరం నలుదిక్కులా ప్రతిధ్వనించింది. పట్టణమంతా దద్దరిల్లింది. 'అల్లాహు అక్బర్–అల్లాహ్ అందరి కంటే గొప్పవాడు' అనే శబ్దం పర్వత శ్రేణులకు చేరింది. అక్కడ ఖాలిద్ ఉన్నారు. ఆ శబ్దం ఆయన కర్ణపుటాలను తాకింది. ఆయన తిరిగి ప్రవక్తను గమనించసాగారు.

https://teluguislam.net

ప్రవక్త నాయకత్వంలో రెండు వేల మంది యాత్రికులు ప్రార్థన చేయడం మొదలుపెట్టారు. ఆ వెండి సూర్యకాంతిలో వాళ్ళంతా ఎంతో క్రమంగా, లయబద్ధంగా ముందుకు వంగుతున్నారు, నిటారుగా లేస్తున్నారు. ఇదంతా చూసి ఖాలిద్ భావాతీతంతో ఉండిపోయారు. అప్పుడు ఆయన దీన్ని అర్థం చేసుకోవడం ప్రారంభించారు. అల్లాహ్ ఒక్కడే..... మతం ఏమిటి? అసలిదంతా ఏమిటి?

మూడవ రోజున యాత్రికులు ఖాళీ మక్కా నగరాన్ని విడిచిపెట్టి మదీనాకు తిరిగి వెళ్ళారు.

ఇది జరిగిన కొంత కాలానికే ఖాలిద్ మదీనాలోని మస్జిద్ ప్రాంగణానికి స్వారీ చేసుకుంటూ వచ్చారు. ప్రవక్త ﷺ ముందు, అక్కడికి వచ్చిన వారందరి ముందు తన విశ్వాసాన్ని ప్రకటించారు. అల్లాహ్ ఒక్కడేనని, అల్లాహ్ ప్రవక్త ﷺ పట్ల తనకు విశ్వాసం కలిగిందని అన్నారు. చివరికి ఆ రెండు సంవత్సరాల శాంతి ఒప్పందం పూర్తయింది. అప్పుడే ఖురైషులకు – విశ్వాసులకు మధ్య ఒక సంఘటన జరిగింది. ఖురైషుల వైపు ఉన్న ఒక తెగ, విశ్వాసుల వైపు ఉన్న ఒక తెగ మీద దాడి చేసి వారిని చంపేసింది. అదీ రక్తం చిందించకూడని, పవిత్ర మస్జిదు ప్రాంగణంలోనే జరిగింది. ఖురైషులు ఆ తెగవారికి సహాయం చేశారు.

కాని ఆ తర్వాత వెంటనే ఖురైషులు తాము చేసింది తప్పని గ్రహించి చాలా భయపడిపోయారు. ఇప్పుడు ఏమి చేయగలం? తమ వాళ్ళే శాంతి ఒప్పందానికి విఘ్నం కలిగించారు.

ప్రవక్త ﷺ సైన్యం వేలల్లో పెరిగి ఇప్పుడు చాలా బలంగా ఉంది. ఖచ్చితంగా వాళ్ళ మీద దాడి చేస్తున్న అబూ సుఫియాన్ సైన్యం చాలా తగ్గిపోయింది. ఎందుకంటే చాలా తెగలు వారిని వదిలి వెళ్ళిపోయాయి. ఉన్న సైన్యం కూడా పట్టుదలను కోల్పోయింది. అబూ సుఫియాన్ ప్రాముఖ్యత చాలా తగ్గిపోయింది.

అనాలోచితంగా ఒక రోజు అబూ సుఫియాన్ మదీనాకు వెళ్ళారు. ఈ పరిస్థితుల్లో తాను ఏమి చేయగలనో తెలుసుకుందామనుకున్నారు. ప్రవక్త ﷺ, ఆయన సహచరులు అబూ సుఫియాన్‌ను పట్టించుకోలేదు. ఆయన మక్కాకు తిరిగి వచ్చారు. ఇప్పుడు ఆయనలో భయం ఇంకా పెరిగింది.

https://teluguislam.net

అదే రోజు సైన్యంతో మక్కా మీదకు పోవడానికి ప్రవక్త ﷺ సిద్ధమయ్యారు. ప్రవక్త ﷺ తన నివాసంలో ఈ దాడి రహస్యంగా ఉండాలని ప్రార్థించారు. అలాగే అన్ని ఆదేశాలు కూడా దళపతులకు జారీ చేసారు. అవే వాళ్ళు తమ మనుషులకు తెలియజేశారు.

"మక్కాకు పోయే దారులన్నీ మూసివేయాలి. రోడ్ల మీద సంచరించే వాళ్ళం దరిని అప్రమత్తం చేయాలి, వారిని నిలిపి వేయాలి. ఎవరన్నా మక్కా వారికి ఉత్తరం రాస్తే అతను మన చెయ్యిని వదిలినట్లే అని అనుకోవాలి. మక్కాకు వెళ్తున్నప్పుడు దారిలో ఎవరు కూడా దీనిగురించి ఒక్క ముక్క మాట్లాడకూడదు. ఎటువంటి యుద్ధ పరమైన వాయిద్య శబ్దాలు గాని లేదా సైనికుల అరుపులు కాని వినిపించకూడదు."

ప్రవక్త ﷺ ఆదేశానుసారం పది వేల మంది సైన్యం చాలా తక్కువ మందికి తెలిసిన కొండమార్గాల గుండా, ఎవరూ ప్రయాణించని రాళ్ళ గుండా బయలుదేరారు. వారి రాక గురించి ఎవరికి తెలియదు. ప్రవక్త ﷺ చెప్పినట్లు దాన్ని రహస్యంగానే ఉంచారు. అలా ఆయన ఇచ్చిన ఆదేశాలను అనుసరించారు.

వాళ్ళు మక్కాకు సగం దూరం పోయిన తరువాత ఉమర్ కొంచెం దూరంలో దేనినో పసిగట్టి పెద్దగా అరిచారు.

"అల్లాహ్; మక్కా నుంచి వస్తున్న వాళ్ళు ఎవరు? ఓ దైవప్రవక్తా ﷺ ! నేను ప్రమాణం చేస్తున్నాను మన వాళ్ళు ఎవరూ ఈ రహస్యాన్ని వారికి అందచేయలేదు."

ఉమర్ ఆశ్చర్యాన్ని ప్రవక్త ﷺ పెద్ద విషయంగా తీసుకోలేదు. తలను ఒకసారి ఊపి చిరునవ్వు నవ్వి ఊరుకున్నారు.

ఆ ప్రయాణికుడు వీరిని సమీపించాడు. "శుభోదయం! శుభోదయం! నా ప్రియ సోదరకుమారా! నువ్వు శాంతిగా ఉండుగాక!" అందరికీ పరిచితమైన అబ్బాస్ గొంతు వినిపించింది.

ప్రవక్త ﷺ వెనుక ఉన్న పది వేల మంది సైన్యాన్ని పట్టించుకోకుండానే ఇంకా ఇలా అన్నారు: "నీకు అభ్యంతరం లేకపోతే నేనూ, నా కుటుంబం మీతో కలుస్తాం'.

"నువ్వు, నీ కుటుంబం అల్లాహ్ ఒక్కడే అని, ముహమ్మద్ ﷺ అల్లాహ్ ప్రవక్త అని విశ్వసిస్తున్నారా?" అబ్బాస్ మాటలకు అడ్డు తగిలి ఉమర్ సందేహిస్తూ అడిగారు.

https://teluguislam.net

"అది చెప్పాల్సిన అవసరం లేదు. అంతా నీకు ఇష్టమైనట్లే ఉంటుంది. కాని నీ చేతిలో ఉన్న ఈటెను నా వైపు గురి పెట్టకు" భుజాలు ఎగరేసి అన్నారు అబ్బాస్.

"పెదనాన్నా! ప్రవక్తల్లో నేను చివరివాణ్ణి అయినట్లు మదీనాకు వలస వచ్చినవాళ్ళల్లో మీరే చివరివారు" అని ప్రవక్త ﷺ ప్రతిస్పందించారు. ఆ పెద్ద సైన్య సమూహం నిశ్శబ్దంగా, స్థిరంగా మక్కా వైపు సాగిపోయింది. కనిపిస్తున్నంత దూరంలో మక్కా ఉందనగా, ప్రవక్త ﷺ సైన్యం ఆ రాత్రికి అక్కడ విశ్రమించాలనుకున్నారు.

పశ్చిమం నుంచి తూర్పుకు వెయ్యికి పైగా కాగడాలను వెలిగించారు.

ప్రవక్త ﷺ గుడారాల్లో అసంఖ్యాకంగా వెలుగుతున్న కాగడాలను మక్కా నుంచి చూసిన అబూ సుఫియాన్ గుండె జారిపోయింది. అంతకు ముందు కూడా ఒకసారి ఇలాగే జరిగింది. కాని ఈ సారి అక్కడ ఎన్ని కాగడాలు వెలుగుతున్నాయో అంత మంది మనుషులు ఉన్నట్లు ముందుగానే మనస్సులో అనిపించింది. అప్రమత్తమై ఆయన మక్కా నుంచి ఆ గుడారాల వద్దకు చేరుకున్నారు, మక్కా ప్రజల భవిష్యత్తును అంచనా వేయటానికి.

అది చీకటి రాత్రి. కాని కాగడాల వెలుగులో అబూ సుఫియాన్ జాగ్రత్తగా గుట్టపైకి ఎక్కుతూ ప్రవక్త ﷺ గుడారానికి చేరుకోగలిగారు. అకస్మాత్తుగా ఆయన ముందు ఒక రూపం ప్రత్యక్షమైంది. 'లాత్ దేవతా! నన్ను రక్షించు' అని అస్పష్టంగా, నీరసంగా పలికారు.

"హో; నేను నిన్ను చూడటం మంచిదయ్యింది, అబూ సుఫియాన్! ఇటు నుంచి నువ్వు రావటం కూడా మంచిదయింది" అని అన్నారు అబ్బాస్.

అబ్బాస్ అక్కడి గుడారపు ఎత్తు ప్రాంతంలో ఉన్నారు. "ఆ దిశలో నువ్వు చూస్తున్న కాగడాల ప్రకారం పది వేల మంది ఉన్నారు. నీ సైన్యాన్ని తీసుకొని నువ్వు మాతో కలిసిపోవడం మంచిది. నువ్వు వీళ్ళను ఓడించే మార్గమేది లేదు. అందుకని నాతో పాటు ప్రవక్త ﷺ దగ్గరకు రా. ఆలస్యం చేయకు. ఇప్పుడే నా వెనుకగా ఏమి మాట్లాడకుండా నా ఈ గాడిద మీద ఎక్కి కూర్చో."

"ఏమి ఈ పరాభవము; ఈ హాస్యగాడి వెనుక గాడిద మీద నేను కూర్చోవడమేమిటి, మరీ ముఖ్యంగా ముహమ్మద్ ﷺ దగ్గరకు బలిపశువు మాదిరి పోవడమేమిటి?" అని అబూ సుఫియాన్ నిరుత్సాహంగా ఆలోచించుకున్నారు.

https://teluguislam.net

"ఆగు; ఎవరక్కడా; రా ఇటు. నా కరవాలం నీ మెడను ముద్దు పెట్టుకోవడానికి ఆహ్వానిస్తున్నది, రా దుష్టుడా రా" – అబూ సుఫియాన్‌ను గుర్తించి చీకటిలో ఒక దుముకు దుమికి ఉమర్ పెద్దగా కేక వేశారు.

"ముందు నీ చేతిలోనిది పక్కనపెట్టు. ముహమ్మద్ﷺను కలవడానికి ఇతనికి ఒక అవకాశం కల్పించు" అబ్బాస్ మృదువుగా మందలించే సరికి ఉమర్ అలాగే చేసారు.

మరుసటి రోజు ఉదయాన్నే ప్రవక్త గుడారంలోనికి అబూ సుఫియాన్‌ను తీసుకొని వచ్చారు. ప్రవక్తﷺ చూపుల నుంచి తప్పించుకునే ప్రయత్నం చేయసాగారు అబూ సుఫియాన్. ప్రవక్తﷺ మాత్రం ఆయన వైపు తదేకంగా చూస్తున్నారు. అనునయిస్తున్న గొంతుతో దైవప్రవక్తﷺ అడిగారు, "అబూ సుఫియాన్! అబూ సుఫియాన్! అల్లాహ్ ఒక్కడే అని మీకింకా అనుభవం కలగలేదా, అలా అని మీరు అనుకోలేదా..?"

అబూ సుఫియాన్‌కు కోపం వచ్చింది. కనుబొమ్మలు ముడుచుకుని పోయాయి. నోరు వంకరపోయింది.

'స్'.. అనే శబ్దం చేస్తూ ఆయనను పట్టుకుని కుదిపి అబ్బాస్ చెప్పారు, "సుఫియాన్! చెప్పు.. చెప్పి గమ్మునుండు, ఇది ఆటలాడుకునే సమయం కాదు."

గుడారంలోని ఒక మూల నుంచి గంభీరమైన ఉమర్ మాటలు వినిపించాయి. "బహుశా నేను నీకు నచ్చేటట్లు చెప్పగలను."

అబూ సుఫియాన్ సమీపంగా వచ్చి సంశయంగా, గొనుగుతున్నట్లుగా మాట్లాడారు. ఆయనను లెమ్మని చెప్పి ప్రవక్తﷺ అన్నారు:

"భయపడకండి... మీరు మక్కాకు వెళ్ళిపోండి. మీ శరణు కోరి మీ ఇంటిలో ఉన్నవారికి ఈ రోజు ఎటువంటి ప్రమాదం జరగదు".

ఈ సందేశం తనవారికి వినిపించేందుకు అబూ సుఫియాన్ వెంటనే వెళ్ళి పోయారు. అరబ్బు తెగల యుద్ధ సన్నాహాలను చూడటం మాత్రం ఆయన వదిలి పెట్టలేదు.

● ● ●

"ఓ ఖురైషు ప్రజలారా! ముహమ్మద్ﷺ మనకు సమీపంలో ఉన్నారు. ఆయన దగ్గర పెద్ద సైన్యం ఉంది. దాన్ని మనం నిలువరించ లేము. మీ ఇండ్లకు మీరు


https://teluguislam.net

పారిపోండి. లేదా మా ఇంటికి రండి, లేదంటే కాబాకు వెళ్ళండి. మీరు సురక్షితంగా ఉంటారు." మక్కాలో అబూ సుఫియాన్ ప్రకటన ప్రతిధ్వనించింది.

మక్కా ప్రజలు తమ ఇంటి తలుపుల వెనుక దాక్కుని కిటికీల గుండా తొంగి చూస్తూ ఎదురు చూడసాగారు. చివరికి వాళ్ళు చూసిన సన్నివేశాలు వారికి ఎంతో ఆశ్చర్యాన్ని కలిగించాయి. దక్షిణం నుంచి బిడోయిన్ తెగల వాళ్ళు ఖాలిద్ నాయకత్వంలో వచ్చారు. ఉత్తరం నుంచి అజ్జ్ నాయకత్వంలో పెద్ద పటాలాలు, పడమర నుంచి సాద్ నాయకత్వంలో మదీనా సహాయకులు (అన్సార్లు), తూర్పు నుంచి ఉబైదా నాయకత్వంలో వలసవాసులు (ముహాజిర్లు) వచ్చారు. వీరందరి వెనుక స్వారి మీద ఉన్న ముహమ్మద్ﷺకు ఒక వైపు అబూ బక్ర్, మరో వైపు ఉమర్‌లు ఉన్నారు. నల్లటి కవచాలు ధరించి, ఈటెలు ఆయుధాలు పట్టుకొని ఉన్నవారికి అలీ నాయకుడుగా ఉన్నారు.

దక్షిణ ప్రాంతంలో జరిగిన ఒక చిన్న కొట్లాట తప్పించి, ప్రవక్త సైనిక దళాలు అన్నీ ప్రశాంతంగానే మక్కా నగరంలోకి ప్రవేశించాయి.

మక్కాలో కొంత దూరం కవాతు జరిపాక తన స్థానం నుంచే ప్రవక్తﷺ అల్లాహ్‌కు కృతజ్ఞతలు తెలుపుకున్నారు. విగ్రహారాధకుల మీద తన విజయానికి సంతృప్తి చెందారు. తన సైన్యం నాలుగు విభాగాలుగా ఏర్పడి మక్కా నగరాన్ని వివిధ కేంద్రాల నుంచి ఆక్రమించుకోవటాన్ని ప్రవక్తﷺ గమనిస్తున్నారు. అంతేకాదు, ఆయన మక్కా వీధులను చూస్తూ ముందుకు నడుస్తున్నారు. బాల్యంలో తాను పెరిగిన అబూ తాలిబ్ ఇంటినీ, తనకు సొంతమైన ఖదీజా ఇంటిని, మక్కా నుంచి విడిచి మదీనాకు వెళ్ళిపోతున్నప్పుడు చివరగా తాను ఉండిన అబూ బక్ర్ ఇంటిని చూస్తూ



https://teluguislam.net

ముందుకు కదలుతున్నారు. వెచ్చగా తాత దుప్పటి కప్పుకొని నక్షత్ర రాత్రులలో తాత చెప్పిన జమ్ జమ్ బావి, వంద ఒంటెలు.... మొదలగు చారిత్రక సంఘటనలు విన్న స్థలం పవిత్రమైన కాబాను చూస్తూ పోతున్నారు.

ముహమ్మద్ﷺ ఒంటె మీద నుంచి క్రిందికి దిగి యాత్రికుడి వస్త్రాలను ధరించి కాబాను సందర్శించారు. అక్కడ ప్రవక్తﷺ మక్కావాసులందరి ముందు, తన పదివేల మంది సైన్యం సమక్షంలో పవిత్ర నల్లరాతిని స్పర్శించి కాబా చుట్టూ ఏడు సార్లు ప్రదక్షిణలు చేసారు.

తర్వాత ఎంతో వికారంగా వున్న హుబల్ విగ్రహం ముందు నిలబడి, "సత్యమే జయించింది, అసత్యం నశించింది. ఎప్పటికైనా అసత్యం నశించిపోవలసిందే" అన్నారు.

ఆ పెద్ద హుబల్ విగ్రహం పతనమైపోయి చిన్న చిన్న ముక్కలుగా విరిగి నేలమీద పడిపోయాయి.

ముహమ్మద్ﷺ కాబా తాళం చెవిని తీసుకున్నారు. వెంటనే అన్ని విగ్రహాలను తొలగించమని ఆదేశాలు జారీ చేశారు.

అధికార పూర్వకంగా నగరమంతా ప్రకటన చేయడానికి ఒక చాటింపుదారుణ్ణి పంపించారు. ఇదీ ఆ ప్రకటన; 'ఎవరైతే ఒక్క అల్లాహ్‌ను నమ్ముతారో, అంతిమ తీర్పు పట్ల ఎవరికైతే విశ్వాసం ఉన్నదో, వారు ఎటువంటి విగ్రహం కనిపించినా ధ్వంసం చేయకుండా వదిలిపెట్టవద్దు.' ప్రజలంతా అన్ని రకాల విగ్రహాలను, ఆకారాలను తలుపుల గుండా ద్వారాల గుండా వీధుల్లోకి విసిరి, ప్రమాదం లేదనుకుని హాయిగా శ్వాస పీల్చుకున్నారు.

ఆ తరువాత రెండు సంవత్సరాలకు చిట్టచివరి అల్లాహ్ ప్రవక్త ముహమ్మద్ﷺ పరమపదించారు. మరణానికి ముందు తన అంతిమ హజ్ యాత్రను కూడా చేశారు. అల్లాహ్ తనకు ఇచ్చి పంపిన కార్యాన్ని నెరవేర్చారు. తాను మానవుల కొరకు నిర్ణయించిన జీవన ధర్మం ఇస్లాంను తన చిట్టచివరి ప్రవక్త ముహమ్మద్ﷺ ద్వారా అల్లాహ్ పరిపూర్ణం చేశాడు.

https://teluguislam.net